www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 26-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 101 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: విదియ రా.10:42 తదుపరి తదియ, నక్షత్రం: ఆశ్లేష మ.3:52 తదుపరి మఖ, వర్జ్యం: శేషం ఉ. 6:19, తె.4:07-5:45, దుర్ముహూర్తం: ఉ.5:56-7:39, అమృతఘడియలు: మ.2:16-3:52, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 5:56, సూర్యాస్తమయం: 6:47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ముదురుతున్న టెంపుల్ వార్!

థాయ్‌లాండ్, కంబోడియా మధ్య మరింత పెరిగిన దాడులు

20కి చేరిన మృతులు

లక్షన్నర మంది సురక్షిత ప్రాంతాలకు

థాయ్‌లాండ్ సరిహద్దుల్లోని 8 రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి 11


ఘర్షణల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న థాయ్ మహిళలు

డ్రోన్ నుంచి దూసుకెళ్లిన స్వదేశీ క్షిపణి

యూఎల్‌పీజీఎం-వీ3 పరీక్ష విజయవంతం

కర్నూలులోని ఎన్‌ఓఏఆర్‌లో పరీక్షించిన డీఆర్‌డీవో

లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే 12.5 కిలోల క్షిపణి

రక్షణ వ్యవస్థలో ఇదో మైలురాయి: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ/ఓర్వకల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మన దేశ ఆయుధ బలం రోజురోజుకూ పదునెక్కుతోంది. స్వదేశీ ఆయుధాల సామర్థ్యంలో తాజాగా మరో ముందడుగు పడింది. డ్రోన్ల నుంచి లక్ష్యాల పైకి దూసుకెళ్లే తేలికపాటి క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. యూఏవీ లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం)-వీ3ని

మిగతా 2వ పేజీలో...


డ్రోన్ ద్వారా ప్రయోగించిన క్షిపణి

కుప్పకూలిన స్కూల్ భవనం

రాజస్థాన్‌లో దుర్ఘటన.. ఏడుగురు విద్యార్థుల మృతి

28 మందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

ఉదయం వేళ ప్రార్థనకు సిద్ధమవుతుండగా ఘటన

వర్షాలతో నిలిచిన వరద.. గోడలు దెబ్బతినడంతోనే ప్రమాదం

పాఠశాల హెడ్‌మాస్టర్ సహా ఐదుగురు టీచర్ల సస్పెన్షన్

సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్


పాఠశాల శిథిలాలను తొలగిస్తున్న స్థానికులు 2

పీ4లో నేను సైతం!

కుప్పంలో 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నా



పీ4 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పక్కన సీఎస్, కుటుంబరావు తదితరులు

నేడు సింగపూర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆరు రోజుల పాటు పర్యటించనున్న సీఎం

అందరిలో చైతన్యం నింపి ఉద్యమంలా సాగిద్దాం

ప్రవాసాంధ్రులను భాగం చేద్దాం: చంద్రబాబు

ఆగస్టు 10 లోగా ప్రాధాన్యతల సర్వే

మార్గదర్శులుగా 57,503 మంది నమోదు

మూడు విధానాల్లో జీరో పావర్టీ అమలు

పీ4 సమీక్షలో అధికారులతో ముఖ్యమంత్రి

ఆయుష్‌లో 358 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

71 మంది వైద్యులు, 26 మంది మేనేజర్లు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ కుటుంబాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు. ఈ మేరకు 'ఐ యామ్ మార్గదర్శి' బ్యాడ్జిని అధికారులు చంద్రబాబుకు అందించారు. సచివాలయంలో జీరో పావర్టీ పీ4పై సమీక్ష నిర్వహించారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబ సభ్యులూ భాగస్వాములవుతారని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు. అందరిలోనూ చైతన్యం నింపేందుకు, మరింత మంది సంపన్నులు మార్గదర్శులుగా ముందుకు వచ్చేందుకు తన నిర్ణయం

మిగతా 13వ పేజీలో...


మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జుతో ప్రధాని

₹4,850 కోట్లు..

మాల్దీవులకు రుణ సాయం

ఆ దేశ పర్యటనలో ప్రకటించిన నరేంద్ర మోదీ

ప్రధానికి ఘన స్వాగతం పలికిన మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, మంత్రులు

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చర్చలు

మాలె, జూలై 25: మాల్దీవులకు రూ. 4,850 కోట్ల రుణ సాయం చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ దేశానికి భారత్ నమ్మకమైన మిత్రుడని పేర్కొన్నారు. శనివారం జరగనున్న మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు మాల్దీవుల రాజధాని మాలెలో శుక్రవారం ఉదయం ఘన స్వాగతం

మిగతా 2వ పేజీలో...

అధికారంలో ఉండగానే కులగణన చేయాల్సింది

నాడు ఓబీసీల విషయంలో తప్పుచేశా

అప్పట్లో వాళ్ల సమస్యల్ని అర్థం చేసుకోలేక పోయా: రాహుల్ 13

శ్రీలక్ష్మికి షాక్!

ఆమె విచారణ ఎదుర్కోవాల్సిందే!

తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

ఓఎంసీ కేసులో ఆమె పిటిషన్ కొట్టివేత

గతంలో ఇదే కోర్టులో ఊరట.. ఇప్పుడు ఎదురుదెబ్బ

నాడు శ్రీలక్ష్మికి ఊరట కల్పించడంపై సుప్రీంకు వెళ్లిన సీబీఐ

ఆమె పిటిషన్‌పై మళ్లీ విచారించాలని హైకోర్టుకు ఆదేశం

రెండోసారి విచారించి పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం

ఆమె పాత్ర దర్యాప్తులో తేలుతుందని వ్యాఖ్య



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో ఏపీకి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆరో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి సీబీఐ కోర్టులో పూర్తిస్థాయి విచారణ ఎదుర్కోవాల్సిందేనని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. ఆమె దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. మాజీ మంత్రి, మైనింగ్ వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అక్రమ మైనింగ్ కుంభకోణానికి శ్రీలక్ష్మి సహాయపడ్డారని సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇతర నిందితులుగా ఉన్న ఓఎంసీ డైరెక్టర్లు బీవీ శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, అలీఖాన్‌లను సీబీఐ కోర్టు దోషులుగా తేల్చిన విషయం తెలిసిందే. అయితే శ్రీలక్ష్మి క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు ఆమెకు ఊరట కల్పించింది. దీంతో ఆమె పాత్రపై సీబీఐ కోర్టులో విచారణ

మిగతా 13వ పేజీలో...

నా ఫ్లాట్‌లో డబ్బు దాచేవారు

వైసీపీ ఓడిపోగానే తీసుకెళ్లారు.. తర్వాత నన్ను దుబాయ్ పంపారు

రాజ్ కసిరెడ్డి ఈవీ డిజైన్ కోసం ఇంజనీర్‌గా పనిచేశా 14

లిక్కర్ స్కామ్ గురించి తెలీదు.. సిట్ విచారణలో ఏ-47 బెత్రాపూన్ షాజిల్ షేక్



 13

ఏపీ, తెలంగాణల్లో నియోజకవర్గాల పునర్విభజనకు

సుప్రీం తిరస్కృతి

అసెంబ్లీ సీట్లు పెంచాలన్న పిటిషన్ కొట్టివేత

తెలుగు రాష్ట్రాల్ని కశ్మీర్‌తో పోల్చలేమని వెల్లడి



ఆకలి చావుల అంచున గాజా

పిట్టల్లా రాలిపోతున్న చిన్నారులు

నిత్యావసరాల సరఫరాపై ఇజ్రాయెల్ ఆంక్షలే కారణం

ఇజ్రాయెల్-హమాస్ శాంతి చర్చలు నిలిపివేసిన అమెరికా!

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించనున్న ఫ్రాన్స్

గాజా, పారిస్, వాషింగ్టన్, జూలై 25: గాజాలో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. యుద్ధం కారణంగా మహిళలు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ముఖ్యంగా పోషకాహార లోపం, ఆకలితో చిన్నారులు అల్లాడి పోతున్నారు. శరీరం బక్కచిక్కి, పొత్తి కడుపులు ముడుచుకుపోయి, ఎముకలు

మిగతా 11వ పేజీలో...

పెద్దాపురంపై మళ్లీ పాత ముద్ర!

మూడేళ్లుగా జోరందుకున్న వ్యభిచారం



"పెద్దాపురం.. ఒకప్పుడు వ్యభిచారానికి కేరాఫ్ అనేలా ఈ ఊరికి ముద్రపడిపోయింది. పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక యువత, పోలీసులు కొన్ని దశాబ్దాలుగా కృషి చేసి ఆ మచ్చను తొలగించారు. అయితే మూడేళ్లుగా ఇక్కడ మళ్లీ వ్యభిచారం జోరందుకుంది."

అమాయక యువతులకు ముఠాల గాలం

డబ్బు, విలాసాల ఆశ చూపి నరకం

ప్రేమ, పెళ్లి పేరుతోనూ అమ్మాయిలను తెచ్చి బలవంతంగా రొంపిలోకి

ఆశ్రయం పేరిట ఓ బాలిక జీవితం ఛిద్రం

నిర్వాహకులతో కొందరు పోలీసుల లాలూచీ

హత్యలకూ దారితీస్తున్న ముఠా తగాదాలు

(కాకినాడ/పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలో ప్రస్తుతం పది వరకు వ్యభిచార ముఠాలున్నాయి. అమాయక యువతులు, మైనర్ బాలికలకు మాయ మాటలు చెప్పి ఈ కూపంలోకి దించుతున్నాయి. కాలేజీలు, హాస్టళ్లు, బస్టాండ్ల వద్ద తమ మనుషుల ద్వారా పరిచయాలు చేసుకుని డబ్బు, విలాసాల ఆశ చూపుతున్నాయి. స్థానిక కంపెనీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల యువతులతో పరిచయం పెంచుకుని ఉచ్చులోకి లాగుతున్నాయి. ఈ క్రమంలో అమ్మాయిల కోసం ముఠాల మధ్య గొడవలు

మిగతా 12వ పేజీలో...



నోటీసును రాజ్యసభ అనుమతించలేదు!

అధికార వర్గాల పేరుతో ప్రభుత్వం వెల్లడి

విచారణ కమిటీ లోక్‌సభ సభ్యులతోనే..

అభిశంసన అన్ని పార్టీల నిర్ణయం:రిజిజు

ధన్‌ఖడ్‌కు వీడ్కోలు విందు యోచనలో విపక్షం.. ఆయన హాజరు అనుమానమే

ఆగస్టులోగా కొత్త ఉప రాష్ట్రపతి: ఈసీ

జస్టిస్ వర్మ అభిశంసన లోక్‌సభలోనే!

న్యూఢిల్లీ, జూలై 25: జస్టిస్ యశ్వంత్ వర్మను హైకోర్టు జడ్జి పదవి నుంచి తప్పించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభలోనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్మానం కోసం లోక్‌సభలో బీజేపీ, రాజ్యసభలో కాంగ్రెస్ నోటీసు ఇచ్చాయి. కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును అనుసరించి అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకొని అధికార పార్టీ ఆగ్రహానికి గురైన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఆయన పదవి నుంచి తప్పుకోవడంతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చేవరకు రాజ్యసభ నిర్వహణ బాధ్యత

మిగతా 2వ పేజీలో...

నీట్ విద్యార్థిని మృతిపై సీబీఐ విచారణ

దేశంలోని విద్యాసంస్థలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు 13

అనంతబాబుకు ఝలక్

ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నో

డ్రైవర్ హత్య-డోర్ డెలివరీ కేసులో ఎమ్మెల్సీ నిందితుడు

తదుపరి దర్యాప్తుతో ఆయనకు ఎలాంటి హాని జరగదు

ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై స్టే విధించలేం: న్యాయమూర్తి

సవాల్ చేసే అర్హత అనంతబాబుకు లేదు..: ఏజీ 13



తీరం దాటిన వాయుగుండం

ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన

ఓడరేవుల్లో 3వ నంబరు హెచ్చరిక

దక్షిణ కోస్తా, సీమల్లోనూ వర్షాలు

వచ్చే వారం మరో అల్పపీడనం

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం నుంచి 2.51లక్షల క్యూసెక్కులు విడుదల

 12

సోషలిస్టు, సెక్యులర్ పదాలను

తొలగించే యోచన లేదు

అవి రాజ్యాంగంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టంచేసింది

బయట జరిగే చర్చలతో ప్రభుత్వానికి సంబంధం లేదు 2

రాజ్యసభలో కేంద్ర న్యాయమంత్రి స్పష్టీకరణ

33 దేశాలు.. 362 కోట్లు!

» 2021-25 మధ్య ప్రధాని మోదీ విదేశీ పర్యటన ఖర్చు ఇది

న్యూఢిల్లీ, జూలై 25: ప్రధాని మోదీ 2021-25 మధ్య 33 దేశాల్లో పర్యటించారని.. ఆయా దేశాల్లో పర్యటనలకు సంబంధించి రూ.362 కోట్లు ఖర్చయిందని కేంద్రం పేర్కొంది. గురువారం రాజ్యసభలో భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఆయా పర్యటనలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ జాబితాలో ప్రస్తుత బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు సంబంధించిన ఖర్చులను చేర్చలేదన్నారు. ఈ నెల మొదట్లో వెళ్లిన ఐదు దేశాల పర్యటన సహా మొత్తం ఐదేళ్లలో ప్రధాని 33 దేశాల్లో పర్యటించారని తెలిపారు. అయితే కెనడా, బ్రెజిల్, మారిషస్ దేశాల పర్యటన బిల్లులను పూర్తిగా చెల్లించనందున వాటిని లెక్కల్లో చేర్చలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫ్రాన్స్, అమెరికా, ఏప్రిల్‌లో థాయ్‌లాండ్, శ్రీలంక, సౌదీ అరేబియాలలో పర్యటించారని.. వీటి ఖర్చు రూ.67కోట్లు అయిందన్నారు. వీటిలో ఫ్రాన్స్, అమెరికాలలో పర్యటించినప్పుడు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చిందని.. ఇది రూ.25.59 కోట్లుగా ఉందన్నారు. ఫిబ్రవరి 13న ప్రధాని అమెరికాలో పర్యటించారని.. ఆ ఒక్క రోజే రూ.16.54 కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చిందని తెలిపారు.

రాజ్యసభ సభ్యునిగా కమల్‌హాసన్ ప్రమాణం



కమల్‌ను సత్కరిస్తున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తదితరులు

చెన్నై, జూలై25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి రాజ్యసభకు ఎంపికైన 'మక్కల్ నీదిమయ్యం' అధినేత, ప్రముఖ సినీ నటుడు కమల్‌హాసన్ సహా ఆరుగురు శుక్రవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. డీఎంకేకు చెందిన రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే సభ్యుడు అన్బుమణి పదవీకాలం గురువారంతో ముగిసింది. వీరి స్థానంలో తమిళనాడు నుంచి డీఎంకే మద్దతుతో ఎంపికైన కమల్‌హాసన్, ఆ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ఆర్ శివలింగం, అన్నాడీఎంకే తరపున ఎంపికైన ఇన్బదురై, ధనపాల్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తమిళంలోనే ప్రమాణం చేశారు. 2018లో కమల్ 'మక్కల్ నీదిమయ్యం' పార్టీ స్థాపించారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆపార్టీ ఘోరపరాజయం పాలైంది. అయితే 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కమల్ పార్టీ డీఎంకే కూటమికి మద్దతు పలికింది. ఆ ఎన్నికల్లో ఎలాంటి స్థానం కేటాయించని డీఎంకే అధినేత స్టాలిన్.. భవిష్యత్తులో కమల్‌ను రాజ్యసభకు పంపుతామని హామీనిచ్చారు. ఆ మేరకు ఇప్పుడు కమల్ డీఎంకే మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికై రాజ్యసభలోకి అడుగు పెట్టారు.

ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు

» పీఎంవీబీఆర్‌వై ఆవిష్కారం.. ఆగస్టు 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, జూలై 25: కొత్తగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు కేంద్రం నూతన పథకాన్ని ఆవిష్కరించింది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పేరుతో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్టు శుక్రవారం కార్మిక శాఖ తెలిపింది. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుందని, వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పథకానికి రూ.99,446 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. ఇందులో 1.92 కోట్ల మంది మొదటిసారిగా ఉద్యోగం పొందిన వారు ఉండాలని ఆశయంగా పెట్టుకొంది. 2025 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2027 జూలై 31లోగా ఈ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఉద్యోగాలు పొందినవారితోపాటు ఉద్యోగాలు కల్పించిన యజమానులకూ ప్రోత్సాహకాలు అందించనుండడం ఈ పథకం ప్రత్యేకత. వస్తువుల తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకం పార్ట్-ఏలో తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, పార్ట్-బిలో యజమానులకు అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు. తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారు ఈపీఎఫ్‌వోలో పేరు నమోదు చేసుకొని ఉంటే వారికి ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది గరిష్ఠంగా రూ.15,000 వరకు ఉంటుంది. రూ.లక్ష వరకు వేతనం పొందే వారూ ఈ ప్రోత్సాహకం పొందేందుకు అర్హులే. ఆరు నెలల సర్వీసు పూర్తయిన తర్వాత తొలి విడత ప్రోత్సాహకం లభిస్తుంది. 12 నెలలు ఉద్యోగం చేసి, యాజమాని నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమా'న్ని పూర్తి చేసిన తర్వాత రెండో విడత ప్రోత్సాహకం చెల్లిస్తారు. దీన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలోగానీ, సేవింగ్స్ పత్రాల రూపంలోగానీ కొంతకాలంపాటు డిపాజిట్ చేయాలి. కొత్తగా సృష్టించే ఉద్యోగాలకే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. పార్ట్-బి ప్రకారం అదనంగా కల్పించే ప్రతి ఉద్యోగానికి ప్రోత్సాహకం కింద యజమానికి ప్రతినెలా రూ.3,000 చొప్పున రెండేళ్లు ఇస్తారు. తయారీ రంగ యజమానులకైతే మూడు, నాలుగేళ్లపాటు కూడా ఈ ప్రయోజనం కల్పిస్తారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

జైపూర్, జూలై 25: ఎయిరిండియా విమానాల్లో సాంకేతిక లోపాల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 1.35 గంటలకు జైపూర్ నుంచి ముంబై బయల్దేరిన విమానం నిమిషాల వ్యవధిలోనే వెనక్కొచ్చింది. టేకాఫ్ అయిన 18 నిమిషాల్లోపే అందులో సాంకేతిక లోపాన్ని పైలట్లు గుర్తించడంతో తిరిగి జైపూర్‌కు మళ్లించారని ఎయిర్‌లైన్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ పేర్కొంది. ఇటీవల కాలంలో ఎయిరిండియా విమానాల్లో తరచూ సమస్యలు చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా, ఈ ఏడాది జూలై 21 నాటికి ఐదు విమానయాన సంస్థలు మొత్తం 183 సాంకేతిక సమస్యలను నమోదు చేశాయని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ జాబితాలో అత్యధికంగా ఎయిరిండియా గ్రూప్‌నకు చెందినవే 85 వరకూ ఉన్నాయి.

జస్టిస్ వర్మ అభిశంసన లోక్‌సభలోనే!



(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన కార్యాలయం కాంగ్రెస్ ఇచ్చిన నోటీసును రాజ్యసభ అనుమతించలేదని చెబుతోంది. దాంతో బీజేపీ కోరుకున్నట్లు లోక్‌సభలో బీజేపీ ఆధ్వర్యంలో జస్టిస్ వర్మ అభిశంసన కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం లభించింది. 21వ తేదీన లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఒకేసారి అభిశంసన తీర్మానం నోటీసులను అందుకున్న నేపథ్యంలో చట్టం ప్రకారం ఇరు సభల సభ్యులతో కలిపి విచారణ కమిటీ వేయాల్సి ఉంటుందని జగదీప్ ధన్‌ఖడ్ అదేరోజు ప్రకటించారు. అయితే, ఇప్పుడు రాజ్యసభలో నోటీసే లేనందున రెండు సభల్లో కలిపి విచారణ కమిటీ వేయడం ఉండదని భావిస్తున్నారు. ఇప్పుడు లోక్‌సభలో చేపట్టాలని నిర్ణయించడంతో అన్నీ లోక్‌సభ ద్వారా జరగనున్నాయి. రాజ్యసభలో అభిశంసన తీర్మానాన్ని చేపట్టాలన్న ఉద్దేశాన్ని జగదీప్ ధన్‌ఖడ్ వ్యక్తపరచి ఉంటే రాజ్యసభలో బీజేపీ ఎంపీలే చొరవ తీసుకొని సంతకాలు పెట్టించే వారని, ఈ అవకాశాన్ని కాంగ్రెస్ చేతుల్లో పెట్టడంపైనే తమ అభ్యంతరమని బీజేపీ వర్గాలు తెలిపాయి. జస్టిస్ వర్మను ఇంటికి పంపాలన్నది అన్ని పార్టీలు తీసుకున్న నిర్ణయమని, లోక్‌సభ నోటీసును బీజేపీ చేపట్టినప్పటికీ అన్ని పార్టీల వారు సంతకాలు చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో తీర్మానం తర్వాత రాజ్యసభ ఈ అంశాన్ని చేపడుతుందన్నారు. మరోపక్క ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియను మొదలు పెట్టింది. ఆగస్టు నెలాఖరుకు కొత్త ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారని ఈసీ వర్గాలు తెలిపాయి.

ధన్‌ఖడ్‌కు విపక్షం వీడ్కోలు?

మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు వీడ్కోలు కార్యక్రమం చేపట్టడానికి అధికార పక్షం సిద్ధంగా లేని నేపథ్యంలో విపక్షమే ఆయనకు వీడ్కో లు విందు కార్యక్రమాన్ని చేపట్టాలని యోచిస్తోంది. బీజేపీ ఇష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రతిపాదించిన అభిశంసన నోటీసును చేపట్టి అధినాయకత్వం ఆగ్రహానికి గురైన ధన్‌ఖడ్ సోమవారం హడావిడిగా రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయనకు రాజ్యసభలో తుది ప్రసంగం చేసే అవకాశం కూడా రాలేదు. ఈ నేపథ్యంలో ఆయనకు జరిగిన అవమానాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకైనా ఆయనకు విందు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. అయితే, ఈవిందుకు ధన్‌ఖడ్ వస్తారా? అన్నది అనుమానమే.

సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించే యోచన కేంద్రానికి లేదు

» అవి రాజ్యాంగంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టతనిచ్చింది

» బయట జరిగే చర్చలకు ప్రభుత్వానికి సంబంధం లేదు: అర్జున్ మేఘ్వాల్

న్యూఢిల్లీ, జూలై 25: రాజ్యాంగం ప్రవేశిక నుండి 'సోషలిస్టు', 'సెక్యులర్' పదాలను తొలగించే యోచన కేంద్ర ప్రభుత్వానికి ఏమీ లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ స్పష్టం చేశారు. సోషలిజం అంటే మన దేశ పరిస్థితుల ప్రకారం సంక్షేమ రాజ్యమేగానీ ప్రైవేటురంగం వృద్ధిని అడ్డుకోవటం కాదని, అలాగే రాజ్యాంగం మౌలిక స్వరూపంలో సెక్యులరిజం అంతర్భాగమని సుప్రీంకోర్టు గతేడాది ఇచ్చిన తీర్పును మంత్రి ఉటంకించారు. ఈ మేరకు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే ఇటీవల ఓ సభలో మాట్లాడుతూ.. సోషలిస్టు, సెక్యులర్ పదాలు రాజ్యాంగం ప్రవేశికలో వాస్తవానికి లేవని తెలిపారు. 1976లో ఇందిరాగాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వాటిని చేర్చారని గుర్తు చేశారు. మధ్యలో చేర్చిన ఈ పదాలను తొలగించాల్సిన అవసరం ఉందని, దీనిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సమాజ్‌వాదీపార్టీ ఎంపీ రాంజీలాల్ సుమన్.. ప్రభుత్వ వివరణ కోరారు. రాజ్యాంగం ప్రవేశిక నుండి సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించటానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించటంలో భాగంగానే ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయా అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అర్జున్ మేఘ్వాల్ సమాధానం ఇస్తూ.. రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో ఈ అంశంపై చర్చలు జరుగుతుండవచ్చుగానీ.. ప్రభుత్వం మాత్రం సదరు పదాలను తొలగించటంపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదని, ఆ యోచన కూడా లేదని తెలిపారు. బయట జరుగుతున్న చర్చలకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రవేశికలో ఏమైనా సవరణలు చేపట్టాలంటే సమగ్రమైన చర్చలు, విస్తృత ఆమోదంతోనే అది సాధ్యమని.. ప్రవేశికలో మార్పులు చేపట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చెప్పారు.

లోకం తీరు



పహల్గాంపై చర్చకు సై

న్యూఢిల్లీ, జులై 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంటులో చర్చించేందుకు కేంద్రం ఎట్టకేలకు అంగీకరించింది. శుక్రవారం జరిగిన సభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో.. లోక్‌సభలో 16 గంటల పాటు రాజ్యసభలో 16 గంటల పాటు చర్చ నిర్వహించాలని నిర్ణయించారు. చర్చను రక్షణమంత్రి రాజ్‌నాథ్ ప్రారంభిస్తారని, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ చర్చల్లో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ ఈ చర్చలో పాలు పంచుకుంటారని వెల్లడించాయి. కాంగ్రెస్ నుంచి రాహుల్, ప్రియాంక, సమాజ్‌వాది పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ తదితరులు పహల్గాం ఘటనపై ప్రశ్నలు లేవనెత్తేందుకు సిద్ధపడుతున్నారు. దీనితో సోమవారం సభ వాడి వేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పహల్గాంలో నిఘా వైఫల్యం, దాడి చేసిన ఉగ్రవాదులను అరెస్టు చేయలేకపోవడం, భారత యుద్ధ విమానాల కూల్చివేతపై ట్రంప్ ప్రకటన, దౌత్య వైఫల్యాలపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు సమాయత్తం అవుతున్నాయి.

ఉభయసభల్లో 'సర్' గందరగోళం

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విపక్ష సభ్యుల నిరసన

న్యూఢిల్లీ, జూలై 25: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలూ కొనసాగడం లేదు. బిహార్‌లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్-సర్)'పై శుక్రవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగించాయి. ఫలితంగా వర్షాకాల సమావేశాల్లో తొలి వారం మొత్తం తుడిచిపెట్టుకు పోయినట్లయింది. ఏ అంశంపైన అయినా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా.. విపక్ష సభ్యులు మాత్రం పట్టించుకోకుండా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. శుక్రవారం లోక్‌సభ సమావేశమైన వెంటనే విపక్ష సభ్యులు నినాదాలు, ప్లకార్డులతో నిరసనకు దిగడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. 2 గంటలకు సమావేశమైన తర్వాత కూడా ప్రతిపక్ష సభ్యులు సర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ స్పందిస్తూ.. "ఈ గందరగోళం, రభస వల్ల ఎవ్వరికీ ప్రయోజనం ఉండదు. ప్రజలు వారి సమస్యలను లేవనెత్తుతారని మిమ్మల్ని ఇక్కడికి పంపించారు. కానీ, మీరు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారు. సభను వాయిదా వేయించడం అంటే ఏదో సాధించినట్లు కాదు. ఇది ఆందోళనకరమైన అంశం. యావత్ దేశానికే హానికరం" అని విపక్ష సభ్యులకు హితవు పలికారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగడంతో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండానే సభ వాయిదా పడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇండీ కూటమికి చెందిన పలువురు ఎంపీలు 'సర్' పోస్టర్లను చించివేశారు. పార్లమెంటు భవన సముదాయంలోని చెత్తబుట్టల్లో వాటిని పడేసి, నిరసన ప్రదర్శన చేశారు. సర్‌ను ఉపసంహరించుకోవాలని, దీనిపై ఉభయసభల్లో చర్చ జరపాలని అన్నారు.



'సర్' ప్లకార్డులతో రాహుల్, ప్రియాంక నిరసన

నిప్పుతో చెలగాటం వద్దు: స్టాలిన్

బిహార్‌లో ఓట్ల తొలగింపుపై తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. నిప్పుతో చెలగాటమాడవద్దని బీజేపీని హెచ్చరించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్టాలిన్ శుక్రవారం ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన 99.8% పూర్తయినట్లు ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) కార్యాలయం ప్రకటించింది.

ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ

ప్రధానిగా 4,078 రోజుల పాటు పదవిలో

న్యూఢిల్లీ, జూలై 25: ప్రధాని నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు. అత్యధిక కాలంపాటు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును ఆయన శుక్రవారం అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు ఏకధాటిగా 4,077 రోజుల పాటు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం మోదీ శుక్రవారం నాటికి 4,088 రోజుల పదవీ కాలాన్ని పూర్తి చేశారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓటమి ఎరగకుండా అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగారు. వరుసగా మూడుసార్లు కాంగ్రెస్‌కు విజయం సాధించిపెట్టారు. 1947 ఆగస్టు 15 నుంచి 1964 మే 27 వరకు మొత్తం 6,130 రోజులు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆ తర్వాతి స్థానంలో మోదీ ఉన్నారు. పదవిలో కొనసాగుతూ వరుసగా బీజేపీని గెలిపిస్తున్న రాజకీయ నాయకునిగా ఇప్పటికే మోదీ ఘనత సాధించారు. ఆయన 2002, 2007, 2012ల్లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ప్రధాని పదవిని చేపట్టారు. ఇంతవరకు ఏ ఎన్నికల్లోనూ ఆయన ఓడిపోలేదు. వరుసగా ఆరు ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా, పీఎంగా కొనసాగిన ఏకైక నాయకుడు మోదీయే కావడం విశేషం. ప్రధానిగా రెండు టర్ములు పూర్తి చేసుకున్న కాంగ్రెసేతర నేత కూడా ఆయనే కావడం మరో విశేషం.

రాజస్థాన్‌లో కుప్పకూలిన స్కూల్ భవనం

ఏడుగురు విద్యార్థుల దుర్మరణం.. మరో 28 మందికి గాయాలు

» కొందరి పరిస్థితి విషమం.. ఉదయం ప్రార్థనకు సిద్ధమవుతుండగా ఘటన

» వర్షాలతో నిలిచిన వరద.. ఆ నీటికి గోడలు దెబ్బతినడంతోనే ప్రమాదం

ఝులావర్, జూలై 25: రాజస్థాన్‌లో ఘోరం జరిగింది. ఝులావర్ జిల్లా పిప్లోడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల భవనంలోని ఓ భాగం కూలిపోయింది. ఈ ఘటనలో స్లాబు, ఇటుక గోడల శిథిలాల కింద చిక్కుకొని ఏడుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో 28 మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం 7:45 గంటలకు విద్యార్థులు ప్రార్థన కోసం సిద్ధమవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం ఝులావర్‌లోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో 9మందికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ బడిలో ఐదు తరగతి గదులు, ఒక కార్యాలయ గది ఉన్నాయి. స్కూలు భవనాన్ని 1994లో నిర్మించారు. 2011లో అదనంగా కొన్ని గదులను నిర్మించారు. ప్రస్తుతం కూలిపోయింది 31 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోని పోర్షనే! అందులో 6, 7 తరగతుల విద్యార్థులు కూర్చుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత భవనం చుట్టూ వరద చేరిందని.. ఆ నీటి చెమ్మకు గోడలు ఉబ్బిపోయి.. పూర్తిగా దెబ్బతినడం వల్లే భవనం కూలిపోయిందని జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పారు. ప్రమాదంలో మొత్తంగా 35 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చిన 45 నిమిషాల తర్వాత అంబులెన్స్ వచ్చింది. ఆ లోపు ఉపాధ్యాయులు, స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు వచ్చి శిథిలాలను తొలగించే ప్రయత్నం చేశారు. స్థానికుల్లో ఒకరు తన ఎక్స్‌కావేటర్‌ను తెచ్చి శిథిలాలను తొలగించారు. గాయపడిన విద్యార్థులను ద్విచక్రవాహనాల మీదే ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని.. స్కూలు భవనం శిథిలావస్థకు చేరుకుందని కొన్నాళ్ల క్రితమే అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద ఘటనకు బాధ్యులను చేస్తూ ప్రధానోపాధ్యాయురాలు మీనా గార్గ్ సహా ఐదుగురు ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఈ ఘటనను రాజస్థాన్ మానవ హక్కుల సంఘం సూమోటోగా స్వీకరించింది. ప్రమాదంపై సమగ్ర నివేదిక అందజేయాలని, ప్రమాదానికి బాధ్యులపై తీసుకునే చర్యలు, మృతుల కుటుంబాలకు అందజేయనున్న పరిహారం వివరాలు తెలపాలని ఝులావర్ జిల్లా విద్యాధికారికి, బికనెర్‌లోని డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు, ఝులావర్ ఎస్పీకి నోటీసులు జారీచేసింది. ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన పిల్లలు వేగంగా కోలుకోవాలని ముర్ము ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. ఈ ఘటన తీవ్ర బాధాకరం అని.. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు అధికారులు సాధ్యమైనన్ని చర్యలు తీసుకుంటున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



శిథిలాల నుంచి విద్యార్థులను వెలికి తీస్తున్న స్థానికులు

మాల్దీవులకు 4,850 కోట్ల రుణ సాయం

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. ఈ సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, పలువురు ఆ దేశ మంత్రులు స్వయంగా మాలెలోని వెలెనా అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం రిపబ్లిక్ స్క్వేర్‌లో సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికి సైనిక వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ స్వయంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. వాణిజ్యం, రక్షణ, మౌలిక వసతులు వంటి అంశాల్లో సహకరించుకోవాలని నిర్ణయించారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు పలు కారణాల వల్ల దెబ్బతిన్న తర్వాత తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇరు దేశాలు ఒక ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. అంతేగాక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యం, మహాసాగర్(మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) అనే భారత విధానంలో మాల్దీవులకు ప్రధాన పాత్ర ఉందని పేర్కొన్నారు. రక్షణ, భద్రత అంశాల్లో సహకారం పరస్పర విశ్వాసానికి కీలకం అన్నారు. మాల్దీవుల రక్షణ రంగం బలోపేతానికి భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. 'అధ్యక్షుడు ముయిజ్జు స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం నా హృదయానికి హత్తుకుంది.. రానున్నకాలంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో ఉన్నత స్థాయికి చేరతాయి' అని మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో విశ్వాసం వ్యక్తంచేశారు. కాగా ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటనతో ఇరు దేశాల దౌత్య సంబంధాల్లో సానుకూల మార్పు వస్తుందని విశ్లేషకుల అంచనా. మాల్దీవుల్లో ఏకీకృత చెల్లింపుల విధానం(యూపీఐ)ని కూడా ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. కాగా మాల్దీవులపై చైనా పట్టును సడలింపజేసి హిందూ మహా సముద్ర ప్రాంతంలో ఆ దేశ ఆధిపత్యం లేకుండా చూడాలని భారత్ ఆశిస్తోంది.



'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం ప్రచారంలో భాగంగా మాలేలో మొక్కను నాటుతున్న మోదీ, చిత్రంలో ముయిజ్జు

క్లింటన్‌కూ ఎప్‌స్టైన్‌తో సంబంధాలు!

ఎప్‌స్టైన్‌కు బిల్ క్లింటన్ లేఖ..వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడి

వాషింగ్టన్, జూలై 25: ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలతో అరెస్టై.. జైలులో మరణించిన జెఫ్రీ ఎప్‌స్టైన్‌తో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు కూడా సంబంధాలున్నాయని వాల్ స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఎప్‌స్టైన్ 50వ పుట్టిన రోజు సందర్భంగా రూపొందించిన ప్రత్యేక ఆల్బమ్‌లో క్లింటన్ రాసిన ఓ లేఖకు కూడా చోటు కల్పించినట్లు.. అందులో క్లింటన్ స్వహస్తాలతో రాసిన అక్షరాల్లో స్పష్టంగా కనిపిస్తున్న భాగాలను వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ఎప్‌స్టైన్ మాజీ ప్రేయసి మ్యాక్స్‌వెల్ ఆధ్వర్యంలో తయారు చేశారు. అందులో ట్రంప్, క్లింటన్ సహా.. వాల్ స్ట్రీట్ బిలియనీర్ లియోన్ బ్లాక్, ఫ్యాషన్ డిజైనర్ వేరావాంగ్, మీడియా అధినేత మోర్ట్ జుకెర్మన్ రాసిన లేఖలున్నాయి. బిల్ క్లింటన్ కవితాత్మకంగా అందులో లేఖ రాశారు. ఎప్‌స్టైన్‌ది చిన్నపిల్లాడి మనస్తత్వమని, సుదీర్ఘకాలం స్నేహాలను కొనసాగిస్తారని అందులో కొనియాడారు. 50 ఏళ్లు వచ్చినా.. ఇంకా కుర్రాడిలా ఉత్సాహంగా ఉంటారని, సాహసాలు చేస్తుంటారని పేర్కొన్నారు. క్లింటన్ రాసిన కొన్ని పదాలు అస్పష్టంగా ఉన్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. కాగా.. 2019లో ఎప్‌స్టైన్ అరెస్టు కాక ముందు.. క్లింటన్ అతనితో నాలుగు సార్లు ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించడం గమనార్హం..! ఈ ప్రయాణాలన్నీ క్లింటన్ ఫౌండేషన్ ద్వారా జరిగినట్లు సమాచారం. వీరిద్దరూ 1993లో వైట్‌హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఫొటో దిగారు. కాగా.. ఎప్‌స్టైన్ పుట్టిన రోజు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేఖ రాశారంటూ ఇటీవల వాల్ స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే..! ఆ కథనాన్ని ఖండించిన ట్రంప్.. వాల్ స్ట్రీట్ జర్నల్‌పై 10 బిలియన్ డాలర్ల మేర పరువు నష్టం దావా వేశారు.

డ్రోన్ నుంచి దూసుకెళ్లిన స్వదేశీ క్షిపణి

(మొదటి పేజీ తరువాయి)

డీఆర్‌డీవో కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్ఓఏఆర్)లో పరీక్షించింది. దీంతో శత్రుదుర్భేద్యమైన ప్రాంతాల్లో కూడా మానవరహిత ఏరియల్ వెహికిల్ ద్వారా ఈ క్షిపణిని సంధించవచ్చు. విజయవంతమైన ఈ పరీక్ష విషయాన్ని శుక్రవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. భారత రక్షణ సామర్థ్యాల్లో ఇదో మైలురాయి అని ఆయన అభివర్ణించారు. స్వదేశీ రక్షణ పరిశ్రమ ఇప్పుడు సంక్లిష్టమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయగలదని, అలాగే ఉత్పత్తి చేయగలదని ఆయన అన్నారు. గతంలో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన యూఎల్‌పీజీఎం-వీ2 కన్నా ఇది మెరుగైన వెర్షన్. యూఎల్‌పీజీఎం-వీ3లో హెచ్‌డీ డ్యూయల్ చానల్ సీకర్‌ను ఏర్పాటు చేయడం వల్ల వివిధ రకాల లక్ష్యాలను ఇది ఛేదించగలదు. మైదాన ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాల్లోనూ ఈ క్షిపణితో దాడులు చేయవచ్చు. పగలు, రాత్రి వేళల్లో దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా ఈ క్షిపణిని బెంగళూరుకు చెందిన న్యూస్పేస్ రీసెర్చ్ టెక్నాలజీస్ అనే స్వదేశీ స్టార్టప్ సంస్థ రూపొందించిన డ్రోన్ ద్వారా పరీక్షించారు. అదానీ డిఫెన్స్, బీడీఎల్, 30 ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు ఈ పరీక్షలో భాగస్వాములుగా ఉన్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ నుంచి డ్రోన్ ద్వారా క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంపై ఏపీ సీఎం చంద్రబాబు కూడా అభినందనలు తెలిపారు.

యూఎల్‌పీజీఎం-వీ3 విశేషాలివీ..

- డ్రోన్ల(యూఏవీ) నుంచి ప్రయోగించే క్షిపణి ఇది.
- రక్షణ సిబ్బందికి ప్రమాదాలు తగ్గించడానికి, పూర్తి కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడానికి అభివృద్ధి చేశారు.
- అధునాతన యుద్ధాలకు తగ్గట్లుగా సాంకేతిక పరిజ్ఞానం అమర్చారు. కదులుతున్న లక్ష్యాలనూ ఛేదిస్తుంది.
- కవచం ఉన్న అధునాతన సాయుధ వాహనాలను ఇది ధ్వంసం చేయగలదు. బంకర్లలోకి చొచ్చుకెళ్లి పేలే వార్‌హెడ్ దీనిలో ఉంది.,
- చీకట్లోనూ లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- ఆకాశం నుంచి భూమి మీద గల లక్ష్యాలను ఛేదిస్తుంది. పగటిపూట 4 కిలో మీటర్లు, రాత్రి 2.5 కిలోమీటర్ల రేంజ్‌ను చేరుకుంటుంది.

2వేల కోట్లతో ఫైర్ కంట్రోల్ రేడార్లు

వైమానిక రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అధునాతన ఎయిర్ డిఫెన్స్ ఫైర్ కంట్రోల్ రేడార్ల కొనుగోలుకు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.2 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అన్ని రకాల వైమానిక ముప్పులను ఈ అధునాతన రేడార్లు గుర్తించగలవని తెలిపింది.

దక్షిణ భారతదేశంలోనే తొలిసారి కళాశాలల విలీనంతో ఏర్పడిన విశ్వ విద్యాలయం.. కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ. గతంలో టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించి ఈ వర్సిటీ తీసు కొచ్చారు. ఆతర్వాత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం వెంటాడింది. మళ్లీ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడం.. రూ.20 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడంతో వర్సిటీకి మంచి రోజులు వచ్చాయని అంతా సంబర పడ్డారు. అయితే బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్ట లేదు. వర్సిటీకి కొత్తగా పోస్టులు మంజూరయినా.. ఫైనాన్షియల్ క్లియరెన్స్ రాలేదు. సమస్యల వల యంలో కొట్టుమిట్టాడుతున్న కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ దుస్థి తిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు క్లస్టర్ వర్సిటీ.. కష్టాలు తొలగేనా?

- కేంద్రాన్ని ఒప్పించి చంద్రబాబు తీసుకొచ్చిన వర్సిటీ
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- దక్షిణ భారతదేశంలోనే తొలి విశ్వవిద్యాలయం
- అసంపూర్తి నిర్మాణాలు.. అరకొర సిబ్బంది
- నాటి పెండింగ్ బిల్లులు చెల్లించిన కూటమి ప్రభుత్వం
- అయినా పనులు చేపట్టని కాంట్రాక్టర్
- కొత్త పోస్టులు మంజూరైనా.. ఆర్థిక శాఖలో పెండింగ్

(ఆంధ్రజ్యోతి-కర్నూలు)



కర్నూలు శివారులో జగన్నాథగట్టుపై అసంపూర్తిగా ఉన్న క్లస్టర్ యూనివర్సిటీ భవనాలు

కర్నూలు నగరంలో ఉన్న సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేవీఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మెన్స్ డిగ్రీ కళాశాలలను ఒకే గూటి కిందికి తీసుకువచ్చి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు.. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీని తీసుకొచ్చారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) పథకం కింద 2015 డిసెంబరు 1న న్యూఢిల్లీలో జరిగిన 'ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు' సమావేశంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయగా.. డిగ్రీ కాలేజీల నూతన భవనాల నిర్మాణానికి రూ.55 కోట్లను రూసా మంజూరు చేసింది. ఆతర్వాత వైసీపీ ప్రభుత్వం ఏపీ క్లస్టర్ యూనివర్సిటీ యాక్ట్-2020 తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వైసీపీ మంత్రి ఆధిపత్యం వల్ల క్లస్టర్ వర్సిటీ కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం వివిధ కోర్సుల్లో డిగ్రీలో 3,300 మంది, పీజీలో 50 మంది విద్యార్థులు ఉన్నారు.

అసంపూర్తిగా భవనాలు: జగన్నాథ గట్టుపై ట్రిపుల్ ఐటీడీఎం విద్యాలయం పక్కనే క్లస్టర్ యూనివర్సిటీకి 50.5 ఎకరాలు కేటాయించారు. అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలురు, బాలికల వసతి గృహం, సాధారణ సౌకర్యాల భవనాలు (లైబ్రరీ, ల్యాబ్, రీసెర్చ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంక్యూబేషన్ సెంటర్) నిర్మాణాలకు రూ.80 కోట్లు మంజూరు కాగా, వైసీపీ ప్రభుత్వంలో అంతులేని జాప్యం, నిర్లక్ష్యంవల్ల అంచనా వ్యయం రూ. 139 కోట్లకు చేరింది. ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీర్ల పర్యవేక్షణలో చేపట్టిన ఈ భవన నిర్మాణాల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన దక్కన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. అప్పట్లో రూ.65 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ హయాంలో రూ.20 కోట్లు బిల్లులు పెండింగులో పెట్టడంతో కాంట్రాక్టు సంస్థ పనులు ఆపేసింది. ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు రూ.20 కోట్లు చెల్లించినా పనులు మొదలు పెట్టలేదు. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని కూడా తొలగించింది. అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఇప్పటి వరకూ ఖర్చు చేసిన రూ.65 కోట్లు నిరుపయోగమయ్యాయి. వైసీపీకి చెందిన ఒక మాజీ మంత్రి ఆదేశాల వల్లే కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

క్లస్టర్ వర్సిటీ సమస్యలపై దృష్టి పెట్టాలి



- సీమ కృష్ణరాథోడ్, రాయలసీమ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, కర్నూలు

క్లస్టర్ వర్సిటీకి తక్షణమే రెగ్యులర్ వీసీని నియమించాలి. అసంపూర్తిగా ఉన్న భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలి. వైసీపీ హయాం లో ఉద్దేశపూర్వంగానే ఈ వర్సిటీని నిర్వీర్యం చేశారు. మంజూరైన పోస్టులకు ఫైనాన్స్ అప్రూవల్ ఇచ్చి నియామకాలు చేయాలి. నైపుణ్య శిక్షణ ద్వారా కరువు సీమ విద్యార్థులకు ఉపాధి కల్పించాలి. ఈ వర్సిటీ భవనాలను ఇతర యూనివర్సిటీలకు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలి.

ఆస్తులు పంచుకున్నారు.. అమ్మను వదిలేశారు

- కుమారుల నుంచి భృతి ఇప్పించాలని కోర్టును ఆశ్రయించిన వృద్ధురాలు



సుబ్బమ్మ

పీసీపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆస్తులు పంచుకున్న బిడ్డలు, తల్లి సంరక్షణకు మాత్రం ముందుకు రాలేదు. కళ్లలో పెట్టుకుని చూడాల్సిన కన్నతల్లిని భారంగా భావించి నిర్దాక్షిణ్యంగా వదిలేశారు. విధిలేని పరిస్థితిలో 74 సంవత్సరాల వృద్ధురాలు కోర్టును ఆశ్రయించింది. వివరాలు.. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం కోదండరామపురం గ్రామానికి చెందిన గుర్రం నరసింహం, సుబ్బమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమారుడు చనిపోగా, ఏడాదిన్నర క్రితం నరసింహం మృతిచెందాడు. 9 ఎకరాల పొలం, ఇంటిని కుమారులు పంచుకున్నారు. అప్పటి నుంచి సుబ్బమ్మకు కష్టాలు మొదలయ్యాయి. తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తులను పంచుకున్న ఆ బిడ్డలు తల్లి బాగోగులు మాత్రం చూడటం లేదు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుని ఆమె పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో తన జీవనం కోసం కుమారుల నుంచి భృతి ఇప్పించి న్యాయం చేయాలని ఇటీవల కనిగిరి కోర్టును ఆశ్రయించింది. ఈ నెల 22న చిన్న కొడుకు వాయిదాకు హాజరుకాగా, పెద్ద కొడుకు హాజరుకాలేదు. దీంతో న్యాయమూర్తి విచారణను వచ్చేనెల 20వ తేదీకి వాయిదా వేశారు.

ఇంటర్ బోర్డు పరిధిలోకి హైస్కూల్ ప్లస్‌లు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 30 కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న వాటిని ఇంటర్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 294 హైస్కూల్ పాఠశాలల్లో 30కి పైగా రోల్ ఉన్న ప్లస్ 2 తరగతుల బాధ్యతలను ఇక నుంచి ఇంటర్ బోర్డు పర్యవేక్షిస్తుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులు యథావిధిగా కొనసాగుతారని చెప్పారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో పాఠశాల విద్యాశాఖ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు. కొత్తగా సృష్టించిన పోస్టుల్లో చేరినవారికి సంబంధించి రెండు మూడు రోజుల్లో జీవో వస్తుందని, వారికి ఆగస్టు 6 నుంచి ఎరియర్ బిల్లులు చేసుకోవాలని సూచించారు. ఎంతఃవోల బదిలీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

డబ్బులు వసూలు చేసి సర్వ దర్శనం క్యూలోకి..

- తిరుమలలో వెలుగుచూసిన దళారుల దందా

తిరుమల, జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సులభంగా స్లాటెడ్ సర్వ దర్శనం చేయిస్తామని చెప్పి దళారీలు భక్తుల దగ్గర రూ.1500 చొప్పున వసూలు చేశారు. వారితో చేతులు కలిపిన టీటీడీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఎమర్జెన్సీ గేటు తెరిచి, 24 మంది భక్తులను క్యూలైన్‌లోకి పంపాడు. బుధవారం జరిగిన ఈ ఘటనపై, విచారణ తర్వాత సెక్యూరిటీ గార్డును గురువారం రాత్రి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. తిరుపతిలోని అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం తెల్లవారుజామున ఎస్ఎస్‌డీ టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తుల వద్దకు కె.వెంకటేష్, డి.వెంకటేష్ అనే ఇద్దరు ట్యాక్సీ డ్రైవర్లు వెళ్లి నేరుగా ఉచిత దర్శనం క్యూలోకి పంపిస్తామని చెప్పి 24 మంది నుంచి రూ.1500 చొప్పున వసూలు చేశారు. తిరుమలలో ట్యాక్సీ క్లీనర్ వెంకటేష్‌కు వీరిని అప్పగించారు. అతను వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 వద్ద విధులు నిర్వహించే టీటీడీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పి.సాయికుమార్‌కు రూ.8 వేలు ఇచ్చి భక్తులను క్యూలైన్‌లోకి పంపాలని కోరాడు. గార్డు ఏకంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రధాన ద్వారం సమీపంలోని ఎమర్జెన్సీ గేట్ తాళాలను వెంకటేష్‌కు ఇచ్చేశాడు. ఉదయం 8 గంటలకు ఈ ద్వారం నుంచి 24 మందినీ లోపలికి పంపాడు. వారు టోకెన్లు తీసుకుని బయటకు వచ్చేసి, తమకు కేటాయించిన సమయం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలకు అదే ద్వారం వద్దకు దర్శనం కోసం వచ్చారు. అనుమానంతో విజిలెన్స్ అధికారులు విచారించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఇద్దరు ట్యాక్సీ డ్రైవర్లు, క్లీనర్ వెంకటేష్‌తో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని, గురువారం రాత్రి తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

త్వరలో 'తక్షణ మ్యుటేషన్ వ్యవస్థ'

- ఆస్తి మ్యుటేషన్‌లో విప్లవాత్మక మార్పులు
- 1 నుంచి 17 మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో తక్షణ ఆటో మ్యుటేషన్ వ్యవస్థను ప్రారంభించనున్నారు. ఈ వినూత్న డిజిటల్ కార్యక్రమాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రారంభించనున్నారు. ఆస్తి రిజిస్ట్రేషన్ తర్వాత మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరును మార్చడం ప్రస్తుతం ప్రహసనంగా ఉన్న నేపథ్యంలో ఆటో మ్యుటేషన్ ఊరట కలిగించనుంది. ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ ఫీజుతో పాటు ఆస్తి పన్ను, ఖాళీ భూముల పన్ను, నీటి చార్జీలు, సెవరేజ్ చార్జీల బకాయిలు వసూలు చేస్తారు. అప్పుడే మున్సిపల్ డేటా బేస్‌లో యజమాని పేరును అప్‌డేట్ చేస్తారు. దాని కోసం విడిగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా, పన్నుల వసూళ్లు వేగవంతమవుతాయి. రిజిస్ట్రేషన్, మున్సిపల్‌శాఖల మధ్య సమన్వయంతో పాటు పారదర్శకత, సమయపాలన, పట్టణ ప్రణాళికకు కచ్చితమైన డేటా అందుతుంది. ముందుగా 17 మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు చేసి ఆ తర్వాత మిగిలిన పట్టణ స్థానిక సంస్థల్లో అమలు చేస్తారు. 17 కార్పొరేషన్ల కమిషనర్లు, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లకు, మున్సిపల్ సిబ్బందికి శిక్షణ అందిస్తారు. 48 గంటల్లోగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ఆటో మ్యుటేషన్ వ్యవస్థ ప్రారంభంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. దేశంలోనే పట్టణ డిజిటల్ పాలనలో ఆదర్శంగా నిలుస్తుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి: బొప్పరాజు



ఒంగోలు కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఒంగోలులో రెవెన్యూ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు కనీసం ఐఆర్ కూడా ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురిచేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఏపీ అమరావతి జేఏసీ, రెవెన్యూ అసోసియేషన్ పక్షాన ఏడు నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే, రెవెన్యూ కార్యాలయాల భవనాలు అధ్వానంగా ఉన్నాయని, నూతన భవన నిర్మాణాలకు అనుమతులు కూడా ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ కార్యదర్శి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కలిమి-బలిమి

మాల్దీవులతోనూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు ఆరంభమైనాయని అంటున్నారు భారత ప్రధాని నరేంద్రమోదీ. భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయదేశమని, 'పొరుగుకే తొలి ప్రాధాన్యం' కింద ఆ దేశానికి ప్రముఖస్థానం ఉంటుందని శుక్రవారం బ్రిటన్ నుంచి మాల్దీవులకు చేరుకున్న ఆయన హామీ ఇచ్చారు. బ్రిటన్‌తో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం మన పాలకులకు మంచి ఉత్సాహాన్నిచ్చినట్టుంది. ఒకదేశపు ఉత్పత్తులు మరోదేశంలోకి హద్దులు లేకుండా ప్రవేశిస్తూ, నియంత్రణలు లేని వాణిజ్యం సాగుతున్నప్పుడు ఆ విధానంతో ఒకదేశం కాస్తంత నష్టపోక తప్పదన్న వాదనను పాలకులు, స్వేచ్ఛావాణిజ్య ప్రభోదకులు ఏ మాత్రం ఒప్పుకోరు. భారత్-బ్రిటన్ మధ్యకుదిరిన ఒప్పందంతో రెండు దేశాలకూ ఏకరీతిగా మేలు జరుగుతుందని అనుకున్నపక్షంలో, మళ్ళీ ఎవరికివారు స్వదేశంలో తమకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో అర్థంకాదు.

భారత్-బ్రిటన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)తో భారత్‌కే ఎక్కువ ప్రయోజనమని రిజర్వుబ్యాంకు గవర్నర్ కూడా అంటున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాల అభివృద్ధికి ఈ ఒప్పందం సహాయపడుతుందనీ, ఇలాగే అనేక దేశాలతో మనం ఒప్పందాలు చేసుకోవాలని ఆయన అంటున్నారు. ప్రపంచవాణిజ్య సంస్థ నియమాలు, నిబంధనలను ట్రంప్ వంటివారు ఉల్లంఘిస్తూ, సుంకాల యుద్ధాలు చేస్తున్న తరుణంలో ఇటువంటి ద్వైపాక్షిక స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలతో భద్రత సమకూర్చుకోవాల్సిన అవసరం కాదనలేనిది. అమెరికా సహా చాలాదేశాలతో ఎఫ్‌టీఏల కోసం ఇప్పటికే మనదేశం వాణిజ్యచర్చలు చేస్తున్నది కూడా. భారత్-బ్రిటన్ ఎఫ్‌టీఏని తక్షణ ఆర్థిక ప్రయోజనాల ప్రాతిపదికన అంచనావేయకూడదని, ఇది ఉభయదేశాల ద్వైపాక్షిక బంధాన్నీ, మైత్రినీ, ఇతరత్రా రంగాలకు సైతం విస్తరించగలిగే సహాయసహకారాలనూ ప్రభావితం చేసే అంశమని విశ్లేషకులు సలహా. రెండుదేశాల సంబంధాలను ఇంతవరకూ గతకాలపు వలసపాలన వాసనలు ప్రభావితం చేశాయని, ఇప్పుడు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా నిలబడిన భారతదేశం తనను ఒకప్పుడు ఏలిన దేశంతో సమానస్థాయిలో వాణిజ్యం చేయబోతున్నదని, పరస్పర గౌరవం, విశ్వాసం, ప్రయోజనాల ప్రాతిపదికన ఇది రూపొందిందని వారంటారు. ఉభయదేశాల భావి తరాలకు ఈ ఒప్పందం పలురకాల ప్రయోజనాలను చేకూరుస్తుందని కూడా వారు హామీ ఇస్తున్నారు.

యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగిన బ్రిటన్‌కు ఈ ఒప్పందం ఎక్కువ సంతోషం కలిగించినమాట నిజం. 'బ్రెగ్జిట్' ప్రక్రియ ఆ దేశాన్ని రాజకీయంగానూ, ఆర్థికంగానూ బాగా కుదిపేసింది. వీడిపోవాలని నిర్ణయించుకున్న బ్రిటన్‌తో ఈయూ అగౌరవంగా వ్యవహరించింది. తెగదెంపులను కష్టతరం చేసింది. బ్రిటన్ వరుస ప్రధానులను బ్రెగ్జిట్ బలితీసుకుంది. ఈయూనుంచి బయటకు వచ్చిన బ్రిటన్‌కు భారత్ సహకారం అవసరమని బోరిస్ జాన్సన్ అప్పట్లోనే గ్రహించి ఈ ఎఫ్‌టీఏ ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అనంతరం లిజ్‌ట్రస్, రిషీసునాక్ కూడా నిష్క్రమించి, ఎన్నికల్లో లేబర్‌పార్టీ నెగ్గి, స్టార్మర్ వచ్చిన తరువాతగానీ ఇది వాస్తవరూపం దాల్చలేదు. బ్రిటన్ పార్లమెంట్ ధ్రువీకరణ ఏడాదిలోగా పూర్తయి ఆచరణలోకి రావడమే కాక, మరో నాలుగేళ్ళలోనే ఉభయదేశాల వాణిజ్య పరిమాణం 12వేల కోట్ల డాలర్లకు చేరాలన్నది లక్ష్యం. ఈ ఒప్పందంతో తగ్గబోతున్న సుంకాలు, పెరగబోతున్న ఎగుమతులు, బాగుపడే రంగాలమీద లోతైన విశ్లేషణలు సాగుతున్నాయి. ఖరీదైన వివిధ బ్రాండ్ల బ్రిటిష్ మద్యం మనదేశంలో ప్రవహిస్తుంది, జాగ్వార్లు, ల్యాండ్‌రోవర్లు మనరోడ్లమీద షికార్లు చేస్తాయి. అక్కడా ఇక్కడా కూడా కార్లతయారీలో ఉన్న టాటాలకు ఈ ఒప్పందం లబ్ధిచేకూరుస్తుంది. ఈ ఒప్పందంమీద రెండుదేశాల్లోనూ సముచితమైన భయాలు, అనుమానాలు లేకపోలేదు. వలసవిధానం మారదు, భారతదేశంనుంచి వచ్చే కార్మికుల సంఖ్య పెరగదని అక్కడి పాలకులు తమవారికి నచ్చచెప్పుకుంటున్నారు. ఇక్కడి చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఏ నష్టమూ వాటిల్లదని మనవారు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతానికి ఓ యాభైవేల కోట్ల రూపాయల వాణిజ్య వ్యవహారంగా ఉపరితలంలో కనిపిస్తున్నా, దీనిపునాదిగా అన్నిరంగాల్లోకీ విస్తరించబోయే దౌత్యబంధంతో భవిష్యత్తులో మనకు ఎంతో మేలు చేకూరుతుందన్న హామీలను ఇప్పటికైతే విశ్వసిద్దాం.

ధన్‌ఖడ్ ఉత్థాన పతనాలు

జూలై 10, 2025న జగదీప్ ధన్‌ఖడ్ చాలా సంతోషంగా ప్రకటించారు: 'సరైన సమయం-ఆగస్టు 2027- లో నేను పదవీ విరమణ చేస్తాను'. 'దైవిక జోక్యానికి లోబడి' అని కూడా ఆయన అన్నారు. ధన్‌ఖడ్ భారత ఉపరాష్ట్రపతి. ఆ రాజ్యాంగ పదవి రీత్యా ఆయన రాజ్యసభకు ఛైర్మన్. జూలై 21న ఆయన ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. పర్యవసానంగా రాజ్యసభ ఛైర్మన్ బాధ్యతల నుంచి కూడా నిష్క్రమించారు. జూలై 10, జూలై 21 మధ్య సంభవించింది జీవితాన్ని వివరించ వీలులేని విషయంగా చేసేదే సుమా!

జూలై 21న పార్లమెంటు ఉభయ సభలు సాధారణంగా ప్రారంభమయ్యాయి. అంతకు ముందు రోజు ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం ఉభయ సభలలోని సమస్త



■ పి. చిదంబరం

'పళని' పలుకు

పార్టీల నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సరే, అన్ని అంశాల పైన చర్చలకు, ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందేందుకు సహకరించాలని అధికారపక్షం వారు కోరడం, ప్రతిపక్షాల నేతలు సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పడం జరిగింది. విచారకరమైన విషయమేమిటంటే ఒక తక్షణ ప్రాధాన్యమున్న అంశంపై సభ ఎప్పుడు, ఎలా చర్చించాలి అన్న విషయమై ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుతం ఏకాభిప్రాయం లేదు. రాజ్యసభలో ప్రతిపక్షం సామాన్యంగా నిబంధన 267 కింద చర్చ జరగాలని పట్టుబడుతుంది. సభా కార్యక్రమాల జాబితాలోని అంశాలను వాయిదా వేసేందుకు ఉపకరించే ప్రత్యేక సాధనమే నిబంధన 267. సంబంధిత తీర్మానాన్ని 'వాయిదా తీర్మానం'గా పేర్కొంటారు. నిబంధన 267 కింద చర్చను కోరడం చెడ్డ విషయమేమీ కాదు. అయితే ఇది ప్రభుత్వాన్ని 'అభిశంసించడం'గా ఎన్డీఏ సర్కార్ పరిగణిస్తోంది (బహుశా, గతంలో కొన్ని ప్రభుత్వాలు కూడా ఇదే వైఖరి తీసుకుని ఉంటాయి). గత 11 సంవత్సరాలలో నిబంధన 267 కింద చర్చకు అధికారపక్షం చివరిసారి అంగీకరించింది నవంబర్ 2016లో 'పెద్ద నోట్ల రద్దు'పై కావడం గమనార్హం. ధన్‌ఖడ్ రాజ్యసభ ఛైర్మన్ అయిన తరువాత నిబంధన 267 కింద ఎప్పుడూ ఎలాంటి చర్చను అనుమతించలేదు.

ఈ జూలై 21న కూడా భిన్నంగా ఏమీ జరగలేదు బీజేపీ సభ్యుడు ఒకరు నిబంధన 167 కింద పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు నోటీస్ ఇచ్చారు. పలువురు ప్రతిపక్ష సభ్యులు అదే అంశంపై చర్చకు నిబంధన 267 కింద నోటీసులు ఇచ్చారు. బీజేపీ సభ్యుడి నోటీస్‌ను సభాధ్యక్షుడు స్వీకరించారు. ప్రతిపక్ష సభ్యుల నోటీసులను తిరస్కరించారు. అవి నిర్దేశిత విధానానికి అనుగుణంగా లేవని ఎప్పుడూ చెప్పే కారణాన్నే చెప్పారు. సభలో సహజంగానే గందరగోళం ఏర్పడింది.



జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన తీర్మానాలపై ధన్‌ఖడ్ నిర్ణయాలే ఆయన రాజీనామాకు దారితీశాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నేను ఈ అభిప్రాయంతో విభేదిస్తున్నాను. ధన్‌ఖడ్ రాజీనామా వెనుక 'ప్రస్తుతానికి తెలియని కారణాలు' ఉన్నాయని నేను భావిస్తున్నాను.

రాజ్యసభ ఛైర్మన్ సభా కార్యక్రమాల సలహా సంఘం (బీఏసీ) సమావేశాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధులుగా జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరయ్యారు. కొంతసేపు చర్చ జరిగిన తరువాత ఆ సమావేశాన్ని సాయంత్రం 4.30 గంటలకు వాయిదా వేశారు. బీఏసీ మళ్లీ సమావేశమైనప్పుడు కేబినెట్ మంత్రులు ఇరువురూ హాజరు కాలేదు. ఛైర్మన్ ఆ సమావేశాన్ని మళ్లీ వాయిదా వేశారు. ఆ రాత్రి 9.35 గంటలకు ధన్‌ఖడ్ 'వైద్యుల సలహా' మేరకు ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఏ పార్టీ కానీ, ఏ ఎంపీ కానీ రాజీనామాను ఉపసంహరించుకోవాలని ధన్‌ఖడ్‌ను కోరలేదు. జూలై 22న డిప్యూటీ ఛైర్మన్ 'ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది' అని క్లుప్తంగా ప్రకటించారు. ధన్‌ఖడ్‌కు గుడ్‌బై చెప్పేందుకు అధికార పక్షం నిర్ణయించుకున్నదని స్పష్టమయింది. ఆయనకు వీడ్కోలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సుముఖంగా లేదు.

ధన్‌ఖడ్‌కు ఎన్డీఏ ప్రభుత్వం చాలా రుణపడి ఉన్నదని చెప్పక తప్పదు. ప్రతిపక్షాలను అదుపులో ఉంచడంలో ఆయన అద్వితీయంగా వ్యవహరించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విషయమై ఆరెస్సెస్ / బీజేపీ వైఖరిని ఆయన పూర్తిగా సమర్థించారు. రాజ్యాంగ మున్నుడిలోని 'సెక్యులర్, 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాల్సిందేనని కూడా ధన్‌ఖడ్ డిమాండ్ చేశారు. కేశవానంద భారతి కేసులో మౌలిక నిర్మాణం సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు ప్రతిపాదించడాన్ని ఆయన విమర్శించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై న్యాయసమీక్ష సిద్ధాంతాన్ని ధన్‌ఖడ్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను నియమించే హక్కు ప్రభుత్వానికి ఉందని ఆయన సమర్థించారు. ఈ నియామకాలలో న్యాయవ్యవస్థ నిర్ణయాలకు ప్రాధాన్యముందన్న ప్రతిపాదనను ధన్‌ఖడ్ కొట్టివేశారు. చట్టసభలు ఆమోదించిన బిల్లులను మూడు నెలలలోగా ఆమోదించాలని అధికరణ 142 కింద గవర్నర్లు, రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఆదేశించడం సరికాదని ఆయన గర్హించారు. అధికరణ 105కు విరుద్ధంగా సభ్యులు తమ ప్రసంగాలలో ఉటంకించే సమాచారం, గణాంకాలను ధ్రువీకరించాలని ఆదేశించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ఘనంగా ప్రస్తుతించారు. వివిధ అంశాలపై ఆయన వైఖరులు కరడుగట్టిన మితవాదుల అభిప్రాయాలకు అనుగుణంగా ఉండేవి. సహజంగానే అవి బీజేపీకి సంతృప్తి కలిగించే విధంగా ఉండేవి.

ధన్‌ఖడ్ తన రాజకీయ జీవితంలో జనతాదళ్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని సమాజ్‌వాది జనతా పార్టీ, కాంగ్రెస్, బీజేపీలలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ధన్‌ఖడ్ నియమితుడవడంతో ఆయన రాజకీయ జీవితం పునరుత్థానమయింది. గవర్నర్‌గా ఆయన వ్యవహరించిన తీరు, మమతా బెనర్జీ ప్రభుత్వంతో కలహించడం ఆయన బీజేపీ అనుకూల వైఖరిని స్పష్టం చేశాయి. గవర్నర్ పదవి గౌరవాన్ని ఆయన ఏ విధంగానూ పెంపొందించలేదు. అయినప్పటికీ ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్‌కు పదోన్నతి లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాజ్యసభ కార్యక్రమాలను ఆయన నిర్వహించిన తీరుకు విసిగిపోయిన ప్రతిపక్షాలు ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవలసిన మొదటి రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడే కావడం విశేషం.

ధన్‌ఖడ్, ఆరెస్సెస్ / బీజేపీ మధ్య సుహృద్భావ సంబంధాలు ఎందుకు విచ్ఛిన్నమయ్యాయి? జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచన జూలై 15న కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశంలో అంకురించింది. 63 మంది సభ్యులు సంబంధిత తీర్మానంపై సంతకాలు చేశారు. ఈ కారణంగా జూలై 21న ఆ తీర్మానాన్ని ఆమోదించడం ధన్‌ఖడ్‌కు తప్పనిసరి అయింది (అదే రోజున లోక్‌సభలో ప్రభుత్వం స్వయంగా అటువంటి తీర్మానాన్ని ప్రవేశపెట్టింది). ఈ తీర్మానం మూలంగా జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన తీర్మానంపై కూడా ధన్‌ఖడ్ నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. ఆయన గత ఏడు నెలలుగా ఈ అభిశంసన తీర్మానాన్ని స్వీకరించేందుకు ఆమోదించలేదు. ఈ రెండు అభిశంసన తీర్మానాలపై ధన్‌ఖడ్ నిర్ణయాలే ఆయన రాజీనామాకు దారితీశాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నేను ఈ అభిప్రాయంతో విభేదిస్తున్నాను. ఆయన రాజీనామా వెనుక 'ప్రస్తుతానికి తెలియని కారణాలు' ఉన్నాయని నేను భావిస్తున్నాను. జీవితం ఒక రహస్యం, అది కొన్నిసార్లు అమర్యాదకరంగా ఉంటుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కశ్మీర్‌కు న్యాయం జరిగేదెన్నడు?

సరిగ్గా పది సంవత్సరాల క్రితం నేను కశ్మీర్ లోయను సందర్శించాను. విభిన్న జీవన రంగాలకు చెందిన వారితో మాటా మంతీ జరిపాను. జర్నలిస్ట్ షుజాత్ బుఖారీ వారిలో ఒకరు. జనవరి 2015లో నేను యాదృచ్ఛికంగా ఢిల్లీలోని ఒక బుక్ షాప్‌లో బుఖారీని కలుసుకోవడం జరిగింది. తన స్వరాష్ట్రాన్ని సందర్శించాలని ఆయన నన్ను కోరారు. అదే ఏడాది ద్వితీయార్థంలో నేను శ్రీనగర్‌కు వెళ్లాను. ఆ సందర్భంలో కశ్మీర్ గతం, వర్తమానంపై మా ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఆ బాధాతప్త భూమి చరిత్రపై నా అవగాహన నిశితమూ ప్రగాఢమూ అయింది.

జూన్ 2018లో షుజాత్ బుఖారీ హత్యకు గురయ్యారు. హంతకులు ఎవరు, ఏ ఉద్దేశాలతో వారు ఈ క్రూర చర్యకు పాల్పడిందీ ఇప్పటికీ వెల్లడి కాలేదు. మరుసటి సంవత్సరం మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ని రద్దు చేసింది. భారత గణతంత్ర రాజ్య చరిత్రలో ఒక సంపూర్ణ రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయడం అదే మొదటిసారి. ఆ తరువాత కేంద్ర హోం మంత్రిత్వశాఖ బీజేపీకి పరమ విధేయుడు అయిన ఒకరిని కశ్మీర్‌కు లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించింది. అధికరణ 370 రద్దు, జమ్మూ-కశ్మీర్ ప్రజలకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించడమే. రాజ్యాంగ ద్రోహమది. అయితే న్యూఢిల్లీలో అధికారంలో ఉన్నది భారతీయ జనతా పార్టీ కనుక ఆ చర్య అనూహ్యమైన విషయమేమీ కాదు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయాలని బీజేపీ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నది. ముఖ్యంగా చెప్పవలసిన విషయం ఒకటి ఉన్నది: అధికరణ 370ని రద్దు చేస్తూ జమ్మూ-కశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో హామీ ఇచ్చింది.

ఆ హామీ ఇచ్చి ఇప్పటికి దాదాపుగా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. అయితే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు సూచనలేవీ కానరావడం లేదు. ఉద్యోగిస్వామ్య ఉదాసీనత కారణంగా ఈ జాప్యం జరగడం లేదు, హానికరమైన రాజకీయ ఉద్దేశమే దాని వెనుక ఉన్నదని చెప్పక తప్పదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు నెల రోజులు గడువు మాత్రమే ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం బిహార్ జనాభాలో పదో వంతు మాత్రమే ఉన్న జమ్మూ-కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు ఐదేళ్ల వ్యవధిని తీసుకున్నది. శాసనసభ నియోజకవర్గాలను పునర్విభజించారు. ఈ చర్య హిందువులు అధికంగా ఉన్న జమ్మూకు అనుకూలంగానూ, ముస్లింలు అధికంగా ఉన్న కశ్మీర్‌కు ప్రతికూలంగాను పర్యవసించింది. కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీకి ప్రత్యామ్నాయంగా మూడవ పార్టీనే కాకుండా నాల్గవ పార్టీని సైతం ప్రోత్సహించేందుకు బీజేపీ ప్రయత్నించింది. కశ్మీర్‌లో పత్రికా స్వేచ్ఛను అణచివేశారు. స్వతంత్ర వైఖరితో నిష్పాక్షికంగా వ్యవహరించే పాత్రికేయులను పోలీసులు పలు విధాల వేధించారు, అరెస్ట్ చేశారు, ప్రవాసానికి వెళ్లిపోయేలా బలవంతపెట్టారు.



కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వాదనకు ఒకప్పుడు స్వల్ప సానుకూలత ఉండేది. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద హింసాకాండను అదేపనిగా ప్రోత్సహించిన కారణంగా కశ్మీర్‌పై ఆ దేశానికి ఏదైనా హక్కు ఉంటే అది చాలా కాలం క్రితమే నైతికంగా రద్దయిపోయింది. ఆ సుందరభూమిపై భారత్‌కు ఎటువంటి మినహాయింపులు లేని సార్వభౌమత్వం సమకూరాలంటే కశ్మీరీలకు కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. కశ్మీర్‌కు తక్షణమే రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడం అందుకు విధిగా వేయవలసిన మొదటి అడుగు.

ఎన్నికల ప్రక్రియను తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు బీజేపీ చేసిన ఈ ప్రయత్నాలన్నీ అంతిమంగా విఫలమయ్యాయి. నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధించింది. వాజపేయి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఈ పార్టీని ఇప్పుడు మోదీ నాయకత్వంలోని బీజేపీ తిరస్కరిస్తోంది. కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు చాలా నెలల ముందు జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఎన్నికల అనంతరం బీజేపీ అక్కడ ప్రతిపక్షంగా మిగిలిపోవడంతో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాన్ని పాటించేందుకు మోదీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు.

జమ్మూ-కశ్మీర్‌కు ఇప్పుడు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి- ఒమర్ అబ్దుల్లా ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ తమ ఏకైక హిందూ ఎమ్మెల్యేను ఉపముఖ్యమంత్రిగా నియమించింది. ఇది ప్రతీకాత్మక చర్యే అయినప్పటికీ చాలా ప్రాధాన్యమున్న అంశం. అయితే ప్రభావశీల నిర్ణయాలు తీసుకునే అధికారాలు అన్నీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికకాని లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాత్రమే ఉన్నాయి. జమ్మూ-కశ్మీర్‌లో శాంతి సామరస్యాల స్థాపనకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి, ఆయన కేబినెట్ చేయగలిగేది ఏమీ లేదు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి కేంద్రంతో ఘర్షణపడడం కాకుండా రాజీ వైఖరితో, చాలా నమ్రతతో కూడా వ్యవహరిస్తున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌ను నేరుగా విమర్శించకుండా చాలా జాగ్రత్త పడుతున్నారు. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరించాలని చాలా సౌజన్యశీలంగా కేంద్రానికి పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఈ నెల ప్రథమార్థంలో లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఆయన నేరుగా తలపడడం అనివార్యమయింది. 13 జూలై 1931న మహారాజా హరిసింగ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కశ్మీరీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసనకారులపై మహారాజా పోలీసులు జరిపిన కాల్పుల్లో 21 మంది చనిపోయారు. వారి స్మృత్యర్థం ప్రతి ఏటా జూలై 13న కశ్మీర్ లోయ అంతటా అమర వీరుల సంస్మరణ దినంను పాటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జూలై 13న అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కశ్మీరీలు ఆ 'అమరవీరుల సంస్మరణ దినం'ను పాటించడాన్ని నిరోధిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ రోజున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను గృహ నిర్బంధంలో ఉంచారు. మరుసటి రోజు ఆ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించేందుకు ఒమర్ అబ్దుల్లా వారిని ఖననం చేసిన శ్మశానానికి గోడదూకి వెళ్లారు.

5 ఆగస్టు 2019 దాకా జమ్మూ-కశ్మీర్‌లో 13 జూలై ఒక సాధారణ సెలవుదినంగా ఉండేది. కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయబడిన తరువాత సాధారణ సెలవు దినాల జాబితా నుంచి జూలై 13ను తొలగించారు. అందుకు బదులుగా మహరాజా హరిసింగ్ పుట్టిన రోజును సెలవుదినంగా ప్రకటించారు. ఇది ద్వేషపూరిత చర్య. బహుశా, ముస్లింలకు మన స్తాపాన్ని కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగా తీసుకున్న మెజారిటీవాద నిర్ణయం. అమరవీరుల సమాధులను సందర్శించేందుకు అనుమతి నిరాకరింపబడిన తరువాత ఒమర్ అబ్దుల్లా ఇలా ట్వీట్ చేశారు: 'జూలై 13 హత్యాకాండ మన జలియన్ వాలా బాగ్. ఆ రోజున తమ ప్రాణాలు అర్పించినవారు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేశారు. అప్పుడు కశ్మీర్, బ్రిటిష్ సార్వభౌమాధికార పాలనలో ఉన్నది. ఎంత సిగ్గు చేటు! బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వారు ముస్లింలు అయిన కారణంగా గౌరవార్హులు కానివారుగా పరిగణిస్తున్నారు'. ఒమర్ అబ్దుల్లా ట్వీట్‌లో మొదటి వాక్యం కాసింత అతిశయోక్తి అయినా మిగతా వాక్యాలన్నీ సత్యాన్ని చాటాయి. 1857, 1947 మధ్య మహారాజులు, నవాబులు అందరూ ఎటువంటి మినహాయింపు లేకుండా బ్రిటిష్ పాలకుల కాకారాయుళ్లు. ఆనాటి సంస్థానాల పాలనా ప్రమాణాల ప్రకారం చూసినా మహరాజా హరిసింగ్ క్రూరుడైన నిరంకుశ పాలకుడు. ఆయన పాలనను వ్యతిరేకించిన వారిలో అత్యధికులు ముస్లింలే అయిన కారణంగా జూలై 13ను సెలవు దినాల జాబితా నుంచి తొలగించి ఉంటారని భావించవచ్చు.

కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించకపోవడం ఒక పవిత్ర హామీని మోదీ ప్రభుత్వం ఉల్లంఘించడమే. కశ్మీరీలను అగౌరవపరచడం ఈ ఒక్క అంశానికి మాత్రమే పరిమితమైనది కాదు. ప్రభుత్వంలో భాగం కాని భారతీయులు సైతం కశ్మీరీలకు జరుగుతున్న అవమానాలకు బాధ్యులే. 12 ఆగస్టు 2019న కశ్మీర్ లోయ పెట్టుబడులు పెట్టే విషయమై తమ గ్రూపు ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించనున్నదని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ ప్రకటించారు. ఇది ఇంతవరకు కార్యరూపం ధరించనే లేదు.


కశ్మీరీల దుస్థితికి మీడియాను కూడా తప్పుపట్టవలసి ఉన్నది. ముఖ్యంగా జాతీయ రాజధాని ప్రాంతంలోని పత్రికలు, టీవీ ఛానెల్స్ ప్రభుత్వానికి విధేయంగా వ్యవహరిస్తూ కశ్మీర్‌లో సంభవిస్తున్న సంఘటనలపై వాస్తవాలు వెల్లడించడంలేదు. 5 ఆగస్టు 2019 నుంచి మోదీ ప్రభుత్వం చేపట్టిన లేదా చేపట్టని చర్య ప్రతిదీ స్వేచ్ఛాయుత, ఆత్మగౌరవ పౌరులుగా కాకుండా పూర్తి విధేయతతో వ్యవహరించాలని కశ్మీరీలకు స్పష్టం చేస్తోంది. కశ్మీర్ వెలుపల సువిశాల భారతదేశంలోని ఆమ్ ఆద్మీలు సైతం కశ్మీర్ పట్ల శతృత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కశ్మీరీ విద్యార్థులను వేధింపులకు లోను చేస్తూ విద్యాభ్యాసాన్ని విరమించుకుని వెళ్లిపోయేలా చేస్తున్నారు. పహల్గామ్ హత్యాకాండలో కశ్మీరీలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా సాహసోపేతంగా పర్యాటకులను కాపాడారన్న కృతజ్ఞతా భావం సగటు భారతీయులలో కానరాక పోవడం దురదృష్టకరం కాదా? సామాజిక మాధ్యమాలలో మన సహచర పౌరులు అయిన కశ్మీరీలను ముస్లింలు అయిన కారణంగా దేశభక్తి ప్రపూరితులు కారనే ప్రచారం జరుగుతోంది.

కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వాదనకు ఒకప్పుడు స్వల్ప సానుకూలత ఉండేది. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులకు మద్దతునిచ్చి, ఉగ్రవాద హింసాకాండను అదేపనిగా ప్రోత్సహించిన కారణంగా కశ్మీర్, కశ్మీరీలపై ఆ దేశానికి ఏదైనా హక్కు ఉంటే అది చాలా కాలం క్రితమే నైతికంగా రద్దయిపోయింది. ఆ సుందర భూమిపై భారత్‌కు ఎటువంటి మినహాయింపులు లేని సార్వభౌమత్వం సమకూరాలంటే కశ్మీర్ ప్రజలకు కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. కశ్మీర్‌కు తక్షణమే రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడం అందుకు విధిగా వేయవలసిన మొదటి అడుగు. అదే సమయంలో, భారత గణతంత్ర రాజ్యంలో తాము ఎటువంటి వివక్షలకు గురికాని సంపూర్ణ, గౌరవప్రదమైన భాగస్వాములమనే భావన కశ్మీరీల మనసుల్లో నెలకొనేందుకు మనం మరెంతో చేయవలసి ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

అనేక తరాల విప్లవ ఆత్మీయుడు

చలసాని ప్రసాద్ జ్ఞాపకంగా మారి పదేళ్లు. ఎప్పటికీ నిలిచి ఉండే అరుదైన ఆయన వ్యక్తిత్వానికి, ఆచరణకి కాలపు లెక్కలతో నిమిత్తం లేదు. దేశవిభజనకి ముందునుంచీ తెలుగు సమాజం మీద ప్రభావం చూపుతూ వస్తున్న కమ్యూనిస్ట్ తాత్విక భావధారలో భాగం 'సీపీ'. కృష్ణా జిల్లాలో తొలితరం కమ్యూనిస్ట్ బాల సంఘాలలో చేరి పనిచేయడం, చిన్న వయసులోనే పేద ప్రజల పోరాటాలను సపోర్ట్ చేస్తూ పాటలు రాయడం, తెలంగాణ సాయుధ పోరాటంలో కుటుంబ సభ్యులని పోగొట్టుకోవడం, తన చుట్టూ ప్రభావశీలురైన నాయకులు, సాహిత్యకారులు ఉండడం వంటి అనేకానేక అంశాలు ఆయన జీవితాన్ని 'సమసమాజ ఆకాంక్ష' మీద ఎటూ తొణికిపోకుండా నిలబెట్టాయి. నమ్మిన రాజకీయాలకి ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా చుట్టూ అసంఖ్యాక ఆప్తుల మరణాలు ఎదురైనా విప్లవమే ఆయనని ఓదార్చింది, తీర్చిదిద్దుకుంది, చేయి పట్టుకుని నడిపింది. అందుకు అనుగుణంగా తన మేధను, హృదయాన్ని నిరంతరం సిద్ధంగా ఉంచడమే ఆయన వ్యక్తిగత ఆచరణ.



ఇస్త్రీ లేని ఉతికిన బట్టలు, సాదా చెప్పులు, నల్లటి స్ట్రాప్ ఉన్న చిన్న వాచీ, కొద్దిగా ఊగుతూ నడుస్తూ, వెస్పా బండి మీద ఎక్కడ, ఎవరు, ఏ కార్యక్రమానికి పిలిచినా రయ్యిన వాలిపోయేవారు. ఎనభై మూడేళ్ల వయసుని కూడా అంత సార్థకం చేసిన చలసాని ప్రసాద్‌ను గుర్తు చేసుకోవడం కూడా ఒక పుస్తకం చదివినట్లే.

శ్రీకాకుళ గిరిజన పోరాటం జరిగే సమయానికి సీపీ విశాఖపట్నంలో ఉన్నారు. స్వతహాగానే దాని ప్రభావాన్ని అందిపుచ్చుకున్నారు. పోరాటం గిరిజన ప్రాంతాలలో వాటి సరిహద్దుల్లో జరిగినా, దాని ప్రభావ కేంద్రం విశాఖపట్నమే. గిరిజన పోరాటం నుంచి మొదలుపెట్టి నక్సల్బరీ ప్రభావంతో తదనంతర కాలంలో ఏవోబీ తదితర ప్రాంతాల్లో విస్తరించిన మావోయిస్ట్ పార్టీ కార్యకలాపాల సానుభూతిపరుడిగా, విప్లవోద్యమానికి మద్దతు సంపాదించడానికి విశాఖ కేంద్రంగా పనిచేసారు. ఆయన ఇల్లే మేధాకేంద్రంగా మారిపోయింది. దాదాపు అయిదు దశాబ్దాల పాటు విశాఖ అవుట్ పోస్ట్‌ని కాపాడిన విప్లవ కార్యకర్త ఆయన.

శ్రీశ్రీ షష్టిపూర్తి సభలు, వాటి రద్దు, విరసం ఆవిర్భావం, ఆ సంస్థలో శ్రీశ్రీ, కొకు, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు వంటి రచయితలు చేరడం... వీటన్నిటి వెనుకా చోదక శక్తులుగా పని చేసినవారిలో చలసాని ప్రసాద్ చాలా ముఖ్యులు. విరసంలో, పార్టీలో ఉండే అంతర్గత విభేదాలు, ఫలితంగా తీసుకునే నిర్ణయాల పట్ల నిబద్ధంగా ఉంటూనే ఆయా రాజకీయ నిర్మాణ అంశాల కఠిన ప్రభావాలను వ్యక్తిమాత్రుల మీద చూపేవారు కాదు. మనుషుల మీద, వారి ఆచరణల మీదా తీర్పులు ఇవ్వకపోవడమే కాదు, ఉన్నంతలో వారిని కాపాడుకోవాలని తాపత్రయపడేవారు. మనుషుల అభిప్రాయాలు మారడమో, స్థానాలు మారడమో, వైఖరులు మారడమో జరిగినపుడు వారిని పోగొట్టుకోకూడదు, వారిలో ఎంత ఉంటే అంత, ఉన్నంతలో నిలబెట్టుకోవాలని అనుకునేవారు. శ్రీశ్రీ విరసంలోనే కొనసాగడం కోసం సీపీ పడిన తపన ఇందుకు ఉదాహరణ. మహామహులుగా పేరు పొందిన రచయితలు అనేక కారణాల రీత్యా విప్లవ రాజకీయాలకి దూరం జరిగినా, దాన్ని బాహాటంగా తీవ్రంగా ప్రకటించకపోవడం, ఏదో మేరకి అభ్యుదయ, విప్లవ ఉద్యమాలకి సపోర్ట్‌గా నిలబడటం వెనుక ఆయా రచయితల నిబద్ధతతో పాటు చలసాని ప్రసాద్ ముద్ర చాలా ఉంది.

ఎవరైనా సమాజానికి ఏ కొద్దిగానైనా ఉపయోగపడతారు అనుకుంటే ఆ వ్యక్తి చుట్టూ ఉండే సమస్త ప్రపంచంతో అనుబంధం పెంచుకుంటారు సీపీ. వారి మార్గాన్ని సుసాధ్యం చేయడానికి ఉండే అడ్డంకులతో ఓపికగా సంభాషణ చేస్తారు. అంతటి ఎనర్జీ చాలా అరుదుగా మాత్రమే చూస్తాం. సాహిత్యం, విప్లవ రాజకీయాలతో ఏమీ సంబంధం లేనివారు కూడా సీపీ ఏ పని అడిగితే అది చేయడానికి ఇష్టపడేవారు. మనుషుల్ని విప్లవ సానుభూతి పరులుగా మార్చడానికి ఆయన ఎంచుకున్న మార్గం ప్రేమ, మానవీయ సంభాషణ. ఒక వ్యక్తి తన జీవితకాలంలో వంద మానవ సంబంధాలను నిర్వహించగలరు అనుకుంటే సీపీ అంతకు పది రెట్లు. ఈ ఓపికకి కారణం విప్లవోద్యమం పట్ల ఉన్న ప్రేమ మాత్రమే కాదు, మనుషులు కావాలి, జన సందోహమే ఆయన ఊపిరి.

ఆయన ఆచరణ పద్ధతులు కొన్ని ఆసక్తికరంగా ఉంటాయి. కమ్యూనిస్ట్ సమాజంలో స్త్రీ పురుషులు సమానం కనుక స్త్రీల స్నేహం పట్ల చాలా విలువగా, గౌరవంగా ఉండేవారు. కృష్ణాబాయితో ఆయన స్నేహం దాదాపు అర్థ శతాబ్ది పైన. అరమరికలు ఎరుగని మంచి మిత్రులుగా కలిసి చేసిన కార్యక్రమాలు, రచనలు, సంపాదకత్వ బాధ్యతలు అనేకం. అలాగే ఆయన ఇంటికి వెళ్లినవారికి తెలుసు ఆయన ఎన్నడూ ఇంటికి తాళాలు వేసి ఎరుగరు. అనేక మేధా చర్చలు, పుస్తకాలు రెక్కలు ఆహ్వానం పలుకుతాయి. ఇష్టపడి వచ్చేవారికి ఆ ఇల్లు ఎపుడూ 'నో' చెప్పలేదు. ఇస్త్రీ లేని ఉతికిన బట్టలు, సాదా చెప్పులు, నల్లటి స్ట్రాప్ ఉన్న చిన్న వాచీ, కొద్దిగా ఊగుతూ నడుస్తూ, వెస్పా బండి మీద ఎక్కడ, ఎవరు, ఏ కార్యక్రమానికి పిలిచినా రయ్యిన వాలిపోయేవారు. ఎనభై మూడేళ్ల వయసుని కూడా అంత సార్థకం చేసిన చలసాని ప్రసాద్ వంటివారిని గుర్తు చేసుకోవడం కూడా ఒక పుస్తకం చదివినట్లే.

అన్ని తరాల వారితో ఇట్టే కలిసిపోగల చాతుర్యం, నిష్కళమైన నవ్వు మొహం, నొప్పించకుండా ఒప్పించే నేర్పు, నమ్మినదాని పట్ల తిరుగులేని నిబద్ధత, మనుషులంటే అవధులు లేని ప్రేమ, పుస్తకాల విలువని నిజార్థంలో గుర్తించి అపురూపమైన లైబ్రరీని తయారు చేసిన చదువరి, సాయం చేయడానికే పుట్టినట్టు ఉండే అపురూపమైన మిత్రుడు, తన చుట్టూ ప్రపంచాన్ని ప్రేమ, విప్లవాలతో ముడివేసిన గొప్ప మానవుడి జ్ఞాపకాలను మరొక్కసారి మనసారా హత్తుకుంటూ...

■ కె.ఎన్. మల్లీశ్వరి

జూలై 27న చలసాని ప్రసాద్ పదో వర్ధంతి. ఉదయం 10 గంటలకు విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో విరసం ఆధ్వర్యంలో సభ. మూడు సెషన్లుగా జరిగే ఈ సభలో అరసవిల్లి కృష్ణ, సీఎస్ఆర్ ప్రసాద్, కృష్ణాబాయి(ఆన్‌లైన్) కలిసి 'చలసాని ప్రసాద్ డిజిటల్ లైబ్రరీ'ని ప్రారంభిస్తారు. సత్యనారాయణమూర్తి, మధు, లక్ష్మీ, వేణు, టి. శ్రీరామమూర్తి, ప్రసాదవర్మ, కొండపర్తి పద్మ, మానం ఆంజనేయులు, చందు సుబ్బారావు... చలసాని ప్రసాద్‌తో తమ జ్ఞాపకాలను పంచుకుంటారు. స్మారక ప్రసంగం కె.ఎన్. మల్లీశ్వరి చేస్తారు. బాలసుధాకర్ మౌళి, రివేరా, ఇప్టూ ప్రసాద్ వివిధ అంశాలపై ప్రసంగిస్తారు.

అరాచకాలకు అంతమే లేదా?

ఒంటరి పిల్ల కనిపిస్తే కాటువెయ్యడం
మాటువేసి మట్టుపెట్టి
మాయం చేయడం
హత్యలకు ఇక హద్దే లేదు
ఆత్మహత్యలు ఆగేది లేదు
మానవత్వం మసకబారుతుంది
అమానుషం పెచ్చుమీరుతుంది
అరాచకాలకు అంతమే లేదా?
ఆదిమానవులే నయం కాదా!

అరచేతిలో అశ్లీలమా
అధ్యాపకులే కీచకులా
బంధువులే రాబందులా

అమ్మలాంటి ఆడది కనిపించినా
చెల్లిలాంటి చిన్నారి
అన్నా అని పిలిచినా
గురువులే దైవమని భావించినా
పూజారే దేవుడని ప్రార్థించినా
పూనకం వచ్చినట్టు ఊగిపోవడం
పశువు కన్నా హీనంగా ప్రవర్తించడం


పరితాపం లేదు
పరివర్తన కలుగదు
ప్రాయశ్చిత్తం చేసుకోరు
కన్ను మిన్ను కానని కామాంధులు

కఠిన దృష్టి సారించాలి పాలకులు
మీ మీదే పెట్టుకున్నారు ప్రజలు ఆశలు

– నన్నపనేని రాజకుమారి

వ్యాసాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.





ఇంద్రకీలాద్రిపై కాంతిపుంజం

ఇంద్రకీలాద్రిపై కొద్దిరోజులుగా ఓ దివ్య తేజస్సు ద్విగుణీకృతమవుతోంది. కొండ శిఖరాగ్రంపై సిందూర వర్ణంలోని ఓ కాంతిపుంజం ఆశ్చర్యపరుస్తోంది. ఇది గమనించిన కొందరు భక్తులు తమ సెల్‌ఫోన్లలో ఆ చిత్రాలు బంధించారు. ఈ నెల 21వ తేదీ రాత్రి 8.36 గంటలకు, 24వ తేదీ రాత్రి 9.22 గంటలకు ఈ వెలుగులు ప్రసరించాయి. సుమారు అరగంట పాటు కనిపించాయని భక్తులు చెబుతున్నారు. ఇది అమ్మవారి ఔన్నత్యమేనని మొక్కుతున్నారు. - ఇంద్రకీలాద్రి



ప్రేమవానలో తడిపేశావమ్మా..

తనకు బదులుగా దేవుడు అమ్మను సృష్టించాడో లేదో తెలియదు కానీ.. ఈ చిత్రం చూస్తే నిజంగా అమ్మ దేవతేననిపిస్తుంది. ఎండైనా.. వానైనా.. కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకునేది ఒక్క మాతృమూర్తి మాత్రమేనని అర్థమవుతుంది. కుండపోత వానలోనూ తాను తడుస్తూ తన బుజ్జాయిలకు గొడుగు పట్టిన ఈ అమ్మప్రేమలోని కమ్మనైన చిత్రం శుక్రవారం నగరంలోని బందరురోడ్డులో కనిపించింది.

కంత్రీ కోటీశ్వరమ్మ



నమ్మించి నట్టేటముంచిన చీటింగ్ లేడీ

పేద, మధ్యతరగతి మహిళలతో చీటీలు వేయించి..

- పాడుకున్న సొమ్ము తానే తీసుకుని వడ్డీ చెల్లింపు
- ఆ వడ్డీని చీటీల సొమ్ముగా తిరిగి మినహాయింపు
- మోసం తెలిసి లబోదిబోమంటున్న బాధితులు
- రూ.5 కోట్ల వరకు సొమ్ము ఉంటుందని అంచనా
- ఇంకా పరారీలోనే కోటేశ్వరమ్మ కుటుంబం

6

బుడమేరుపై భయమొద్దు

తెలంగాణాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బుడమేరుకు వరద వస్తుందేమోనని నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. సోషల్ మీడియాలో భయపెట్టేలా పోస్టులు పెడుతుండటంతో ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు భయాందోళనకు గురవుతుండగా పోలీసులు మైక్ ప్రచారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణాలో భారీ వర్షాలకు, బుడమేరు వరదకు ఎలాంటి సంబంధం లేదు. తెలంగాణాలో భారీ వర్షాలు కురిస్తే ఆ వరద నీరంతా వైరా, మునేరుల ద్వారా కృష్ణానదిలోకి వెళ్తుందే తప్ప.. బుడమేరులోకి రాదన్న విషయం నగర ప్రజలు గుర్తుంచుకోవాలి.

తెలంగాణ వర్షాలతో బుడమేరుకు సంబంధం లేదు

బుడమేరు పుట్టింది, ప్రవహించేది ఎన్టీఆర్ జిల్లాలోనే..


అనేక వాగులు, వంకల సమాహారమే ఈ కాల్వ

- గంపలగూడెం, ఏ.కొండూరు, మైలవరం, జి.కొండూరు
- ఈ నాలుగు మండలాల వర్షపాతంపైనే బుడమేరు వరద
- 20 సెంటీమీటర్ల పైబడి వర్షం కురిస్తేనే వరద వచ్చే చాన్స్
- తెలంగాణ వరద మునేరు, వైరా మీదుగా కృష్ణానదిలోకి..
- సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మి భయాందోళన వద్దు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తెలంగాణా ప్రాంతానికి, బుడమేరు పుట్టుక ప్రాంతానికి మధ్యలో ఎత్తయిన కొండలున్నాయి. కాబట్టి తెలంగాణకు, బుడమేరు వరదకు ఎలాంటి సంబంధం మిగతా 6లో..

అపోహలొద్దు

బుడమేరు ప్రవాహం అనేది అనేక వాగులు, వంకలు, చెరువుల సమాహారం. కొండవాగులు, రిజర్వు ఫారెస్ట్ నుంచి వచ్చే వాగులు, ఇతర వాగులన్నీ కలిస్తే బుడమేరు మహోగ్రరూపం దాల్చుతుంది. కాబట్టి ఆయా మండలాల్లో గరిష్ఠంగా 20 సెంటీమీటర్ల పైబడి వర్షం కురిస్తే తప్ప వరద వచ్చే పరిస్థితి ఉండదు. తెలంగాణా ప్రాంతంలోని భారీ వర్షాలు, వాగుల ఉధృతిని చూసి బెజవాడ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారాలను నమ్మకుండా మన జిల్లాలో కురిసే వర్షపాతం ప్రాతిపదికన బుడమేరు వరదను అంచనా వేయొచ్చు.





మూడేళ్లలో మెట్రో

విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టుల పూర్తికి ఒప్పందం

- విజయవాడకు 'టిప్సా', విశాఖకు 'శిస్ట్రా' జనరల్ కన్సల్టెన్సీల నియామకం
- మంత్రి నారాయణ సమక్షంలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎంఓయూ



మెట్రో రైల్ ఫేజ్-1 రూట్ మ్యాప్‌ను చూపిస్తున్న మంత్రి నారాయణ

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు జనరల్ కన్సల్టెంట్లతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమక్షంలో ఆయా కన్సల్టెన్సీ సంస్థలతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఒప్పందాలు చేసుకుంది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు స్పెయిన్‌కు చెందిన 'టిప్సా' సంస్థతోనూ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుకు ఫ్రాన్స్‌కు చెందిన శిస్ట్రా సంస్థను జనరల్ కన్సల్‌టెంట్లుగా నియమించుకుంది. నాలుగేళ్ల పాటు విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టుల నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం, నిర్వహణ వంటి సేవలను టిప్సా, శిస్ట్రా సంస్థలు అందించాల్సి ఉంటుంది. ఇందుకుగాను టిప్సా సంస్థకు రూ.188 కోట్లు, శిస్ట్రా సంస్థకు రూ.214 కోట్లు చెల్లించేందుకు ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పి.నారాయణ సమక్షంలో ఎంఓయూ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సత్వర రవాణా వ్యవస్థలను ప్రజలకు అందించటం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మెట్రో రైల్ ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ మెట్రో ప్రాజెక్టులను మిగతా 6లో..

విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేద్దాం

ప్రిలిమినరీ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని పిలుపు



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయని, ఈ సమయంలో నగరంలో విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం విజయవాడ ఉత్సవ్-2025 ప్రిలిమినరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి ఈ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని, నగరాన్ని టూరిజానికి కేరాఫ్‌గా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ అంటేనే ఒక వైబ్రేషన్ అని, ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగర ప్రజలకు సామాజిక బాధ్యత ఎక్కువని, వరద ముంచెత్తినప్పుడు వారి దాతృత్వం మరువలేనిదన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ఈ విజయవాడ ఉత్సవ్ ఎంతో దోహదపడుతుందన్నారు. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ ఎంపీ మానసపుత్రిక అన్నారు. పోలీసుశాఖ పరంగా విజయవాడ అభివృద్ధికి తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం స్పెషల్ సెక్రటరీ అజయ్‌జైన్, కమిషనర్ ధ్యానచంద్ర, 20 సూత్రాల కార్యక్రమం కమిటీ చైర్మన్ లంక దినకర్, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, పలువురు వ్యాపారవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో పూలతో ప్రత్యేక అలంకరణ

పుష్ప శోభితం

» శ్రావణ శుక్రవారం

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కనకదుర్గమ్మ దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను ఈవో శీనానాయక్, ఇతర అధికారులు క్రమబద్ధీకరించారు.



దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు

ఇంద్రకీలాద్రి క్షేత్రంలో దుర్గామల్లేశ్వరులకు విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని లక్షకుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కళ్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నవితరణకు విరాళాలు

దుర్గమ్మ నిత్య అన్నప్రసాద వితరణకు కృష్ణాజిల్లా వీరులపాడు మండలం జమ్మవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కృష్ణవేణి, కుటుంబీకులు రూ.1,01,116లు, విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన యలమంచిలి నాగశ్రీను రూ.1,01,116లు విరాళాలు అందజేశారు. శుక్రవారం అధికారుల ద్వారా విరాళాలను సమర్పించారు.





దాతలు జొన్నలగడ్డ కృష్ణవేణి, ఎలమంచిలి నాగశ్రీను, కుటుంబ సభ్యులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయఅధికారులు

శభాష్ టీచర్..

» మీ బోధనపై నమ్మకం ఉంది..

» ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్చిన ఉపాధ్యాయుడు



ఇద్దరు పిల్లలతో అబ్దుల్ హలీం

వత్సవాయి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మా పిల్లలు ప్రముఖ స్కూల్లో చదువుతున్నారు.. మా పిల్లాడికి ఎల్‌కేజీ ఫీజు లక్ష కట్టాం తెలుసా.. అని గొప్పలు చెప్పుకునే ఈరోజుల్లో లక్షల్లో వేతనం వస్తున్నా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని, అందిస్తామనే నమ్మకాన్ని కలిగించేలా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. వత్సవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అబ్దుల్ హలీం తన ఇద్దరు పిల్లలు ముజామిల్ హుస్సేన్, ముద్దాసిర్ హుస్సేన్‌లను స్థానిక ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయుడిని జడ్పీ పాఠశాల హెచ్ఎం ఎన్. అనితతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అక్షరాంధ్ర.. స్వర్ణాంధ్రకు వెలుగుబాట

» ఆగస్టు 7 నుంచి ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి అక్షరాంధ్ర వెలుగుబాట అని, సమష్టి కృషితో అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 'ఉల్లాస్-అక్షరాంధ్ర అక్షరాస్యత' కార్యక్రమంపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2025-26 సంవత్సరానికి అక్షరాస్యత లక్ష్యాలను చేరుకొనేందుకు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. వయోజనులైన నిరక్షరాస్యులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించడం జరిగిందని, వీరందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేయాలన్నారు. అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ద్వారా ఈనెల 31 నాటికి మండలాల్లో వలంటీర్ టీచర్లను గుర్తించి, మ్యాచింగ్-బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వలంటీర్ టీచర్‌ను మ్యాపింగ్ చేయాలన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం వుంటుందని, తర్వాత మండలస్థాయిలో వలంటీర్ టీచర్లు, రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో అధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఆగస్టు 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు నిర్వహించాల్సి వుంటుందన్నారు. తరగతుల్లో ఫంక్షనల్ లిటరసీతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 నుంచి వైద్య శిబిరాలు

» జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్ వెల్లడి

జగ్గయ్యపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో ఆగస్టు 5నుంచి జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, ఆప్కాబ్ మాజీ చైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ తెలిపారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పలువురు కౌన్సి లర్లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 5 నుంచి ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజు శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. నేత్ర, దంత, సాధారణ వ్యాధులకు పరీక్షలు జరుపుతారని వివరించారు. పట్టణ ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి వెంకట్రావుతదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ మహా సంప్రోక్షణ

» నేటినుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం

విజయవాడ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానాల అధ్వర్యంలో విజయవాడ పున్నమ్మతోటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లిఖార్జున తెలిపారు. మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అత్యంత వైభవంగా వెంకటేశ్వరస్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన అర్చకులు ఆర్.బాలమురళీకృష్ణ అయ్యంగార్, వేదాంతం వెంకట శశికిరణ్, దాతలు మాకినేని విజయకుమార్, ఆర్.సంజీవరెడ్డి, ఎస్.వేణు, తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో నేల ఆరోగ్యం బాగు

» రైతులకు వ్యవసాయ శాఖ డైరెక్టర్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలు అధికమవుతున్నందున నానో ఎరువుల వాడకం అవసరమనే విషయాన్ని రైతులు గుర్తించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. శుక్రవారం విజయవాడలో కోరమండల్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో నానో సాంకేతిక పరిజ్ఞానంపై జిల్లా వ్యవసాయ అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ పంటలకు మేలు చేసే నానో ఎరువులతో నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, నానో ఎరువులు వాడితే భావి తరాలకు సారవంతమైన భూములను అందించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది 21 లక్షల నానో బాటిల్ యూనిట్ల ఎరువులు వాడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, వీటివల్ల ప్రయోజనాలపై రైతులను చైతన్యవంతం చేయాలని సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ నానో సాంకేతికతపై మరిన్ని ప్రయోగాలు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఆవిష్కరణల్లో జిల్లాను నెం.1గా నిలపాలి

» రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు ప్రోత్సాహం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), స్పోక్స్ ద్వారా స్టార్టప్‌లకు కొత్త ఊపు రానుందని, ఈ స్పోక్‌ను సద్వినియోగం చేసుకొంటూ జిల్లాను ఆవిష్కరణల్లో నెం.1గా నిలిపేందుకు కృషిచేయనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం వివిధ స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికలకు, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరుగుతోందని, దీనికి అనుసంధానంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను కేటాయించడం జరిగిందని, ఎన్టీఆర్ జిల్లాకు కూడా ఒక స్పోక్‌ను కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఎనికేపాడులో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, ఈ నేపథ్యంలో సన్నద్ధతలో భాగంగా ట్రయలరన్‌గా కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు 62 స్టార్టప్‌లు తమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లిక్విడ్-సాలిడ్ వేస్ట్ రీసైకిలింగ్, డ్రోన్స్ యూజ్ కేసులు, అగ్రిటెక్, ఎన్విరాన్ డిజిటల్ వంటి సొల్యూషన్స్‌ను ప్రదర్శించినట్లు వివరించారు. సమాజంలో నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలకు అందరికీ అందుబాటులో వుండేలా కళాశాల విద్యార్థులు, యువత కొత్త ఆలోచనలతో ప్రాజెక్ట్ రూపకల్పన చేస్తున్నారని, వీరికి అన్ని విధాలా ఆర్‌టీఐహెచ్ హబ్, స్పోక్స్‌ల ద్వారా మద్దతు లభిస్తుందన్నారు. చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండే టెక్ సొల్యూషన్స్‌ను ప్రోత్సహించి, వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొనేలా, బ్యాంకింగ్ మద్దతుకు సహాయ సహకారాలు అందచేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో ఇగ్నైట్ సెల్ ద్వారా వివిధ శాఖల పరిధిలో అందుబాటులో వున్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకొనేందుకు మార్గాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సరికొత్త ఆవిష్కరణలు దిశగా నడిపించేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ దోహదం చేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వివిధ స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, తదితరులు పాల్గొన్నారు.



స్టార్టప్ కంపెనీల స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియ

టీటీడీ ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, జూలై 25(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు శుక్రవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన ఎల్వీ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ పీసీ రాయల్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, బెంగుళూరుకు చెందిన సుకుమార్ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళాల చెక్కులను అందజేశారు.



విరాళం చెక్కులను అదనపు ఈవోకు అందజేస్తున్న దాతలు

5 నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుమల, జూలై 25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు మూడురోజుల పాటు వైఖానస ఆగమోక్తంగా పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలయంలో తెలిసీ తెలియక జరిగే దోషాల పరిహారం కోసం శ్రీవారి ఆలయంలో ఏటా శ్రావణ మాసంలో మూడురోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు.

బుడమేరుపై భయమొద్దు

(5వ పేజీ తరువాయి)

లేదు. ఎన్టీఆర్ జిల్లాలో కురిసే భారీ వర్షాలకే బుడమేరు పొంగుతుంది. జిల్లాలోని గంపలగూడెం, ఏ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు.. ఈ నాలుగు మండలాల పరిధిలో అత్యంత భారీ వర్షాలు కురిస్తేనే బుడమేరు ఉప్పొంగుతుంది. ఈ మండలాల పరిధిలో కిందటి సెప్టెంబరులో ఒక్క రోజులో 30 సెంటీమీటర్ల మేర వర్షం కురవటం వల్ల బుడమేరు ఉగ్రరూపం దాల్చింది.

బుడమేరు పుట్టింది ఎన్టీఆర్ జిల్లాలోనే..

బుడమేరు పుట్టుక మన జిల్లాలోనే జరిగింది. ఏ.కొండూరు మండలం జమ్మలవాయిదుర్గం కొండపై బుడమేరు పుట్టింది. ఈ కొండపై పడిన వర్షపు నీరు, గంపలగూడెం మండలంలో కురిసిన వర్షపు నీటితో బుడమేరు ప్రారంభమవుతుంది. ఇలా కొంతదూరం ప్రయాణించాక పలు ప్రాంతాల్లో అనేక వాగులు, వంకలు కలుస్తాయి. ఇవన్నీ పొంగిపొర్లినపుడు బుడమేరు మహోగ్రరూపం దాల్చుతుంది. జమ్మలవాయిదుర్గం నుంచి ప్రవహించాక బుడమేరు చీమలపాడు దగ్గర పాలవాగులో కలుస్తుంది. అక్కడి నుంచి ఒక పాయ విడిపోయి మైలవరం మండలం మెర్సుమల్లి కొండవాగు, అనంతవరం కొండవాగు, మైలవరం కొండవాగు వద్ద జి.కొండూరు చేరుతుంది. మరో పాయ కూడా కూనపరాజుపర్వ నుంచి కొండవాగు, రెడ్డిగూడెం నుంచి వచ్చే కోతుల వాగులో కలిసి జి.కొండూరు చేరుతుంది. ఇక్కడే రెండు పాయలు కలిసి బుడమేరుగా రూపాంతరం చెందుతాయి. ఇక్కడి నుంచి బుడమేరు వెల్లటూరు, కందులపాడు, హెచ్.ముత్యాలంపాడు మీదుగా ముందుకు వెళ్తుంది. వెల్లటేరు వద్ద కొండవాగు ఒకటి కుంటముక్కల చెరువులో కలుస్తుంది. ఆ చెరువు నిండినప్పుడు నీరంతా బుడమేరులో చేరుతుంది. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ దగ్గరకు వచ్చేసరికి కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి పులివాగు వచ్చి బుడమేరులో మిళితమవుతుంది. ఇక్కడి నుంచి బుడమేరు డైవర్షన్ చానల్ ద్వారా ఎన్టీటీపీఎస్ మీదుగా వరదను కృష్ణానదిలో కలుపుతారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్యానికి మించి వరద వస్తే రెగ్యులేటరీ గేట్లు పైకెత్తి నీటిని దిగువకు వదులుతారు. ఇలా వెళ్లే ప్రవాహంలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ నుంచి వచ్చే కప్పలవాగు (పినపాక), తొమ్మండ్రువాగు (కట్టుబడిపాలెం) కూడా కలుస్తాయి. విజయవాడ దిగువన ఉండే కుంపిణీ వాగు బ్రహ్మయ్యలింగం చెరువులోకి వస్తుంది. బ్రహ్మయ్యలింగం చెరువు పొంగితే చీమలవాగు ద్వారా పోలవరం కాల్వ దిగువన ఉన్న యూటీ నుంచి పురుషోత్తపట్నం చెరువులోకి వెళ్తుంది. ఆ చెరువు పొంగితే ముస్తాబాద మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఈ చెరువు నుంచి వచ్చే మరో పాయ పురుషోత్తపట్నం రైల్వేగేటు సమీపం నుంచి జక్కలనెక్కలం మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఇక అక్కడి నుంచి బుడమేరు విజయవాడ, ఎనికేపాడు యూటీ మీదుగా కొల్లేరు చేరుతుంది.

మూడేళ్లలో మెట్రో

(5వ పేజీ తరువాయి)

గాడిన పెడుతున్నామన్నారు. నగరాలలో పెరుగుతున్న వాహనాలు, ట్రాఫిక్ సమస్యలకు మెట్రో రైళ్లు మాత్రమే పరిష్కారమన్నారు. దీనిని గుర్తించి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూడా విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులను పట్టాలెక్కించాలన్న ఉద్దేశంతో వాటికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. విశాఖపట్నం మెట్రో టెండర్లను పిలిచామని, విజయవాడ మెట్రో టెండర్లు కూడా కొద్ది రోజుల్లో ఆహ్వానిస్తామని చెప్పారు. విశాఖపట్నంలో రూ.11,498 కోట్ల అంచనా వ్యయంతో, విజయవాడలో రూ.10,118 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైల్ ప్రాజెక్టును చేపడుతున్నామని నారాయణ వెల్లడించారు. రెండు మెట్రో ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం, మిగిలిన 60 శాతం కేంద్ర ప్రభుత్వం ఇప్పించే రుణంతో చేపట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ 20 శాతం వాటాగా విజయవాడలో ఏపీసీఆర్డీఏ, విశాఖలో వీఎంఆర్డీఏ ద్వారా నిధులు సమకూర్చనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్-1 లో 3 కారిడార్లుగా 46.23 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కిలోమీటర్ల మేర 29 స్టేషన్లతో కారిడార్-1, గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కిలోమీటర్ల మే 6 స్టేషన్లతో కారిడార్-2, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కిలోమీటర్ల మేర 7 స్టేషన్లతో కారిడార్-3 పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. తాటిచెట్లపాలెం నుంచి మధురవాడ వరకు 20 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ లైన్ వస్తుందని తెలిపారు. విశాఖ మెట్రో కోసం కేంద్ర నిధులు రూ.2018 కోట్లు, రాష్ట్ర నిధులు రూ.2863 కోట్లు, భూ సేకరణకు రూ.847 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. విజయవాడ మెట్రో రైలుకు మొదటి దశలో 35.04 కిలోమీటర్ల మేర పనులు చేపడుతున్నట్టు చెప్పారు. గన్నవరం బస్‌స్టేషన్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్ల పొడవున కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్‌కు వరకు 12.45 కిలోమీటర్ల చొప్పున కారిడార్-2 మొత్తంగా 33 స్టేషన్లతో నిర్మించనున్నట్టు చెప్పారు. విజయవాడ మెట్రో భూ సేకరణకు రూ.1152 కోట్ల మేర ఖర్చు అవుతుందని నారాయణ వెల్లడించారు. రుణంగా తీసుకునే మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ చెల్లిస్తుందని తెలిపారు. విశాఖ మెట్రోకు 99.75 ఎకరాలు, విజయవాడ మెట్రో 91 ఎకరాల భూములు అవసరమౌతున్నాయని, భూ సేకరణకు నోటీసులు ఇచ్చామని తెలిపిన మంత్రి మూడేళ్లలో మెట్రో రైల్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు.

కంత్రీ కోటీశ్వరమ్మ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కుటుంబ నిర్వహణ కోసం తమ తమ భర్తలిచ్చిన డబ్బు నుంచి కొంత పక్కన పెట్టారు. చీటీలు వేసి, వాటిని డబుల్ చేసి ఏదో ఒకరోజు తమతమ భర్తల చేతుల్లో పెట్టి సర్‌ప్రైజ్ చేయాలనుకున్నారు. చివరికి డబ్బులన్నీ పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. రామలింగేశ్వరనగర్ శివశంకర్ రోడ్డులో చీటీలు నిర్వహించి కొద్దిరోజుల క్రితం జెండా ఎత్తేసిన కోటేశ్వరమ్మ కేసులో మహిళల బాధలివి. కోటేశ్వరమ్మ రూ.5 కోట్ల వరకు చీటీల సొమ్ముతో విజయవాడ నుంచి పారిపోయిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులను కలిసినపుడు కొత్తకోణం బయటపడింది. రామలింగేశ్వరనగర్‌లో ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు ఎక్కువ. ఆ తర్వాత వ్యాపారులు మూడోస్థానంలో ఉంటారు. గాయత్రీ రోడ్డులో సొంతిల్లు ఉన్నప్పటికీ రామలింగేశ్వరనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న కోటేశ్వరమ్మ పదిహేనేళ్లుగా చీటీలు నిర్వహిస్తోంది. ఒకరి ద్వారా మరొకరు.. ఇలా చాలామంది ఆమె వద్ద చీటీలు వేశారు. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ చీటీలు వేసినట్టు బాధితులు చెబుతున్నారు. తాజాగా భర్తతో కలిసి పరారైన కోటేశ్వరమ్మ ఆచూకీ కోసం పటమట పోలీసులు గాలిస్తున్నారు. బకాయిలు ఇవ్వడానికి రేపుమాపు అంటూ వాయిదా వేసిన ఆమె ఒక్కసారిగా ఇంటికి తాళం వేసి షాక్ ఇచ్చింది. కోటేశ్వరమ్మ భర్త ఆర్టీసీ గవర్నరుపేట డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నినెలలుగా ఆయన సిక్‌లీవ్‌లో ఉన్నాడు. కోటేశ్వరమ్మ చేసిన ఘనకార్యంతో పోలీసులు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. కోటేశ్వరమ్మ భర్త విధుల్లో చేరిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సొమ్మంతా ఆమె వద్దే..

మహిళలు చీటీల్లో పాడుకున్న సొమ్మును కోటేశ్వరమ్మ నుంచి తీసుకోలేదు. ఆ సొమ్మును తిరిగి కోటేశ్వరమ్మకే రూ.5కు వడ్డీకి ఇచ్చారు. ఆమె చెల్లించే వడ్డీని చీటీకి జమ చేసేవారు. లక్షలాది రూపాయలను కోటేశ్వరమ్మ చేతుల్లో పెట్టారు. రూపాయిని రెట్టింపు చేసి భర్తల చేతుల్లో పెట్టడానికి తాము ఇలా చేశామని బాధితులు చెబుతున్నారు. ఇంటి నుంచి పారిపోవడానికి ముందురోజు వరకు కోటేశ్వరమ్మ హామీలిస్తూనే ఉంది. కోటేశ్వరమ్మ కొట్టేసిన మొత్తం రూ.5 కోట్ల వరకూ ఉంటుందని ప్రాథమికంగా చెబుతున్నారు. బాధితులు మొత్తం బయటకు వస్తే అంతకు మించే ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్

» రూ.40వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం



సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఆర్డీవో సీసీగా పనిచేస్తున్న బీరం త్రినాథ్ రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ బీవీ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంకు చెందిన కొల్లిపర వెంకట లక్ష్మీనారాయణ అరిసేపల్లిలో తనకు ఉన్న భూమిలో కొంతభాగాన్ని ఇద్దరు కుమార్తెలకు ఇచ్చాడు. ఈ భూమిని ఇతరత్రా అవసరాల కోసం వాడుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫీజు చెల్లించాడు. ఫైలుపై సంతకం చేయించేందుకు ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్ రూ.42వేలు డిమాండ్ చేయడంతో లక్ష్మీనారాయణ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలో లక్ష్మీనారాయణ సీనియర్ అసిస్టెంట్‌కు నగదు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

లంచం కేసులో వీఆర్వోకు రెండేళ్ల జైలు

విజయవాడ లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ కేసులో వత్సవాయి మండలం మక్కపేట గ్రామ వీఆర్వో వడ్లమూడి వెంకట నరసింహా వైకుంఠరావుపై నేరం రుజువుకావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. వత్సవాయి మండలం, గోపినేని పాలెం గ్రామానికి చెందిన కొల్లా వీరయ్య అదే మండలం మక్కపేట గ్రామంలో తన పూర్వీకుల ద్వారా వచ్చిన 9.12 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం, యాజమాన్య హక్కు పత్రం (టైటిల్ డీడ్)లను ఇవ్వాల్సిందిగా వత్సవాయి మండల తహసిల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మక్కపేట వీఆర్వో వడ్లమూడి వెంకట నరసింహ వైకుంఠరావు దరఖాస్తును పై అధికారులకు పంపడానికి గాను బాధితుడి నుంచి రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు విజయవాడ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. బాధితుడి నుంచి లంచం తీసుకొంటుండగా పట్టుకొని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

సీఎస్‌ను కలిసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

వన్‌టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5న రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో 23 మంది కార్యవర్గం సభ్యులు విజయానంద్‌ను సాదరపూర్వకంగా సత్కరించారు. ఇదే సమయంలో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. సాంకేతిక విద్యాశాఖలో పాలటెక్నిక్‌లో పనిచేసే టీచింగ్, అకడమిక్ స్టాఫ్‌కు వేతన బకాయిలు రూ.191.13కోట్లు విడుదల చేయాలని కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద వైద్యం చేయించటం కోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడాలని కోరారు. రాష్ట్రంలో గుర్తింపు సంఘాల వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. 2 లేదా 3 సంవత్సరాలకు ఒకసారి ప్రధాన గుర్తింపు సంఘాన్ని నేరుగా ఉద్యోగులు ఎన్నుకునేలా ఒక విధానాన్ని రూపొందించాలని, దీనికోసం సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యులైన ప్రభుత్వ ప్రతినిధులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులతో ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని కోరారు. సీఎస్ ఆధ్వర్యంలో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు జరగటం లేదని, వీలైనంత త్వరగా ఈ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పక్షాన మొత్తం 27 అంశాలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ జాబితాను ప్రధాన కార్యదర్శికి అందజేశారు. దీనిపై సీఎస్ స్పందిస్తూ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించేందుకు కసరత్తు జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో తీసుకున్న చర్యలపై సమీక్షిస్తున్నామని, త్వరలోనే అన్ని శాఖల కార్యదర్శుల సమావేశం జరుగుతుందని, ఆ తరువాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కె.ఆర్.సూర్యనారాయణతో పాటు ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, సహా అధ్యక్షురాలు బి.సుగుణ, ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

» ఉపాధ్యాయ సంఘాలు

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకుండా జాప్యం చేస్తే ఉద్యమం చేపడతామని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఒక లేఖ ద్వారా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు అల్టిమేటం జారీ చేశారు. ఉపాధ్యాయుల సర్వీసుపరమైన సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు ప్రశాంతంగా పాఠాలు బోధించే పరిస్థితులు కల్పించాని కోరారు.

రైల్వే హైటెన్షన్ విద్యుత్ లైన్‌పై వాలి నెమలి మృతి

» షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల పరిధిలోని సత్యసాయి ప్రశాంతి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ నెమలి హైటెన్షన్ విద్యుత్ లైన్‌పై వాలి ప్రాణాలు కోల్పోయింది. ఆ సమయంలో రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ లైన్‌లోకి వస్తుండడంతో రైలు ఇంజన్ పైనున్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు నెమలి తగిలి మంటలు చెలరేగాయి. దీంతో లోకో పైలెట్ వెంటనే రైలును నిలిపేసి, అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం, రైల్వే సిబ్బంది, పోలీసులు మృతిచెందిన నెమలిని తొలగించారు. ఈ ఘటనతో రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా బయలుదేరిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో వెళ్లాల్సిన వందే భారత్ రైలును పెనుకొండ స్టేషన్‌లో అరగంటపాటు నిలిపేశామన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి బెంగుళూరు, హిందూపురం, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మీదుగా గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు ఈ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తోంది. కానీ, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి రైల్వేలైన్ మరమతుల కారణంగా రైళ్లను అధికారులు సత్యసాయి ప్రశాంతి రైల్వే స్టేషన్ మీదుగా మళ్లించారు. ఈ క్రమంలో రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ ప్రశాంతి రైల్వే స్టేషన్‌కు వస్తుండగా, సమీపంలోని చెట్ల నుంచి నెమలి ఎగురుకుంటూ వచ్చి విద్యుత్ లైన్‌పై వాలే ప్రయత్నం చేసి మృతి చెందింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ పోలీస్‌కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్ర బాబు తెలిపారు. సత్యనారాయణ నగర్, పోలీస్ కాలనీ, హెడ్ పోస్ట్ ఆఫీసు, ఎస్‌బీఐ బాలజీ నగర్, ఉదగిరి గంగయ్య వీధి, కోర వారి వీధి, కొత్త ఆంజనేయ స్వామి గుడి, జీఎల్ రావు ప్లాట్స్, మహితా పబ్లిక్ స్కూల్ బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సాయిప్రసాద్ తదితరులు

సుపరిపాలనలో తొలి అడుగు

లబ్బీపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి టీడీపీ అండగా ఉంటుందని 19వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు భాగం సాయికుమార్ అన్నారు. డివిజన్‌లోని 124వ బూత్ పరిధిలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. డివిజన్ ఉపాధ్యక్షులు కలాం, పాన నాని, కంచర్ల శ్రీను పాల్గొన్నారు.



ఎయిర్ టెక్ మెషిన్‌తో క్లియర్ చేసిన తర్వాత

యూజీడీ సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగల్రాజపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడో డివిజన్ బందిల దొడ్డి సెంటర్‌లో పొంగుతున్న యూజీడీ సమస్య పరిష్కారం అయింది. ఈ నెల 23న పొంగుతున్న యూజీడీ- శాశ్వత పరిష్కారమేది కథనం ప్రచురితం అయింది. దీంతో వీఎంసీ ఈఈ సామ్రాజ్యం స్పందించారు. బ్లాక్ అయిన యూజీడీని ఎయిర్ టెక్ మెషిన్ రప్పించి క్లియర్ చేశారు. ప్రస్తుతానికి సమస్య పరిష్కారం అయింది.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ప్రవాహానికి అడ్డంకులు.. పారుదల లేక రోడ్డుపై నిలిచిన నీరు
- వేధిస్తున్న యూజీడీ లీకుల సమస్య
- మురుగుతో 9వ డివిజన్ వాసుల అవస్థలు

బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్ సర్కిల్ కృష్ణవేణి రోడ్డు మొదలుకొని చేపల మార్కెట్ మీదుగా పకీర్‌గూడెం వరకు విస్తరించి ఉన్న 9వ డివిజన్‌లో అంతర్గతంగా ఉండే రహదారుల వెంబడి సైడ్ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సైడ్ డ్రెయినేజీలో మట్టి దిబ్బలు ఏర్పడి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో వర్షపునీరు పారే అవకాశం లేక రహదారిపైనే నిలుస్తున్నాయి. సైడ్ డ్రెయినేజీ వ్యవస్థ ప్రధాన కాలువకు అనుసంధానంగా లేకపోవడంతో డివిజన్ మునిగిపోతుందని చెబుతున్నారు. అండర్ డ్రెయినేజీ లీకుల సమస్య వేధిస్తుందని ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల రహదారిపైకి మురుగు నీరు చేరి దుర్గంధం వెద జల్లుతోందని చెబుతున్నారు. చెట్లు కొట్టేసిన కొమ్మలు, ఇతర వ్యర్థాలు సైడ్ డ్రెయినేజీలో వేసి నెలలు తరబడి ఉంచుతున్నారు. వీటి వల్ల పాములు చేరుతున్నాయి. గ్రంథాలయం సమీపంలోని సైడ్ డ్రెయినేజీలో నీరు నిలబడి దుర్గంధం వెదజల్లుతోంది. బెంజసర్కిల్ సర్వీసు వెంబడి ఉండే కాల్వలో ఏడాదిపాటు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై కార్పొరేషన్ దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



పకీర్‌గూడెంలో నిలిచిన వర్షపు నీరు, యూనియన్ బ్యాంక్ సమీపంలో నిలిచిన మురుగునీరు

అభివృద్ధికి ఆమడదూరంలో..

9వ డివిజన్ అభివృద్ధి ఒక వైపే రెండో వైపు అంతా దుర్గంధం, రహదారులపై నిర్లక్ష్యం, పారిశుధ్యంలో నిర్లక్ష్యం, అక్కడ నివసించే ప్రజలు వర్షకాలం వచ్చిందంటే ముక్కుమూసుకోని బతకాల్సి వస్తుంది. అదే చేపల మార్కెట్ వైపు రహదారిపై వెళ్లాలంటే జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే.. పారిశుధ్య నిర్వహణలోనూ అంతంత మాత్రంగానే ఉంటున్నాయని చెబుతున్నారు. స్క్యూ బ్రిడ్జి కింద నుంచి పకీర్‌గూడెం వెళ్లే రహదారి అంతా గుంతలమయమైంది. బురదతో నిండిపోయింది. ఎక్కడ చూసిన నీరు నిలిచి చెరువులు తలపిస్తున్నాయి. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు.

వర్షానికి రోడ్లు జలమయం

భారతీనగర్: గత నాలుగు రోజుల నుంచి నగరంలో కురుస్తున్న వర్షానికి 3, 4, 10 డివిజన్లలోని పలు ప్రధాన రహదారుల అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి.

విజయనగర్ కాలనీ సమీపంలోని హైటెన్షన్ రోడ్డు, సుబ్బారావు కాలనీ అంతర్గత రోడ్డు, ఆయుష్ ఆసుపత్రి సమీపంలో బాయన బాబూజీ రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ సమీపంలోని గమేశా బజార్ రోడ్డు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, భారతీనగర్ మెయిన్‌రోడ్డు, పలు కాలనీ అంతర్గత రోడ్లు వర్షపు నీటికి జలమయమయ్యాయి.

దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విజయనగర్ కాలనీ సమీపంలోని హైటెన్షన్ రోడ్లో, ఆయుష్ ఆసుపత్రి సమీపంలో బాయన బాబూజీ రోడ్లో నిలిచిన వాన నీరు

ఆటోనగర్‌లో అడుగుకో గొయ్యి

- చిత్తడిగా రహదారులు
- గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని ఐలా అధికారులు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని రోడ్లు నిలువెత్తు గోతులతో దర్శనమిస్తోన్నాయి. ఒక పక్క గోతులు, మరో పక్కడ చిత్తడి చిత్తడి రహదారులతో ఆటోనగర్ ప్రజలు నరకం చూస్తున్నారు. ఆటోనగర్- సనత్‌నగర్‌ను కలిపే ప్రధాన రహదారి బళ్లెంవారి వీధి అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈరోడ్డు అభివృద్ధిని ఇటు ఐలా గాని లేదా అటు తాడిగడప మున్సిపల్ అధికారులు గాని పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈరోడ్డు నుంచే వేల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. ఈరోడ్డులోనే పెద్ద డంపింగ్ యార్డు కూడా ఉంది. దీనిలో వీఎంసీతోపాటు తాడిగడప మున్సిపాలిటీ కూడా చెత్తను డంప్ చేస్తున్నాయి. అయినా ఈరోడ్డు అభివృద్ధి బాధ్యతను ఎవరూ పట్టించుకోవడంలేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు ఆటోనగర్‌లోని అంతర్గత రహదారులు సైతం గతుకుల మయంగా మారాయి. ఈరోడ్లపై వాహనాలు నడపాలంటేనే ప్రాణసంకటంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు రోడ్లపై ఉన్న గోతుల్లోకి నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఐలా, వీఎంసీ, తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించి గోతులతో ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలనిఆటోనగర్ వాసులు కోరుతున్నారు.



గోతులతో ఉన్న ఆటోనగర్‌లోని బళ్లెంవారి వీధి



దాసరి లింగయ్య చౌదరి వీధిలో చెత్తకుప్పలు

పేరుకున్న చెత్తకుప్పలు- దుర్వాసనతో పాట్లు

దోమలతో దాసరి లింగయ్య చౌదరి వీధి వాసులు సతమతం

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: స్థానిక ఏడో డివిజన్‌లో దాసరి లింగయ్య చౌదరి వీధి చెత్తకుప్పలకు ఆలవాలంగా మారింది. మధు గార్డెన్ సెంటర్ నుంచి రావిచెట్టు సెంట ర్‌కు వెళ్లే ఈ రోడ్డు పొడుగునా అపార్టుమెంట్‌లు ఉంటాయి. జనసంచారం కూడా ఎక్కువగా ఉంటుంది.ఇటీవల పారిశుధ్య సిబ్బంది సమ్మెతో ఎక్కడ చెత్తకుప్పలు అక్కడే ఉండిపోయాయి సమ్మె ముగిసినా చెత్త తొలగించలేదు. ఓ పక్క వర్షం మరో పక్క చెత్త కుప్పల వద్ద వీధికుక్కల హంగామా. దుర్వాసన, దోమలతో స్థానికులు సతమతం అవుతున్నారు. శానిటరీ అధికారి స్పందించి చెత్తకుప్పలను తొలగించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పగుళ్లిచ్చిన పేవర్ బ్రిక్స్



పటమట, ఆంధ్రజ్యోతి: నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫుట్‌పాత్‌లపై దుమ్ము ధూళి లేకుండా పేవర్ బ్రిక్స్ నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణంలో నాసిరకం సిమెంట్, నాణ్యత లేని పేవర్ బ్రిక్స్ వాడటం వలన ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద నిర్మాణం అంతా దెబ్బతింది. ఈ ఫుట్‌పాత్‌పై రోజుల తరబడి కార్లు పార్కింగ్ చేయడం వల్ల బ్రిక్స్ దెబ్బతింటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణాలు పాడవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెషనల్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

గాంధీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ తదితర ప్రొఫెషన్ కోర్సులు చేసిన వారికి దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నేషనల్ ఫ్యాకల్టీ సభ్యుడు కౌశిక్ ముకేష్ తెలిపారు. 'ప్రొఫెషనల్ కోర్సులు– ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఏ కోర్సు పూర్తిచేసిన వారికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నామన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కోశాధికారి ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.



గీతికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ

యోగాలో గీతికకు బహుమతులు

విజయవాడ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని గీతిక యోగాలో అనేక బహుమతులు సాధించడం తమ కళాశాలకు గర్వంగా వుందని ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ అన్నారు. ఈనెల 20న విజయవాడలో జరిగిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా - 2025 నిర్వహించిన యోగాసనలో ట్రెడిషినల్ యోగాలో మొదటి బహుమతి, ఫార్వార్డ్ బెండింగ్ యోగాలో మొదటి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్ గెలుచుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు గీతకను అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్నాచౌక్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ నేతలు విమర్శించారు. కేజీ నుంచి పీజీ వరకు సమస్యలను పరిష్కరించాలని ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సంఘం జాతీయ కన్వీనర్ రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ఎండీ రఫీ, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రూ.6400 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పుస్తకాల పేరుతో లక్షల వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి తల్లికి వందనం అందని లబ్ధిదారులకు తక్షణమే నగదు జమ చేయాలన్నారు.

స్మార్ట్ మీటర్లతో పటమట వాసుల్లో ఆందోళన

పటమట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాడుకలో ఉన్న విద్యుత్ రీడింగ్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించడంతో స్థానిక పటమట ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సీపీఐ, సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్లను ఎట్టి పరిస్థితిలో అంగీకరించవద్దని బహిరంగంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తాయని భయపడుతున్నారు. అత్యధిక లోడు వాడే వాళ కెపాసిటర్లు బిగిస్తే వారికి కూడా సాధారణ రీడింగ్‌లే వస్తాయని విద్యుత్ అధికారులు చెబుతున్నప్పటికీ ప్రజల సందేహాలు నివృత్తి కావడం లేదు. సింగిల్ ఫేజ్‌కు రూ.8వేలు, త్రీఫేజ్‌కు రూ.18వేలు, మీటర్లు బిగించుకున్న తరువాత విద్యుత్ శాఖ అధికారులు ముక్కు పిండి వసూలు చేస్తారనే పుకార్లు షికారులు చేస్తున్నాయి. తక్షణం ప్రభుత్వ అధికారులు, విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఎక్కువ బిల్లు వస్తుందనేది అపోహ మాత్రమే, స్మార్ట్ మీటర్ పక్కనే పాత మీటరు బిగించి విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

- రాజశేఖర్, ఏఈ

లులుకు అప్పగించే ప్రయత్నం విరమించుకోవాలి

బస్టేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ గవర్నర్‌పేట1, 2 డిపోలకు చెందిన ఖరీదైన 3.70 ఎకరాలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థ లులుకు అప్పగించే ప్రయత్నం విరమించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు హెచ్చరించారు. విజయవాడ పాతబస్టాండ్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈయూ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీకి గొల్లపూడిలో ఇస్తామన్న స్థలాన్ని లులు మాల్‌కు ఇచ్చి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయించాలన్నారు.

త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ

ఆర్టీసీ ఆస్తులను కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలపై ఈ నెలాఖరులోగా ముఖ్యనాయకులతో చర్చించి కార్యాచరణను రూపిందిస్తామన్నారు. పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పలిశెట్టి దామో దరరావు, జి.వి.నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



విజయవాడ పాతబస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న ఈయూ నేతలు



నగరంలో శుక్రవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. బందరు రోడ్డులో, పంటకాల్వ రోడ్డులో వర్షానికి తడవకుండా ఇలా గొడుగులతో ...

నూతన పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో మానవహారం

ధర్నాచౌక్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నష్టం కలిగించేలా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లును, వాల్యూడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘాల సమాఖ్య ఇచ్చిన పిలుపులో భాగంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో పెన్షనర్లు మానవహారం నిర్వహించి శుక్రవారం నిరసన తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రామారావు మాట్లాడుతూ 1972 కేంద్ర ప్రభుత్వ పెన్షన్ చట్టంలో మార్పులు చేస్తూ తెచ్చిన నూతన పెన్షన్ బిల్లు పెన్షనర్ల మెడపైన వేలాడే కత్తిలాంటిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్‌లో దీనిని అమలు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఫోరం కో-కన్వీనర్లు ఎ.చంద్రశేఖర్, ఎ.కోటేశ్వరరావు, సంఘాల ప్రతినిధులు నిమ్మగడ్డ నాగేశ్వరరావు, ఎల్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్య పరిష్కారం కోరుతూ సిటీ సివిల్ కోర్టుల వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలి

● ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

విజయవాడ లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, ఖాళీగా వున్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో శుక్రవారం సిటీ సివిల్ కోర్టుల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన భవనాలు నిర్మించాలని, న్యాయమూర్తుల సంక్షేమ నిధి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పేద న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఎ.కె. బాషా మాట్లాడుతూ న్యాయవాదులు చేపట్టిన కార్యక్రమాలకు వెన్నంటి వుంటామన్నారు. ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.షరీఫ్, ఉపాధ్యక్షుడు కె.వి.వి. పరమేశ్వరరావు, కె.సుధాకరరాజు, బోను జయమ్మ, ఈఎస్ ప్రసాద్, జీవీ రాజు, నవనీతం సురేష్, జె.వి.రావు, ఎఎస్ఎస్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డే ప్రతిష్ఠాత్మకంగా జరుపుతాం

విజయవాడ (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 29న స్పోర్ట్స్ డే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శుక్రవారం స్పోర్ట్స్ డే నిర్వహణపై శాప్ ఎండీ అజయ్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పోర్ట్స్ డే రోజున క్రీడా విజయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సన్మానిస్తామన్నారు. జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామన్నారు. శాప్ ఎండీ అజయ్ జైన్ మాట్లాడుతూ స్పోర్ట్స్ డే విజయవంతం చేయడానికి క్రీడా సదుపాయల కల్పన, ఏర్పాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు.

ఫిడే ఫైనల్‌లో హంపి విజయం సాధించాలి

జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో భారత మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫైనల్‌కు చేరుకోవడం హర్షణీయమని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో చైనాపై విజయం సాధించి వరల్డ్ కప్ ఫైనల్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్‌గా హంపి ఘనత సాధించిందన్నారు. ఈ సందర్భంగా హంపికి అభినందనలు తెలిపారు. వరల్డ్ కప్ ఫైనల్‌లో హంపి విజయం సాధించి చరిత్ర సృష్టించాలని అకాంక్షించారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

10వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలు ప్రారంభం

విజయవాడ (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి పుట్టిన ఊరుకి, జిల్లాకి, రాష్ట్రానికి, దేశానికి పేరు తెవాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుంటూ కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలన్నారు.

యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్ జట్ల ఎంపికకు మంచి స్పందన

లబ్బీపేట (స్పోర్ట్స్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌షిప్ జట్ల ఎంపికకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. గుంటుపల్లి సీఏ కన్వెన్షన్‌లో జరిగిన పోటీల్లో 500 మందికి పైగా ఔత్సాహిక కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. చెన్నైకి చెందిన ఇఎల్ఇవి-8 ఇండియా స్పోర్ట్స్‌తో కలిసి ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ అధ్వర్యంలో పురుషుల యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్ అగస్టు 15 నుంచి 25 వరకు జరగనుంది. టోర్నమెంట్ వేదిక త్వరలో ఖరారు కానుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జున్ రావు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ పర్యవేక్షించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక్కొక్క జట్టుకు 17 మంది ఆటగాళ్లతో పాటు ఐదు మంది స్టాండ్‌బైగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. ఇఎల్ఇవి-8 ఇండియా స్పోర్ట్స్ ప్రతి మ్యాచ్‌కు రూ.14వేలు, గెలిచిన జట్టు, ఓడిన జట్టుకు వ్యక్తిగత అవార్డులు ఇస్తామన్నారు. అసోసియేషన్ కోశాధికారి ఎం.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో వైసీపీ నేతల రుబాబు!

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులపై వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు రుబాబు చేశారు. మందీ, మార్బలంతో వీసీ కార్యాలయానికి చేరుకుని రచ్చ చేశారు. సుమారు పదికిపైగా కార్లలో కార్పొరేటర్లు, నాయకులతో కలిసి శుక్రవారం 12.30 గంటల సమయంలో వీసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అందరూ ఒకేసారి చాంబర్‌లోకి వెళ్లబోగా, భద్రతా సిబ్బంది నిలువరించే ప్రయత్నం చేశారు. వారిని తోసుకుంటూ లోపలకు వెళ్లే ప్రయత్నం చేయడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. సెక్యూరిటీ సిబ్బందిపై కేకే రాజు వెంట వచ్చినవారు కేకలు వేశారు. ఈ విషయం వీసీ, రిజిస్ట్రార్ దృష్టికి వెళ్లడంతో వా రిని లోపలకు పంపించాలని సిబ్బందికి సూచించారు. కేకే రాజుతో పాటు మరో ఐదుగురిని వీసీ చాంబర్ లోపలకు అనుమతించారు. వర్సిటీలో సమస్యలు, ఇతర అంశాలను వీసీ వద్ద కేకే రాజు ప్రస్తావించారు. వారు అందించిన వినతిపత్రాన్ని తీసుకున్నారు. అప్పటివరకూ వీసీ ముందు కూర్చుని సమస్యలను తెలియజేసిన కేకే రాజు, ఆ తరువాత ఒక్కసారిగా కుర్చీలో నుంచి లేచి తమ వాళ్లందరినీ లోపలకు అనుమతించడం లేదం టూ ఊగిపోయారు. కార్పొరేటర్లు బయట ఉండిపోయారని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కేకలు వేశారు. ఇచ్చిన వినతి పత్రాన్ని కూడా వెనక్కి తీసుకున్నారు. బయట ఉన్న కార్పొరేటర్లు, ఇతర నాయకులను లోపలకు రానివ్వాలని డిమాండ్ చేయడంతో వీసీ వారిని కూడా అనుమతించారు. వారు చెప్పిన అంశాలను విని, ఇప్పటికే ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన చర్యల గురించి వివరించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చే పద్ధతి ఇది కాదని, ముందుగా సమాచారం ఇవ్వకుండా రావడం మంచి పద్ధతి కాదన్నారు.

అమరావతిలో భూమి కేటాయించండి

● మంత్రి నారాయణకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల వినతి

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో ప్రెస్‌క్లబ్ కోసం భూకేటాయింపులు చేయాలని ప్రెస్‌క్లబ్ అమరావతి ప్రతినిధులు మంత్రి నారాయణను కోరారు. సచివాలయంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను శుక్రవారం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దేశంలోనే అత్యున్నత స్థాయిలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సహకరించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

కష్టాల్లో నర్సింగ్ కళాశాల

● సొంత స్థలం లేదు..భవనాలు లేవు ● చాలీచాలని గదుల్లో విద్యార్థినుల ఇబ్బందులు ● లాకర్లు లేవు ● మరుగుదొడ్లకూ అసౌకర్యమే

వైద్యరంగంలో స్థిరపడి సమాజానికి తమవంతు సేవ చేయాలనుకున్న వారికి ఆదిలోనే కష్టాలు ఎదురవుతున్నాయి. విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి అనుబంధంగా నిర్వహిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీకి అనుమతులు వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఇంత వరకు సొంత భవనాలు లేవు. డిప్లొమో నర్సింగ్ స్కూలుకు కేటాయించిన భవనంలోనే కళాశాల విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు చాలక, బాత్రూమ్‌లు సైతం తగినన్ని లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

నర్సింగ్ కళాశాల సిద్ధార్థ మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉన్నప్పటికీ పాలనా వ్యవహారాలన్నీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. వంద సీట్లతో ఐదు సంవ్సరాల కిందట నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాలకు భవనాలు లేకపోగా ఇప్పటి వరకు కనీసం స్థలాన్ని కేటాయించకపోవడం గమనార్హం. వైసీపీ హయాంలో కాలేజీని మంజూరు చేసినప్పటికీ తరువాత కాలంలో నాయకులు గాలికొదిలేశారు. సిబ్బందికంటూ ప్రత్యేక గది కూడా లేదు. కాలేజీకి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా నర్సింగ్ స్కూలు యాజమాన్యం ప్రిన్సిపాల్‌కు కేటాయించిన చిన్న గదిలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి. కళాశాల విద్యార్థినులకు స్కూలులోని కొన్ని గదులు కేటాయించినప్పటికీ, సరిపోకపోవడంతో స్కూల్లో ఉన్న రెండు హాళ్లలో సర్దుకుపోతున్నారు.

నేలపైనే బెడ్లు, తలదగ్గరే లగేజీ

డిప్లమో నర్సింగ్ స్కూలుకు విద్యా సంవత్సరానికి 30 సీట్లు మా త్రమే కేటాయించారు. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. స్కూలులో రెండు అంతస్తుల్లో 32 గదులు ఉన్నాయి. కాలేజీ రాకముందు వరకు వాటిని స్కూ లు విద్యార్థినులే ఉపయోగించుకోవడం వల్ల ఎలాంటి సమస్య లేకపోయింది.

నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నాలుగు సంవత్సరాల కోర్సులో ఏడాదికి వందసీట్లు కేటాయించడంతో ప్రస్తుతం 380 మంది ఉన్నారు. వీరిలో 56 మంది డే స్కాలర్‌లు ఉండగా, ప్రస్తుతం 320 మంది హాస్టల్‌లో ఉంటున్నారు. మొదటి అంతస్తులో ఉన్న 16 గదులను కాలేజీ విద్యార్థినులకు కేటాయిచారు. ఒక్కో గదికి ఆరు నుంచి ఎనిమిది మంది విద్యార్థులకు కేటాయించినప్పటికీ గదులు సరిపోకపోవడంతో అదే భవనంలో ఉన్న రెండు హాళ్లను ఉపయోగించుకుంటున్నారు. ఈ హాళ్లలో ఉంటున్న వారికి మంచాలు లేకపోవడంతో నేలపైనే పరుపులు వేసుకుని నిద్రపోతున్నారు. వస్తువులు దాచుకోడానికి కనీసం లాకర్లు కూడా లేవు. తలదగ్గరే లగేజీ పెట్టుకోవడంతో స్థలం చాకపోవడంతో పాటు విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోయింది.

నాలుగు చోట్ల తరగతులు

నాలుగు సంవత్సరాల విద్యార్థినులకు నాలుగు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నారు. జీజీహెచ్‌లోని పుష్కర్ హాల్‌లో మొదటి ఏడాది విద్యార్థులకు, హాస్టల్ వెనుకభాగంలో ఉన్న రేకులషెడ్డులో ద్వితీయ సంవత్సరం, ఫిజియో విభాగంలో మూడో ఏడాది, స్కూలు భవనంలో ఓ గదిలో నాలుగో ఏడాది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు భోజనం చేయాలంటే మాత్రం రెండో ఏడాది తరగతులు నిర్వహిస్తున్న చోటే బ్యాగులు పక్కన పెట్టి భోజనం తినాల్సిన దుస్థితి. సరైన వసతి, తరగతి గదులు, భోజనం, కనీస అవసరాలు ఇలా అన్ని విధాలా ఇబ్బందులు పడుతూ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని వీలైనంత తొందరగా సొంత భవనాలను సమకూర్చి తమ కష్టాలకు చెక్ పెట్టాలని నర్సింగ్ కళాశాల విద్యార్థినులు కోరుతున్నారు.

మరుగుదొడ్లకూ ఇబ్బందే

సూపరిండెంటెండ్ చొరవతో కాలేజీకి స్కూలు భవనంలో గదులు కేటాయించినప్పటికీ విద్యార్థినులకు సరిపడా బాత్రూంలు లేకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎంత తొందరగా మేల్కొన్నప్పటికీ ఎక్కువ మంది విద్యార్థినులు బాత్రూం సమస్య కారణంగా తరగతులకు సమయానికి చేరుకోలేకపోతున్నారు.

కేంద్రాన్ని ఒప్పించి నిధులు తేవాలి

● ఆర్టీసీ స్థలాన్ని లులు కంపెనీకి కట్టబెట్టడం సమంజసం కాదు
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు


ఎన్టీఆర్ జిల్లా సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు విమర్శించారు. బాలోత్సవభవన్‌లో శుక్రవారం జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్ట్) ఎన్టీఆర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సీపీఎం అగ్రనేత అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రాష్ట్రాన్ని, జిల్లా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్రాన్ని ఒప్పించి, ఒత్తిడి చేసి అమరావతి, రాష్ట్ర అభివృద్ధికి నిధులు తేవాలని డిమాండ్ చేశారు. విభజన చట్ట ప్రకారం అమరావతి నిర్మాణానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. సీఆర్డీఏ ప్రాంతపరిధిలో జరుగుతున్న హడావుడి అంతా బడా కంపెనీల అభివృద్ధి తప్ప, ఈ ప్రాంత ప్రజలను పూర్తిగా ప్రభుత్వం వదిలేసిందని బాబూరావు దుయ్యబట్టారు. మెట్రోప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్ల ఆహ్వానం ఏమో కానీ, గోతుల మయంగా ఉన్న రోడ్లను బాగుచేసే నాథుడు లేకుండా పోయారన్నారు. మెట్రో కోసం ప్రైవేటువ్యక్తుల దగ్గర భూములు తీసుకుంటూ, మరోవైపు ఆర్టీసీ పాత బస్టాండ్‌కు సంబంధించిన రూ.400 కోట్లు విలువ చేసే ఐదెకరాల స్థలాన్ని లులు కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని విమర్శించారు. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి వ్యాపారులను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. బుడమేరు ముంపు నివారణా చర్యలు ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. బడా కంపెనీలకు వేగంగా స్థలాలు కేటాయిస్తున్న ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఒక్క సెంటు కూడా సేకరించకపోవడం దారుణమన్నారు. ఎస్ఆర్ఆర్, శాతవాహన కాలేజీ భూములను కబ్జా చేస్తున్నా పాలకులు నోరు మెదపడం లేదన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు ఇసుక, గ్రావెల్, బూడిద, బెల్ట్‌షాపులు, కాంట్రాక్టులు ఇలా అన్నింటా అవినీతిలో వైసీపీతో పోటీపడుతున్నారని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు బలవంతంగా బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. సీపీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, డి.కాశీనాథ్, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాజధాని ప్రాంత రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

వార్షిక కౌలు సమస్య పరిష్కారానికి కృషి

కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వార్షిక కౌలు జమకాని రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గ్రీవెన్స్ రిడ్రసల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీ తెలిపారు. ఆధార్ బేస్డ్ క్రెడిట్ విధానంలో వార్షిక కౌలు నగదు సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కౌలు నగదు జమ కానట్లయితే రానున్న 15 రోజుల్లో జమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యలపై రాజధాని ప్రాంతవాసులు అర్జీలను అందజేశారు. పలు ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని, అలసత్వం వద్దని నోడల్ అధికారి జయశ్రీ సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 54 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరక్టర్ జి.పాండురంగారావు, రామకృష్ణన్, సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బి.శ్రీనివాసరావు, జాయింట్ డైరక్టర్ సిహెచ్.మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు కురిసే అవకాశం

అధికారులు అందుబాటులో ఉండాలి : కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వచ్చే మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ఇళ్లలోకి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. అవసరం మేరకు తక్షణం స్పందించేందుకు వీలుగా ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందం నగరంలో అందుబాటులో వున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే 91549 70454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ స్థాయిలోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి నిరంతరం పరిస్థితిని సమీక్షించాలన్నారు. ఎక్కడైనా చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, నిత్యావసర సరుకులు పంపిణీపై ప్రధానంగా దృష్టి సారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0866-2574454 నెంబరుతో 24 గంటలూ పనిచేసేలా విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డివిజన్‌లో వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఈ ఫోన్ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆర్డీఓ చైతన్య కోరారు.

అశోక్ లేల్యాండ్ 100 బస్సులు పూర్తి

● జంక్షన్ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి ఏపీఐఐసీ అశోక్ లేల్యాండ్ బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ సిబ్బంది శుక్రవారం స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీలో వంద బస్సులు నిర్మాణం పూర్తయిన సందర్భంగా యూనిట్ సిబ్బంది, కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. అశోక్ లేల్యాండ్ ఏపీ యూనిట్ ఇన్‌చార్జి శ్రీధరన్ ఆధ్వర్యంలో సిబ్బంది అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు జరిపి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు మినీ బస్సుకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అశో క్ లేల్యాండ్ బస్సు బాడీ యూనిట్‌కు 2017లో రాష్ట్ర ప్రభుత్వం 75 ఎకరాలు కేటాయించింది. 2018 మార్చి 31న అప్పటి నారా చంద్రబాబునాయుడు ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. 2018లోనే ఆరు నెలల్లో బస్సు నిర్మించి ఇస్తామని అశోక్ లేల్యాండ్ హామీ ఇచ్చింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో యూనిట్ మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఈ ఏడాది మార్చి 19న మంత్రి నారా లోకేశ్ తిరిగి యూనిట్‌ను ప్రారంభించారు. నాలుగు నెలల్లో 101 బస్సులు నిర్మాణం పూర్తి చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ ఇండెంట్ ప్రకారం ఫ్యాక్టరీలో బస్సులు తయారు చేస్తున్నారు. ఫ్యాక్టరీ పునః ప్రారంభం కావడంతో దాదాపు 800 మంది

ఇగ్నో వైస్ చాన్స్‌లర్‌గా ఉమా కాంజిలాల్

వన్‌టౌన్ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ ఉమా కాంజిలాల్‌ను నియమిస్తూ కేంద్ర విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందని విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఇగ్నో నడుస్తుందని, కాంజిలాల్ ఐదు సంవత్సరాలు పనిచేయనున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. గత సంవత్సరకాలంగా ఇగ్నోకు కాంజిలాల్ తాత్కాలిక వైస్ చాన్సలర్‌గా పనిచేస్తున్నారన్నారు. ఇగ్నోను ప్రగతిపథంలో నడిపించేందుకు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించేందుకు ఆమె కృషి చేయనున్నట్టు తెలిపారు.

ఏపీలో 11,862 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు

వన్‌టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు దేశ వ్యాప్తంగా 1,78,154 పనిచేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జా దవ్ లిఖితపూర్వకంగా వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు అయన స్పందిస్తూ అంధ్రప్రదేశ్‌లో 11,862 ఆయుష్మాన్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వాటి నిర్వహణకు మూడు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.157కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో మెరుగైన ఆరోగ్య సదుపాయాలను కల్పించాలన్న లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించామని, సామాన్యులకు ప్రాథమిక వైద్యశాలలు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు.

ప్రేక్షకుల మదిలో కోటకు సుస్థిర స్థానం

● సంతాప సభలో వక్తల నివాళి



సంతాప సభలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు

గాంధీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కోట శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకు తీరనిలోటని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే పద్మశ్రీ కోటా శ్రీనివాసరావు సంతాప సభ గాంధీనగర్‌లోని ప్రముఖ హోటల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. పలువురు ప్రముఖులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ శ్రీనివాసరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నాటక రంగం నుంచి సినీ రంగంలో ప్రవేశించి సుమా రు 750 సినీమాల్లో వైవిధ్యభరిత పాత్రలతో తెలుగు, తమిళం, కన్నడం తదితర భాషల్లో ప్రేక్షకులను అలరించారన్నారు. పట్టణ ప్రాంతా ల్లో ఇళ్లు లేని నిరుపేదలకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకానికి కోటా శ్రీనివాసరావు అద్యుడన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా విజయవాడ నగరాభివృద్ధికి కోటా శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరా మ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మాజీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, దారా సాం బయ్య, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

బాబూమోహన్ కన్నీటి పర్యంతం

ప్రముఖహాస్య నటుడు బాబూమోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంతాపసభలో పాల్గొని కోటాతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తామిద్దరం సొంత అన్నదమ్ములుగా మెలిగామన్నారు. ఒకేరోజు ఆరు సినిమాల షూటింగ్‌లలో పాల్గొనేవాళ్లమని చెప్పా రు. అర్థం చేసుకునే వాళ్లకు ఆయన చాలా మంచి వాడని, నిర్మొహమాటంగా మాట్లాడం అయన నైజమన్నారు. ఆయన మరణం తీవ్ర బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం 26 జూలై 2025

మనం నానబెట్టిన పెసలతో గారెలు, దోశలు, గుగ్గిళ్లు చేసుకుంటూ ఉంటాం. పెసలను మొలకెత్తించి ఇష్టంగా తింటూ ఉంటాం. ఇవి కాక పెసలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునే వారి కోసం ఈ రుచులు...

పెసలతో పసందుగా...

వంటిల్లు



పెసర లడ్డూ

కావాల్సిన పదార్థాలు

- పెసలు- ఒక కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, జీడి పప్పులు- ఆరు, బాదం పప్పులు- ఆరు, యాలకులు- రెండు, బెల్లం ముక్కలు- ఒక కప్పు, నీళ్లు- తగినన్ని

పెసలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, ఫోలేట్, బీ-కాంప్లెక్ విటమిన్లు లభిస్తాయి. ఇవి రక్తపోటును నియంత్రిస్తాయి. పెసలలోని యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు, అమైనో ఆమ్లాలు... గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా అదుపులో ఉంచుతాయి. జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. స్థూలకాయాన్ని నివారిస్తాయి.

తయారీ విధానం

- జీడి పప్పు, బాదం పప్పులను చిన్న పలుకుల్లా కోసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టాలి. అందులో పెసలు వేసి చిన్న మంట మీద పది నిమిషాలపాటు దోరగా వేపాలి. పెసలు, కొద్దిగా రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. తరవాత మిక్సీలో వేసి మరీ మెత్తగా కాకుండా కాస్త బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ పొడిని ఒక పళ్లెంలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద గిన్నెపెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పప్పు పలుకులు వేసి దోరగా వేపాలి. తరవాత పెసర పొడి వేసి కలపాలి. చిన్న మంట మీద రెండు నిమిషాలు వేపాలి. తరవాత యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పెసర పొడిని ఒక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి.
- స్టవ్ మీద మరో గిన్నె పెట్టి, బెల్లం ముక్కలు వేసి రెండు చెంచాల నీళ్లు చిలకరించాలి. బెల్లం మొత్తం నీళ్లలో కరిగాక పెసర పొడి ఉన్న గిన్నెలోకి వడబోయాలి. పెసర పొడికి బెల్లం పూర్తిగా పట్టేలా కలపాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే ఒక చెంచా నెయ్యి వేసి బాగా కలపాలి. దీన్ని కొద్ది కొద్దిగా చేత్తో తీసుకుంటూ లడ్డూలు చుట్టాలి. ఈ పెసర లడ్డూలను పిల్లలు ఇష్టంగా తింటారు.

చిట్కాలు

- పెసలను సన్నని సెగమీద నెమ్మదిగా వేయిస్తే లడ్డూలకు కమ్మని రుచి వస్తుంది. పెసలు సరిగా వేగకపోతే లడ్డూలు చేదుగా అనిపిస్తాయి.
- లడ్డూలు చుట్టేముందు కావాలనుకుంటే ఖర్జూరం ముక్కలు, కిస్‌మిస్‌లు, గుమ్మడి గింజలు వేసుకోవచ్చు.
- ఈ లడ్డూలను గాలి చొరబడని డబ్బాలో భద్రపరిస్తే రెండు వారాల పాటు నిల్వ ఉంటాయి.

పెసలలో ఎక్కువగా ప్రొటీన్లు ఉంటాయి. ఇవి కండరాలు, మృదులాస్థి పెరుగుదలకు తోడ్పడతాయి. ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మొలకెత్తిన పెసలు తినడం వల్ల రక్తహీనత, మలబద్ధకం, చర్మ వ్యాధులు, కంటిచూపు సమస్యలు తగ్గుతాయి. అకాల వార్ధక్యం దరి చేరదు. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



పెసల మఖనీ

కావాల్సిన పదార్థాలు


- నానబెట్టిన పెసలు- ఒక కప్పు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- రెండు, యాలకులు- రెండు, పసుపు- అర చెంచా, ఉప్పు- తగినంత, నెయ్యి- ఆరు చెంచాలు, జీలకర్ర- అర చెంచా, ఇంగువ- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, ఉల్లిపాయలు- రెండు, టమాటాలు- రెండు, పచ్చిమిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, మిరియాల పొడి- అర చెంచా, కసూరి మేతి- అర చెంచా, కారం- ఒకటిన్నర చెంచాలు, వేడినీళ్లు- ఆరు కప్పులు, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

- పచ్చి మిర్చి, ఉల్లిపాయలు, టమాటాలు, వెల్లుల్లి రెబ్బలు, కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన పెసలు, అర చెంచా ఉప్పు, పావు చెంచా పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు వేసి నాలుగు కప్పుల వేడి నీళ్లు పోయాలి. కుక్కర్‌కు మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చే దాకా ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నాలుగు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. ఇందులో జీలకర్ర, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, వెల్లుల్లి తరుగు వేసి దోరగా వేపాలి. తరవాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. వీటిని అయిదు నిమిషాలపాటు వేగనివ్వాలి. తరవాత గరం మసాలా పొడి, మిరియాల పొడి, పావు చెంచా పసుపు, కారం, తగినంత ఉప్పు, టమాటా ముక్కలు వేసి కలపాలి. గిన్నె మీద మూతపెట్టి రెండు నిమిషాలు మగ్గించాలి. నెయ్యి పైకి తేలే వరకు వేగనివ్వాలి. తరవాత ముందుగా ఉడికించి పెట్టుకున్న పెసల మిశ్రమం వేసి రెండు కప్పుల వేడి నీళ్లు పోసి కలపాలి. గిన్నె మీద మూతపెట్టి చిన్న మంట మీద పావుగంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో గరిటెతో కలుపుతూ ఉండాలి. అవసరమైతే మరో అరకప్పు వేడినీళ్లు కలపవచ్చు. ఈ పప్పు మిశ్రమం మెత్తగా ఉడికిన తరవాత కసూరి మేతిని వేసి బాగా కలపాలి. తరవాత కొత్తిమీర తరుగు వేసి రెండు చెంచాల నెయ్యిని చిలకరించి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న పెసల మఖనీని వేడి అన్నంలో కలుపుకుని తినవచ్చు. పుల్కా, నాన్, చపాతీల్లోకి కూడా బాగుంటుంది.

చిట్కాలు

- నెయ్యికి బదులు నూనె వేసి చేసుకోవచ్చు.
- పెసలను మెత్తగా ఉడికించుకోవాలి. అప్పుడే ఈ వంటకం రుచిగా ఉంటుంది.
- పెసల మఖనీని గరిటె జారుగా ఉండేలా తయారు చేసుకోవాలి. అప్పుడే తినడానికి బాగుంటుంది. ఇది చల్లారేకొద్దీ గట్టిపడుతుంటుంది.



ఒక గిన్నెలో రెండు చెంచాల పెసర పిండి, ఒక చెంచా తేనె, ఒక చెంచా పాలు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.

భోజనకుతూహలం

'కరివేపాకే కదా' అని తీసి పారేయద్దు..!

చాలామంది భోజనం చేసే సమయంలో కరివేపాకును తీసి పక్కన పెట్టేస్తారు. దీనిని కేవలం సువాసన కోసం వాడతారనే భ్రమలో ఉంటారు. కానీ మన ప్రాచీన గ్రంథాలలో కరివేపాకును విశిష్టమైన ఔషధ గుణాలున్న మొక్కగా గుర్తించారు. దీనికి సంస్కృతంలో- 'సుగంధి కైడర్య పత్రం' అనే పేరు కూడా ఉంది. కరివేపాకులకు ఇటాలియన్, ఇండోనేషియన్, జర్మన్, ఫ్రెంచి పేర్లలో 'కరి' అనే పదం ఉంది. ఇంగ్లీషువారు వీటిని 'కర్రీలీవ్స్' (కూరాకులు) అని పిలిచేవారు. దాని నుంచే కరివేపాకు అనే పదం పుట్టింది. ఈ ఆకులకు ఉన్న ప్రత్యేక గుణాలను మన పురాతన గ్రంథాల్లో వివరించారు.

- ఈ ఆకులకు విషాన్ని హరించే శక్తి ఉంది. వీటిని పచ్చిగా కానీ, ఎండబెట్టి కానీ వాడవచ్చు.
- కరివేపాకులో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. విటమిన్ ఏ, కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు ఉన్నాయి. ఈ కోణం నుంచి చూస్తే- ఇది పోషకాల విషయంలో ఇతర ఆకుకూరలతో పోటీ పడి గెలుస్తుంది.
- క్రమం తప్పకుండా కరివేపాకును తింటే చర్మం నిగనిగలాడుతుంది.



- కంటి సమస్యలకు కరివేపాకు పరిష్కారంగా పనిచేస్తుంది.
- మన శరీరంలోని కఫ పైత్యాలను తగ్గిస్తుంది.
- కడుపులోని నులిపురుగులను కరివేపాకు చంపేస్తుంది.

ఎలా వాడాలి?

- కరివేపాకుల్ని కడిగి శుభ్రం చేయాలి. వీటిని మిక్సీలో వేసి రసం తీయాలి. ఈ రసంతో చారు కాచి తింటే నీళ్ల విరేచనాలు, రక్త విరేచనాలు వెంటనే తగ్గుతాయి.
- కరివేపాకు రసాన్ని ఒక పొంగు వచ్చేలా కాచి నిమ్మరసం కలుపుకొని తాగితే తల తిరుగుడు, పైత్యం, నోట్లో నీళ్ల ఊరటం, వికారం, త్రేన్పులు, గ్యాసు తగ్గుతాయి.
- ఒక గ్లాసు పెరుగులో మూడు గ్లాసుల నీళ్లను కలిపి ఒక రాత్రి బయట ఉంచాలి. ఉదయాన్నే అందులో రెండు చెంచాల కరివేపాకు ముద్దను, పావు చెంచా మిరియాల పొడిని కలిపాలి. ఈ ద్రవం జీర్ణకోశ సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఇది మంచి ఔషధం.
- కరివేపాకులను బాగా కడిగి నీడలో ఆరబెట్టాలి. వాటికి ధనియాలు, మినపప్పు, శనగపప్పు, జీలకర్ర, మిరియాలు, మిరపకాయలు, చింతపండు తగు పాళ్లలో కలిపి మూకుడులో వేయించాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి పొడి చేయాలి. ఈ ఆకులతోపాటు మునగాకులు కూడా కలిపితే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

సంకల్పం

మార్పునకు నాంది



కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసి... వైద్య రంగం వైపు అడుగులు వేశారు. కుటుంబంలో ఇద్దరిని బలి తీసుకున్న బ్రెస్ట్ కేన్సర్‌పై పోరాటం మొదలుపెట్టి... పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఆరంభ దశలోనే ఈ మహమ్మారిని మరింత సమర్థవంతంగా గుర్తించే ఏఐ ఆధారిత పరికరాన్ని తీసుకువచ్చి... వినూత్న మార్పునకు నాంది పలికారు. ఇటీవల 'ఫోర్బ్స్ మ్యాగజైన్' ప్రకటించిన '30 ఇండియన్ ఏఐ మైండ్స్' జాబితాలో చోటు దక్కించుకున్న 'నిరామై హెల్త్ అనలిటిక్స్' అధిపతి... గీతా మంజునాథ్ జర్నీ ఇది.

"నేను వైద్య రంగం వైపు రావడానికి బలమైన కారణం ఉంది. మా సోదరి ఒకావిడ తన నలభయ్యో ఏట బ్రెస్ట్ కేన్సర్‌తో మరణించింది. చిన్నప్పుడు తను, నేను కలిసి వేసవి సెలవులు గడిపేవాళ్లం. నా సన్నిహితుల్లో కేన్సర్‌తో చనిపోయిన మొదటి వ్యక్తి తను. అది నన్ను ఎంతో బాధించింది. ఆరు నెలలు తిరక్కుండానే మరో విషాదం. మావారి కజిన్ కూడా ఇదే మహమ్మారికి బలైంది. తను నాకంటే చిన్నది. వీరిద్దరికీ చిన్న పిల్లలు. ఈ ఘటనల నుంచి కోలుకోవడానికి నాకు చాలా సమయమే పట్టింది. తీవ్రమైన ఆలోచనల్లోకి నెట్టింది. దాంతో బ్రెస్ట్ కేన్సర్ గురించి అధ్యయనం మొదలుపెట్టాను. ఏ చిన్న పుస్తకం వదలకుండా కంట పడినవన్నీ చదివాను. ఆ క్రమంలోనే కేన్సర్‌ను గుర్తించడానికి ఉపయోగించే పలు పద్ధతులపై అవగాహన కలిగింది. థర్మల్ ఇమేజింగ్ అనేది ఒకటి ఉందని తెలిసింది. దీనిపై మరిన్ని పరిశోధనలు చేసి, 2016లో 'నిరామై హెల్త్ ఎనలిటిక్స్' ప్రారంభించాను. దీని ద్వారా ఆరంభ దశలోనే బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించే 'థర్మలిటిక్స్' అనే థర్మల్ ఇమేజింగ్ పరికరాన్ని రూపొందించాం. ఇది సంప్రదాయ మామోగ్రఫీ కంటే సమర్థవంతంగా, రేడియేషన్ అవసరం లేకుండా పని చేస్తుంది... ముఖ్యంగా యువతులకు.

ఉన్నత హోదాలు...

1989లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ అవ్వగానే 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్' (ఐఐఎస్‌సీ)లో మాస్టర్స్ చదివాను. తరువాత హెచ్‌పీ, జెరాక్స్ రీసెర్చ్ సెంటర్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాలు అలంకరించాను. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశాను. కంపెనీ పెట్టకముందు ఐఐఎంబీ ఇన్నోవేషన్స్‌లో డైరెక్టర్‌గా ఉన్నాను. ఈ క్రమంలో కంప్యూటర్ శాస్త్రవేత్తగా పలు పరిశోధనల్లో భాగస్వామినయ్యాను. మా కంపెనీ స్థాపనలో ఇది నాకు కలిసివచ్చింది.

సేవా దృక్పథం...

నాకు చిన్నప్పుడే సేవా దృక్పథం అలవడింది. వేసవి సెలవుల్లో ఎక్కువ భాగం అనాథ శరణాలయాల్లో గడిపేదాన్ని. ముఖ్యంగా వైద్య రంగంలో సేవలు అందిస్తే... కొందరి ప్రాణం కాపాడగలిగామనే భావన కలుగుతుంది. ఎవరైనా బాధపడుతుంటే... వారి బాధను ఎలా దూరం చేయగలనో ఆలోచిస్తుంటాను. మా కంపెనీ నుంచి వచ్చిన 'థర్మలిటిక్స్' ఆరోగ్య రక్షణ రంగంలో మెరుగైన ఫలితాలు రాబడుతోంది. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అలాగే ఇతర వ్యాధుల నిర్ధారణకు కూడా ప్రస్తుతం ఉన్నవాటికంటే మరింత మెరుగైన పరికరాలు రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

అవార్డులు... అభినందనలు...

నా ఈ ప్రయాణంలో ఎన్నో పురస్కారాలు, అభినందనలు లభించాయి. సీఎస్ఐ గోల్డ్ మెడల్, బిరాక్ విన్నర్ అవార్డుతో పాటు బయోస్పెక్ట్రమ్ ఇండియా నుంచి ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా పురస్కారం అందుకున్నాను. 2020 ఫోర్బ్స్ టాప్ 20 స్వయంశక్తితో ఎదిగిన మహిళల జాబితాలో, అలాగే ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రకటించిన '30 ఇండియన్ ఏఐ మైండ్స్'లో నాకు చోటు దక్కింది. ఇవన్నీ చూసినప్పుడు నాకు ఎంతో సంతోషంగా కలుగుతుంది. ఎందుకంటే ఒక మహాసంకల్పంతో నేను మొదలుపెట్టిన ప్రాజెక్ట్ విజయవంతమైంది. నా సోదరిలాంటి ఎంతోమంది యువతుల ప్రాణాలు కాపాడటంలో అది ఉపయోగపడుతోంది. ఇదే నేను కోరుకున్నది."

ప్రేరణ

ఆటపాటలతో ఆనందంగా గడుస్తున్న బాల్యం. అంతలో అనుకోని ప్రమాదం. దాంతో చిన్నప్పటి నుంచే వీల్‌చైర్‌కు పరిమితమవ్వాల్సి వచ్చింది. కానీ 'ఇక జీవితం ఇంతే' అని ఆమె ఆగిపోలేదు. శారీరక వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. 'ఫార్చ్యూన్ ఇండియా' మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ - 2025 జాబితాలో చోటు కూడా దక్కించుకున్నారు. ఆమే 'జిందాల్ సా లిమిటెడ్' ఎండీ, స్మినూ జిందాల్.. ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం...

చక్రాల కుర్చీతో అందలానికి!

స్మినూ.. హరియాణాలోని హిసార్‌లో ఓ వ్యాపార కుటుంబంలో పుట్టారు. ఆనందంగా సాగుతున్న ఆమె జీవితం పదకొండేళ్ల వయసులో ఊహించని మలుపు తిరిగింది. జైపూర్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా కారు ప్రమాదానికి గురయ్యారు. అదృష్టం బాగుండి ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కానీ ప్రమాదంలో వెన్నుపూసకు బలమైన గాయం కావడంతో నడుము కింద భాగం చచ్చుబడింది. తనకు ఎంతో ఇష్టమైన డ్యాన్స్ ఇంక చేయలేనని ఎంతో బాధపడ్డారామె. ఆ సమయంలో తల్లితండ్రులు ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. వైకల్యంతో అసాధ్యాలను సుసాధ్యం చేసిన వాళ్లెంతో మంది ఉన్నారని ఆమెకు ధైర్యం నూరిపోశారు. ఒక సందర్భంలో తన తల్లితండ్రులు అందించిన బాసట గురించి స్మినూ గుర్తు చేసుకుంటూ... "అమ్మానాన్న నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. అలాగని నన్నెప్పుడూ అతి గారాబం చేయలేదు" అంటూ చెప్పుకొచ్చారు.

> **పరిస్థితులే స్ఫూర్తినింపాయి**
>
> జీవితంలో ఎదురైన ఎన్నో పరిస్థితులు పలు విధాలుగా నాకు స్ఫూర్తినిచ్చాయి. ఎవరైనా 'ఇది నీ వల్ల కాదు' అంటే దాన్ని సవాలుగా తీసుకుని చేసి చూపించేదాన్ని. వైఫల్యాలే విజయానికి మార్గం. ఓడిపోతే అక్కడే ఆగిపోకుండా, కష్టపడి పైకి లేచి పూనుకుంటే విజయం సొంతమవుతుంది. మనసు పెట్టి చేస్తే సాధించలేనిది ఏదీ లేదు. వ్యాపారంలో పని ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. కానీ పనిని కష్టపడి కాకుండా ఇష్టపడి చేయగలిగితే విజయం సొంతమవుతుంది.
>
> - స్మినూ జిందాల్

ఉద్యోగం కోసం పోరాటం...

స్మినూ నడవలేదని తల్లిదండ్రులు ఆమెను ప్రత్యేక పాఠశాలకు పంపలేదు. సాధారణ బడికే పంపించారు. అలా కష్టపడి చదివి ఎంబీఏ పూర్తి చేశారామె. తరువాత వ్యాపార రంగంలోకి రావాలనుకున్నారు. కానీ ఆమె తండ్రి పీఆర్ జిందాల్, అందుకు ఒప్పుకోలేదు. మొదటి నుంచి స్మినూ కుటుంబంలో ఆడవారు వ్యాపారాలు చేయలేదు. చివరకు ఎంతో కష్టపడి తన తండ్రిని ఒప్పించి, తండ్రి కంపెనీ 'జిందాల్ సా లిమిటెడ్'లోనే ట్రైనీగా చేరారామె. తరువాత అంచలంచెలుగా మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. పురుషాధిక్యతతో కూడిన ఇనుము, ఉక్కు పైప్‌లైన్ల తయారీ రంగంలో స్మినూను ఎవరూ స్వాగతించలేకపోయారు. సహనంతో వారిలో మార్పు కోసం ఎదురుచూసి విజయం సాధించారామె. కంపెనీని అమెరికా, యూరప్, అరబ్ ఎమిరేట్స్ మొదలైన దేశాలకు విస్తరింపచేశారు. కంపెనీ టర్నోవర్‌ను వేల కోట్ల రూపాయలకు పెంచారు. ఆ విధంగా 'ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2025' జాబితాలో చోటు కూడా దక్కించుకునే స్థాయికి ఎదిగారామె.

'స్వయం' సేవ...

చిన్న వయసు నుంచే చక్రాల కుర్చీకి పరిమితమైన స్మినూ.. తనలాంటి వారికోసం ఏదైనా చేయాలనుకున్నారు. అందుకే 'స్వయం' పేరిట ఓ లాభాపేక్ష లేని సంస్థను స్థాపించారు. దీని ద్వారా దివ్యాంగులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీల్‌చైర్‌లు అందిస్తున్నారు. అలాగే 'స్వయం' ద్వారా అనేక మంది దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలను చేరువ చేస్తున్నారు. వృద్ధులు, గర్భిణులకు కూడా ప్రాథమిక అవసరాల్లో సహాయపడుతూ ప్రభుత్వ పథకాల గురించి ఈ సంస్థ అవగాహన కల్పిస్తోంది. 'స్వయం' ద్వారా చేస్తున్న సేవలకు గాను స్మినూ.. లారియల్ పారిస్ ఫెమీనా 'ఫేవరెట్ ఫేస్ ఆఫ్ కాజ్' అవార్డు కూడా ఆమె అందుకున్నారు.

ప్రేమ పెళ్లి..

స్మినూకు ఇంట్లో వాళ్లు వ్యాపార కుటుంబంలోని అబ్బాయితో పెళ్లి చేయాలనుకున్నారు. కానీ ఆమె వ్యాపార నేపథ్యం లేని ఇంద్రదేశ్ బాత్రా అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు అబ్బాయిలు. వ్యాపారాన్ని వృద్ధి చేయడంతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నెరవేరుస్తాననీ, అర్థం చేసుకునే కుటుంబం దొరకడం తన అదృష్టమనీ స్మినూ అంటున్నారు.



మేకప్

మెరుపుతీగలా మెరిసిపోవాలంటే...

పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు సాయంకాలాల్లోనే ఏర్పాటవుతూ ఉంటాయి. ఆ వేడుకల్లో మిరుమిట్లు గొలిపే లైట్ల వెలుగుల్లో ఆకట్టుకునేలా కనిపించడం కోసం ప్రత్యేకమైన మేకప్ ఎంచుకోవాలి. అదెలాగంటే...

- **చర్మాన్ని సిద్ధం చేసి:** చర్మపు పిహెచ్ వాల్యూకు తగిన సబ్బు లేదా ఫేస్ వాష్‌తో ముఖం శుభ్రపరుచుకోవాలి. సున్నితమైన స్క్రబ్‌తో పెదవుల మీద మృత చర్మాన్ని వదిలించి, లిప్ మాస్క్ వేసుకోవాలి. తర్వాత ముఖ చర్మం తేమ కోల్పోకుండా ఉండడం కోసం హైడ్రేటింగ్ సీరమ్ లేదా మన్నికైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. ఇలా చర్మాన్ని శుభ్రపరిచి, మేకప్ మొదలుపెడితే, మేకప్ చర్మం మీద సమంగా పరుచుకుంటుంది. రెట్టింపు ఆకర్షణను తెచ్చిపెడుతుంది.
- **చర్మానికి తగిన ప్రైమర్:** జిడ్డు చర్మమైతే మాటిఫైయింగ్ లేదా సిలికాన్ ఫ్రీ ప్రైమర్ ఎంచుకోవాలి. పొడి చర్మమైతే, హైడ్రేటింగ్, ల్యూమినస్ బ్రైటెనింగ్, గ్లోయింగ్ అనే లేబుల్ ఉన్న ప్రైమర్ ఎంచుకోవాలి. అలాగే దాన్లో విటమిన్ సి ఉండేలా చూసుకోవాలి.
- **ఫౌండేషన్:** దీర్ఘకాలం పాటు చెక్కుచెదరని ఫౌండేషన్ ఎంచుకోవాలి. అందుకోసం 12 నుంచి 16 గంటల పాటు చెదిరే వీలులేని ఫౌండేషన్ వాడుకోవాలి. లాంగ్ వేర్, ట్రాన్స్‌ఫర్, స్వెట్ రెసిస్టెంట్ ఫార్ములాతో కూడిన ఫౌండేషన్‌లు చక్కగా ఉపయోగపడతాయి.



- **మచ్చలను దాచేలా:** మచ్చలను కప్పేయడం కోసం ఫౌండేషన్ లేదా కన్‌సీలర్లు బాగా ఉపయోగపడతాయి. కళ్ల దిగువన ఉండే నల్లని వలయాలను కనిపించకుండా చేయడం కోసం నారింజ రంగు కలర్ కరెక్టర్ వాడుకోవాలి. తెల్లని చర్మం కలిగినవారు పీచ్ రంగులోని కలర్ కరెక్టర్ ఎంచుకోవాలి. కరెక్షన్ కోసం మొదట అవసరమైన ప్రదేశంలో కలర్ కరెక్టర్ అప్లై చేసి, వేళ్లతో లేదా బ్రష్‌తో అద్దుకోవాలి.

బిజినెస్



మహీంద్ర రివెక్స్ సిరీస్ ఎస్‌యూవీలు

ప్రారంభ ధర రూ.8.94 లక్షలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్‌యూవీ మార్కెట్‌లో అగ్రగామి మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ మార్కెట్‌పై పట్టు బిగిస్తోంది. రివెక్స్ సిరీస్‌లో కొత్తగా మూడు కంపాక్ట్ ఎస్‌యూవీలను మార్కెట్‌లో విడుదల చేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన 'ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ' కంపాక్ట్ ఎస్‌యూవీలను మరింత మెరుగు పరిచి 'రివెక్స్ ఎం, రివెక్స్ ఎం (ఓ), రివెక్స్ ఏ' పేర్లతో ఈ మూడు సరికొత్త కంపాక్ట్ ఎస్‌యూవీలను విడుదల చేస్తున్నట్టు కంపెనీ దక్షిణ భారత విభాగం సేల్స్ జోనల్ హెడ్ అరుణాగ్షు రాయ్ చెప్పారు. ఐదు రంగుల్లో లభించే వీటి బుకింగ్స్, డెలివరీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. వీటి ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర వేరియంట్‌ను బట్టి రూ.8.94 లక్షల నుంచి రూ.11.79 లక్షల వరకు ఉంటుందన్నారు. 'ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ' ఎస్‌యూవీల వలెనే రివెక్స్ సిరీస్ ఎస్‌యూవీలకూ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుందని భావిస్తున్నట్టు రాయ్ చెప్పారు.

ఫీచర్స్ రిచ్ ఎస్‌యూవీలు: రివెక్స్ సిరీస్‌లో ప్రవేశపెట్టిన ఈ మూడు ఎస్‌యూవీల్లో అనేక అత్యాధునిక ఫీచర్స్ జోడించినట్టు రాయ్ తెలిపారు. రూ.10 లక్షల లోపు ధర ఉన్న మరే ఇతర కంపెనీ ఎస్‌యూవీల్లోనూ ఇన్ని అద్భుత ఫీచర్లు లేవన్నారు. బ్లాక్ అలాయ్ వీల్స్, సరికొత్త బాడీ కలర్డ్ గ్రిల్, డ్యూయెల్ టోన్ రూఫ్, ఆకర్షణీయమైన ఎక్స్‌టీరియర్స్, కస్టమర్ల అభిరుచులకు అనుగుణమైన ప్రీమియం ఇంటీరియర్స్ ఈ మూడు రివెక్స్ సిరీస్ కంపాక్ట్ ఎస్‌యూవీల ప్రత్యేకత. ఏపీ, తెలంగాణ నుంచి కూడా ఈ మూడు ఎస్‌యూవీలకు మంచి స్పందన లభిస్తోందని రాయ్ చెప్పారు.

రెపో కోతకు ప్రస్తుత ధరలే కొలమానం కాదు

● ద్రవ్యోల్బణం, వృద్ధి ధోరణుల ఆధారంగానే నిర్ణయం ● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టీకరణ



ముంబై: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్లకు పైగా కనిష్ఠ స్థాయి 2.1 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక రెపోరేట్లను మరింత తగ్గించవచ్చన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇందుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత గణాంకాలు మాత్రమే రెపోరేటు గమనాన్ని ప్రభావితం చేయలేవని.. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై భవిష్యత్ దృక్పథం ఆధారంగా వడ్డీరేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే 12 నెలల వరకు ద్రవ్యోల్బణ సూచీ గమనం ఎలా ఉండవచ్చన్న అంచనాలను ఇందుకు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. నాలుగో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ మళ్లీ 4.4 శాతానికి పెరగవచ్చన్న అంచనాలున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే, ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే, నాలుగో త్రైమాసిక ద్రవ్యోల్బణ అంచనాను మరింత తగ్గించే అవకాశాలున్నాయని అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం తగ్గించింది. దాంతో రెపో 5.50 శాతానికి దిగివచ్చింది. ముంబైలో శుక్రవారం జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న మల్హోత్రా ప్రస్తావించిన మరిన్ని విషయాలు..

- ఈ ఏడాదిలో జూన్ వరకు బ్యాంక్‌ల రుణరేట్లు 0.50 శాతం వరకు తగ్గాయి. అప్పటివరకు ఆర్‌బీఐ అర శాతం రెపో తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంక్‌లు కస్టమర్లకు దాదాపుగా బదిలీ చేశాయి. కాగా, ఈ జూన్ 6న ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.50 శాతం తగ్గించింది.
- ఆర్‌బీఐ రెపో తగ్గింపు వ్యవస్థలో ఆస్తుల బుడగకు (అసెట్ బబుల్) దారితీయదు. ఆర్థిక వృద్ధికి మద్దతిచ్చేందుకు రెపో తగ్గింపుతోపాటు ఆర్‌బీఐ అమ్ములపొదిలో ఇతర అస్త్రాలూ ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌ల రుణ వృద్ధి 12.1 శాతంగా ఉంది. దశాబ్ది సగటు 10 శాతం కంటే మెరుగ్గానే ఉంది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో (2025-26) రుణ వృద్ధి 9 శాతానికి పరిమితం కావచ్చు.

యూకేతో ఎఫ్‌టీఏ భారత్‌కు మేలే..

యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) ఆర్‌బీఐ గవర్నర్ స్వాగతించారు. యూకేతో ఎఫ్‌టీఏ దేశంలోని పలు రంగాల వృద్ధికి తోడ్పడనుందన్నారు. భారత్ మరిన్ని దేశాలతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయన్నారు.

ఇంటెల్‌లో 24,000 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ ఏకంగా 24,000 ఉద్యోగాల కోత పెట్టే యోచనలో ఉంది. గత ఏడాది చివరినాటికి కంపెనీలో పనిచేస్తున్న 99,500 మంది సిబ్బందిలో ఇది దాదాపు 25 శాతానికి సమానం. ఈ ఏడాది చివరికి సిబ్బందిని 75,000కు తగ్గించుకోవాలని కంపెనీ భావిస్తోంది. జూన్ త్రైమాసికంలోనే కొందరిని ఇంటికి సాగనంపిన ఇంటెల్.. తాజాగా మరిన్ని విభాగాల్లో కోతలను ప్రారంభించింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఇంటెల్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు కొత్త సీఈఓ లిప్-బు టాన్..భారీ వ్యాపార పునర్‌వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టారు. వ్యయాల్ని తగ్గించేందుకు వేల సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసన పలకడంతోపాటు జర్మనీ, పోలెండ్‌లో ప్రాజెక్టుల విస్తరణ ప్రణాళికకు స్వస్తి పలికారు.

బిలియనీర్ల క్లబ్‌లోకి సుందర్ పిచాయ్



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్, దాని మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు సారథ్యం వహిస్తున్న సుందర్ పిచాయ్ కూడా బిలియనీర్ల జాబితాలో చేరారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. 53 ఏళ్ల పిచాయ్ వ్యక్తిగత సంపద 1.1 బిలియన్ డాలర్లకు (110 కోట్ల డాలర్లు) చేరుకుంది. అమెరికా స్టాక్ మార్కెట్లో ఆల్ఫాబెట్ షేర్లు సరికొత్త జీవనకాల గరిష్ఠానికి ఎగబాకడం ఇందుకు తోడ్పడింది. కనీసం 100 కోట్ల డాలర్ల (మన కరెన్సీలో సుమారు రూ.8,600 కోట్లు) ఆస్తి కలిగిన వారిని బిలియనీర్‌గా పిలుస్తారు. టెక్ ప్రపంచంలో వ్యవస్థాపక సీఈఓ కాని వ్యక్తి బిలియనీర్‌గా అవతరించడం అరుదైన పరిణామమే. ప్రస్తుతం పిచాయ్‌కి ఆల్ఫాబెట్‌లో 0.02 శాతానికి సమానమైన వాటా ఉంది. దాని విలువ 44 కోట్ల డాలర్లు.

నరేంద్రనాథ్‌కు గౌరవ పురస్కారం



తణుకు, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్ళపూడి నరేంద్రనాథ్‌కు శతాబ్ది కాల గౌరవ పురస్కారం లభించింది. ఈ నెల 24న న్యూఢిల్లీలో జరిగిన 83వ షుగర్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ సమావేశంలో ఈ పురస్కారం అందుకున్నారు. భారతీయ చక్కెర, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, పురోగతికి నరేంద్రనాథ్ జీవితకాల అంకిత భావానికి, అత్యుత్తమ సహకారానికి, నిబద్ధతకు గుర్తింపుగా పురస్కారం వచ్చినట్లు ఆంధ్రా షుగర్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

రెండు సెషన్లలో రూ.8.67 లక్షల కోట్లు ఆవిరి

నెల రోజుల కనిష్ఠ స్థాయికి సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలతో స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజు భారీ పతనాన్ని నమోదు చేసింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో అమ్మకాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మార్కెట్‌ను శుక్రవారం కుంగదీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 721.08 పాయింట్లు నష్టపోయి 81,463.09 వద్ద ముగిసింది. ఇది నెల రోజుల కనిష్ఠ స్థాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 786.48 పాయింట్ల నష్టంతో 81,397.69 స్థాయికి దిగజారింది. నిఫ్టీ కూడా 225.10 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 1263.55 పాయింట్లు నష్టపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,67,406.75 కోట్లు దిగజారి రూ.4,51,67,858.16 కోట్ల వద్ద స్థిరపడింది. కాగా వారం మొత్తం మీద సెన్సెక్స్ 294.64 పాయింట్లు, నిఫ్టీ 131.4 పాయింట్లు నష్టపోయాయి. స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం శుక్రవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.1979.96 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో బలహీన ట్రెండ్, నిరుత్సాహపూరితమైన కార్పొరేట్ ఫలితాలు ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయని విశ్లేషకులంటున్నారు. లార్జ్‌క్యాప్ షేర్ల అధిక విలువలు, ఎఫ్‌పీఐల వద్ద ఉన్న షార్ట్ పొజిషన్లు మార్కెట్లో ఒత్తిడిని పెంచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- ఫారెక్స్ మార్కెట్లో రూపాయి అమెరికన్ డాలర్ మారకంలో మరో 12 పైసలు దిగజారి 86.52 వద్ద ముగిసింది. విదేశీ నిధుల తరలింపు, అమెరికన్ కరెన్సీ బలం పుంజుకోవడం ఇందుకు దోహదపడ్డాయి.
- ఈ నెల 18వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 118.3 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 68,548.9 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.

ఎన్ఎస్‌డీఎల్ షేరు ధర శ్రేణి రూ.760-800

ఐపీఓకు రానున్న నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ షేరు ధర శ్రేణిని రూ.760-800గా నిర్ణయించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.4011 కోట్లు సేకరించాలన్నది కంపెనీ లక్ష్యం. ఇష్యూ వచ్చే బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది.

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇష్యూ సూపర్ హిట్

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇష్యూ సూపర్ డూపర్ హిట్ అయింది. శుక్రవారం ఇష్యూ ముగిసే సమయానికి 146.90 రెట్ల అధిక బిడ్లు దాఖలయ్యాయి. రూ.460.43 కోట్ల సమీకరణ లక్ష్యంగా కంపెనీ రంగంలోకి దిగింది. మొత్తం 1,41,88,644 ఈక్విటీలు జారీ చేయగా 208,43,32,446 బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 45.32 రెట్ల అధిక సబ్‌స్క్రిప్షన్ సాధించింది.

లారస్ ల్యాబ్స్ లాభం రూ.163 కోట్లు

హైదరాబాద్: స్థానిక ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,570 కోట్ల ఆదాయంపై రూ.163 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 31.3 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం 1,185 శాతం పెరిగింది. కంపెనీ స్థూల లాభం కూడా 127 శాతం వృద్ధితో రూ.389 కోట్లకు చేరింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ), జనరిక్, ఫినిష్డ్ డోసేజి ఫార్మ్ (ఎఫ్‌డీఎఫ్) వ్యాపారాలు పుంజుకోవడం క్యూ1లో బాగా కలిసి వచ్చాయని కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు. సీడీఎంఓ, జనరిక్, ఎఫ్‌డీఎఫ్ వ్యాపారాలను మరింత విస్తరించనున్నట్టు చెప్పారు.

నష్టాల్లోకి జారుకున్న సిగాచి

హైదరాబాద్: ఇటీవల పాశమైలారం ప్లాంటులో జరిగిన ప్రమాదం సిగాచీ ఇండస్ట్రీస్‌కు పెద్ద నష్టాలే మిగిల్చింది. దీంతో తొలి త్రైమాసికంలో కంపెనీ రూ.128.2 కోట్ల ఆదాయంపై రూ.101 కోట్ల నష్టాలను చవి చూసింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.95.7 కోట్ల ఆదాయంపై రూ.12.8 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఈ ఏడాది డిసెంబరు త్రైమాసికం నుంచి కంపెనీ ఆర్థిక పరిస్థితి గాడిలో పడే అవకాశం ఉందని కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. ప్రమాదంలో దెబ్బతిన్న పాశమైలారం ప్లాంటును దశల వారీగా పునరుద్ధరించాలని కంపెనీ యోచిస్తోంది.

హైదరాబాద్‌లో రెండో డెలివరీ సెంటర్

బిండ్జ్ కన్సల్టింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ కన్సల్టింగ్ సేవల సంస్థ బిండ్జ్ కన్సల్టింగ్ హైదరాబాద్‌లో తన రెండో డెలివరీ కేంద్రాన్ని ప్రారంభించింది. హైటెక్ సమీపంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు కంపెనీ తెలిపింది. ఈ కేంద్రం ద్వారా కంపెనీ విదేశాల్లోని క్లయింట్లకు టాక్స్ అడ్వైజరీ, వాల్యుయేషన్, అకౌంటింగ్, కంప్లయెన్స్, టెక్నాలజీ సేవలు అందించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,480 ▼	92,100 ▼	1,28,000 ▼
విజయవాడ	1,01,400 ▼	96,200 ▼	1,18,000 ▼
విశాఖపట్నం	1,01,420 ▼	91,200 ▼	1,28,000 ▼
రాజమండ్రి	1,00,470 ▼	92,100 ▼	1,18,200 ▼
ప్రొద్దుటూరు	98,700 ▼	90,800 ▼	1,17,500 ▲
ముంబై	98,390	90,120	1,14,340

స్పోర్ట్స్

వెన్నెల, తన్వికి పతకాలు ఖరారు

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు


వెన్నెల


తన్వి

సోలో (ఇండోనేసియా): తెలుగమ్మాయి వెన్నెల కలగొట్ల, మరో భారత షట్లర్ తన్వీ శర్మ ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకాలు ఖరారు చేసుకున్నారు. ఈ ఇద్దరు మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్స్ చేరారు. సెమీస్‌లో ఓడినా, కనీసం కాంస్య పతకాలు దక్కుతాయి. హైదరాబాద్‌కు చెందిన వెన్నెల క్వార్టర్స్‌లో 21-18, 17-21, 21-17తో జన్యాపోర్న్ మీపాన్‌థాంగ (థాయ్‌లాండ్)పై గెలిచింది. మరో క్వార్టర్స్‌లో తన్వి 21-19, 21-14తో ఐదో సీడ్ తలిట రమధాని విర్యావాన్ (ఇండోనేసియా)ను ఓడించింది. ఫైనల్ బెర్త్ కోసం సెమీస్‌లో 8వ సీడ్ యిన్ యి కింగ్ (చైనా)తో తన్వి, లూ సియా (చైనా)తో వెన్నెల తలపడతారు. ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఒకేసారి ఇద్దరు భారత షట్లర్లు సెమీస్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం.

హంపి X దివ్య

'చెక్' చెప్పేదెవరో?





నేటి నుంచి మహిళల చెస్ ప్రపంచ కప్ ఫైనల్

బటూమి (జార్జియా): విశ్వ చెస్‌లో భారత్ ఆధిపత్యానికి తాజా నిదర్శనం.. మహిళల వరల్డ్ కప్ ఫైనల్. శనివారం ఆరంభమయ్యే రెండు రోజుల తుదిపోరులో భారత్‌కు చెందిన కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. 38 ఏళ్ల హంపి డిఫెండింగ్ వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ కాగా, 19 ఏళ్ల దివ్య వర్ధమాన సంచలనం. వరల్డ్ నెం. 5 హంపి, 18వ ర్యాంకర్ దివ్యా దేశ్‌ముఖ్ సెమీఫైనల్స్‌లో చైనా స్టార్లకు షాకివ్వడం విశేషం. ప్రపంచ కప్‌లో ఇద్దరు భారత క్రీడాకారిణులు ఫైనల్‌కు చేరడం చరిత్ర. టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా గ్రాండ్‌మాస్టర్ హంపి, ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు క్వాలిఫై అయ్యారు. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో టైటిల్‌కోసం తలపడే క్రీడాకారిణిని నిర్ణయిస్తారు. ఇక..వరల్డ్ కప్ ఫైనల్లో శనివారం జరిగే క్లాసికల్ ఫార్మాట్ మొదటి గేమ్‌లో హంపి, దివ్య తలపడతారు. ఇరువురి మధ్య ఆదివారం రెండో గేమ్ జరగనుంది. ఒకవేళ రెండు గేముల్లో విజేత తేలకపోతే..సోమవారం టైబ్రేకర్ నిర్వహిస్తారు. మరి ఈ ఆసక్తికర అంతిమ సమరంలో అనుభవజ్ఞురాలైన హంపి విజేతగా నిలుస్తుందా లేక దివ్య సంచలనం సృష్టిస్తుందా? ఎవరు నెగ్గినా వరల్డ్ కప్‌లో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కే దక్కనున్నాయి.

పట్టు బిగించారు

186 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్ ● తొలి ఇన్నింగ్స్ 544/7

- జో రూట్ శతకం
- స్టోక్స్, పోప్ హాఫ్ సెంచరీలు
- భారత్‌తో నాలుగో టెస్టు


జో రూట్ (150)

టెస్టుల్లో అత్యధిక శతకాలు

సచిన్	51
కలిస్	45
పాంటింగ్	41
రూట్	38
సంగక్కర	38

1 భారత్‌పై ఎక్కువ శతకాలు (12) బాదిన ప్లేయర్‌గా జో రూట్. స్టీవ్ స్మిత్ (11)ను దాటేశాడు. అలాగే మాంచెస్టర్ స్టేడియంలో వెయ్యికి పైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గానూ నిలిచాడు.

టెస్టుల్లో అత్యధిక పరుగులు

సచిన్	15,291
జో రూట్	13,409
పాంటింగ్	13,378
కలిస్	13,289
ద్రవిడ్	13,288

మాంచెస్టర్: నాలుగో టెస్టులో వరుసగా మూడో రోజూ ఇంగ్లండ్‌దే ఆధిపత్యం సాగింది. వరల్డ్ నెంబర్‌వన్ జో రూట్ (150) మరోసారి తన అత్యుత్తమ ఆటతీరుతో అదరగొట్టాడు. అతడికి జతగా కెప్టెన్ బెన్ స్టోక్స్ (77 బ్యాటింగ్), పోప్ (71) అర్ధసెంచరీలతో రాణించగా, ప్రస్తుతం ఆతిథ్య జట్టు 186 పరుగుల భారీ ఆధిక్యంతో దూసుకెళుతోంది. భారత బౌలర్లు ఎప్పటిలాగే నిరాశపర్చడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 135 ఓవర్లలో 544/7 స్కోరుతో నిలిచింది. క్రీజులో స్టోక్స్‌తో పాటు డాసన్ (21 బ్యాటింగ్) ఉన్నాడు. ఇద్దరూ బ్యాటర్లే కావడంతో నాలుగో రోజు వీలైనంత వేగంగా ఆడి తమ ఆధిక్యాన్ని పెంచాలనే భావనలో ఉన్నారు. జడేజా, సుందర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

వికెట్ కోల్పోకుండా..: 225/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ మూడో రోజు ఆటను ఆరంభించగా.. రూట్, పోప్ తొలి సెషన్‌లో పూర్తి ఆధిపత్యం చూపారు. భారత బౌలర్లు ఈ జోడీని విడదీయడంలో విఫలమయ్యారు. పసలేని బౌలింగ్‌తో నిరాశపర్చారు. దీంతో ఇద్దరు బ్యాటర్లు తమ అర్ధసెంచరీలను పూర్తి చేసుకున్నారు. బుమ్రా సైతం ఎలాంటి ప్రభావం చూపకపోగా.. అతడి ఓవర్లలో సులువుగా పరుగులు రాబట్టారు. పోప్ 48 రన్స్ దగ్గర ఉన్నప్పుడు అన్షుల్ ఓవర్‌లో ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను కీపర్ జురెల్ అందుకోలేకపోయాడు. మొత్తంగా ఈ సెషన్‌లో 107 పరుగులు రాబట్టిన ఇంగ్లండ్ లంచ్ విరామానికి వెళ్లింది.

రూట్ శతకం: వికెట్ కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు సెషన్ ఆరంభంలోనే ఆ అవకాశం దక్కింది. పాత బంతితో స్పిన్నర్ సుందర్ చక్కటి టర్న్ రాబట్టి ముందుగా పోప్‌ను అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 144 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే హ్యారీ బ్రూక్ (3) సుందర్ ఓవర్‌లో ముందుకు వచ్చి స్టంపౌట్ కావడంతో భారత్ పైచేయి సాధించినట్టు కనిపించింది. ఈ దశలో గిల్ కొత్త బంతి తీసుకోకుండా స్పిన్నర్లతోనే ఓవర్లు వేయించాడు. కానీ రూట్‌తో జత కట్టిన కెప్టెన్ స్టోక్స్ భారత్ సంబరాలకు చెక్ పెట్టాడు. ఓవైపు అన్షుల్ ఓవర్‌లో ఫోర్‌తో రూట్ శతకం పూర్తి చేశాడు. అటు 91వ ఓవర్ మధ్యలో రెండో కొత్త బంతిని తీసుకున్నా పేసర్లు ఎలాంటి ఒత్తిడి తేలేకపోయారు. సెషన్‌లో 101 పరుగులు సాధించిన ఇంగ్లండ్ జట్టు.. ఇన్నింగ్స్ 100వ ఓవర్‌లోనే స్కోరును 400 దాటించింది. ఇక డ్రింక్స్ విరామంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన బుమ్రా ఐదు ఓవర్ల తర్వాత మైదానంలోకి వచ్చాడు. అయితే తను మెట్ల మీద నుంచి జారి పడినందుకే సమయం తీసుకున్నాడని వ్యాఖ్యాత నాసిర్ హుస్సేన్ తెలిపాడు.

చివర్లో ఊరట: ఆఖరి సెషన్ చివర్లో భారత బౌలర్లు మూడు వికెట్లు తీయగలిగారు. కానీ ఆరంభంలో రూట్, స్టోక్స్ అవలీలగా బంతులను ఎదుర్కొంటూ అడపాదడపా ఫోర్లతో తమ ఆధిక్యాన్ని పెంచుకుంటూ వెళ్లారు. ఈక్రమంలో స్టోక్స్ 15 ఇన్నింగ్స్ తర్వాత భారత్‌పై అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే తొడ కండరాలు పట్టేయడంతో 116వ ఓవర్ ముగిశాక తను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి రూట్‌తో కలిసి ఐదో వికెట్‌కు 142 పరుగులు జత చేయడం విశేషం. అలాగే డ్రింక్స్ తర్వాత భారత్‌కు కాస్త కలిసివచ్చింది. క్రీజులో పాతుకుపోయిన రూట్‌ను జడేజా అవుట్ చేయగా.. స్వల్ప వ్యవధిలో స్మిత్ (9)ను బుమ్రా, వోక్స్ (4)ను సిరాజ్ వెనక్కిపంపారు. ఈ దశలో స్టోక్స్ తిరిగి బ్యాటింగ్‌కు రాగా, డాసన్‌తో కలిసి వికెట్ కోల్పోకుండా రోజును ముగించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) అన్షుల్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్ సబ్) జురెల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్ సబ్) జురెల్ (బి) సుందర్ 3; స్టోక్స్ (బ్యాటింగ్) 77; స్మిత్ (సి సబ్) జురెల్ (బి) బుమ్రా 9; డాసన్ (బ్యాటింగ్) 21; వోక్స్ (బి) సిరాజ్ 4; **ఎక్స్‌ట్రాలు: 31; మొత్తం: 135 ఓవర్లలో 544/7. వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528. **బౌలింగ్:** బుమ్రా 28-5-95-1; అన్షుల్ 18-1-89-1; సిరాజ్ 26-4-113-1; శార్దూల్ 11-0-55-0; జడేజా 33-0-117-2; సుందర్ 19-4-57-2.

ప్రపంచ జూనియర్ స్క్వాష్‌లో అనహత్‌కు కాంస్యం



కైరో: భారత టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పతకంతో సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అనహత్ 6-11, 12-14, 10-12తో నదియెన్ ఎల్‌హమామి (ఈజిప్టు) చేతిలో ఓటమిపాలై కాంస్యం అందుకుంది. కాగా, 2010లో దీపికా పల్లికల్ తర్వాత ఈ టోర్నీలో సెమీస్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా 17 ఏళ్ల అనహత్ రికార్డుకెక్కింది.


సెమీస్‌లో సాత్విక్ జోడీ

ముగిసిన ఉన్నతి పోరు● చైనా ఓపెన్

చాంగ్‌ఝూ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే మహిళల సింగిల్స్‌లో వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా పయనం ముగిసింది. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ జోడీ 21-18, 21-14తో మలేసియా జంట ఆంగ్ యూ సిన్/టో యీ యాని చిత్తు చేసింది. ఇక పీవీ సింధుకు ప్రీక్వార్టర్ ఫైనల్లో షాకిచ్చిన ఉన్నతి..వరల్డ్ నెం. 4 అకానె యమగూచి చేతిలో పరాజయం చవిచూసింది. క్వార్టర్‌ఫైనల్లో హుడా 16-21, 12-21తో యమగూచి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.


మైనర్‌పై అత్యాచారం

పేసర్ యశ్ దయాళ్‌పై ఎఫ్ఐఆర్



జైపూర్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పేసర్ యశ్ దయాళ్‌పై మరో అత్యాచారం కేసు నమోదైంది. ఈమేరకు జైపూర్ పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసులు అందించిన వివరాల మేరకు..యశ్ దయాళ్ తొలిసారి 2023లో 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు సాయం చేస్తాననే సాకుతో దయాళ్ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడట. ఈమేరకు బాలిక చేసిన ఫిర్యాదుతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 64తోపాటు, పోక్సో చట్టం కింద 27 ఏళ్ల యశ్ దయాళ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా దయాళ్‌పై అత్యాచారం కేసు నమోదు కావడం ఇది రెండోసారి. యూపీకి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని ఐదేళ్లపాటు ఆమెతో సహజీవనం చేసి మోసం చేసిన కేసులో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

వేద కృష్ణమూర్తి వీడ్కోలు



న్యూఢిల్లీ: భారత మహిళల జట్టు మిడిలార్డర్ బ్యాటర్ వేద కృష్ణ మూర్తి క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2017 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 వరల్డ్‌కప్‌ల్లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో వేద సభ్యురాలు. కర్ణాటకలోని కడురు అనే చిన్న పట్టణం నుంచి భారత జట్టు జెర్సీని ధరించే స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని 32 ఏళ్ల వేద పేర్కొంది. 2011లో అరంగేట్రం చేసిన వేద.. భారత్ తరఫున ఐదేళ్ల క్రితమే చివరి మ్యాచ్ ఆడింది. మొత్తంగా తన కెరీర్‌లో 48 వన్డేల్లో 829, 76 టీ20ల్లో 875 రన్స్ సాధించింది.

ఒంటిచేత్తో 20 అడుగుల గోడ దూకి

కేరళలో జీవిత ఖైదీ పరార్.. గంటల్లోనే పట్టుకున్న పోలీసులు


గోవింద స్వామి

న్యూఢిల్లీ, జూలై 25: కదులుతున్న రైలులో ఒంటరిగా ఉన్న యువతిపై హత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న గోవింద స్వామి(41) కేరళలోని కన్నూర్ కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం పరారయ్యాడు. గతంలో ఓ చెయ్యి కోల్పోయి దివ్యాంగుడైన గోవిందస్వామి తన ఒంటి చేత్తో 20 అడుగుల ఎత్తైన జైలు ప్రహరీ గోడను దాటి తప్పించుకున్నాడు. జైలులో తానున్న బ్యారక్ కటకటాల్లోని కొన్ని ఊచల్లోని కొంత భాగాన్ని రంపపు బ్లేడుతో కత్తించి ఆ సందులో నుంచి గోవింద స్వామి బయటికొచ్చాడు. తర్వాత దుస్తులను ఒక దానికి మరొకటి కట్టి ముందే సిద్ధం చేసుకున్న తాడుతో 20 అడుగల ఎత్తైన ప్రహరీ గోడను ఒంటి చేత్తో దాటేశాడు. ఆపై, జైలు దుస్తులు విడిచి వెంట తెచ్చుకున్న వేరే దుస్తులను వేసుకుని పరారయ్యాడు. అయితే, గోవిందస్వామి ఓ పాడుబడిన ఇంట్లో ఉన్నట్టు పోలీసులు సీసీ కెమెరాలు, జాగిలాల సాయంతో గుర్తించారు. అతడు అక్కడున్న బావిలో దూకి దాక్కోగా.. బయటకు తీసి అదుపులోకి తీసుకున్నారు.

బరువు తగ్గాలని 3 నెలలుగా పండ్లరసమే ఆహారం

- యూట్యూబ్ చిట్కా పాటించిన బాలుడి మృతి

చెన్నై, జూలై 25: యూట్యూబ్‌లో ఓ వీడియోను చూసి మూడునెలలుగా కేవలం పండ్ల రసాన్ని మాత్రమే తాగుతున్న ఓ 17 ఏళ్ల బాలుడు చివరకు ప్రాణం కోల్పోయాడు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా కొలాచెల్‌కు చెందిన శక్తీశ్వరన్ గురువారం తమ ఇంట్లోనే ఊపిరాడక కుప్పకూలిపోయి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తమ బాబు చాలా ఆరోగ్యంగా, చురుగ్గాఉండేవాడని, అయితే యూట్యూబ్‌లో ఓ వీడియోను చూసి పండ్ల రసాన్ని మాత్రమే తీసుకుంటున్నాడని వారు చెప్పారు. తన ఆహార అలవాటును మార్చుకునే ముందు వైద్య లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించలేదని తెలిపారు. గురువారం తమ ఇంట్లో పూజ నిర్వహించగా.. బాబు ఆహారం తిన్నాడు. ఆ తర్వాత వాంతి చేసుకున్నాడు. అనంతరం ఊపిరాడటం లేదంటూనే కుప్పకూలిపోయాడు. కాగా ఆ బాబు మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు వైద్యులు శవపరీక్ష నివేదికను పరిశీలిస్తున్నారు.

నదిలో కుమారుడి గల్లంతు

చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భద్ర నదిలో జీపు బోల్తాపడి గణపతికట్టె శమంత్(22) అనే యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్ర ఆవేదనకు లోనైన అతని తల్లి రవికళ(48), గ్రామ సమీపంలోని చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద సంఘటన చిక్కమగళూరు జిల్లాలో చోటు చేసుకుంది. కళస గ్రామానికి చెందిన రవికళ, సమీపంలోని కాఫీ తోటలకు కూలీలను సమకూర్చే మేస్త్రీగా పనిచేసేవారు. కుమారుడికి ఉపాధి కల్పించేందుకు 6నెలలక్రితం జీపును కొనుగోలు చేసిచ్చారు. ఈ క్రమంలో గురువారం కళస-కళకూడ మార్గంలో కోళమగ వద్ద రోడ్డుపక్కనే ప్రవహిస్తున్న భద్ర నదిలో జీపు బోల్తా పడింది. ప్రమాదం గురించి తెలియగానే నది వద్దకు చేరుకున్న తల్లి రవికళ, రాత్రిదాకా అక్కడే కొడుకు కోసం పడిగాపులు కాశారు. చీకటి పడటం, వర్షం కురుస్తుండటంతో అధికారులు గాలింపు చర్యలను ఆపేశారు. తిరిగి శుక్రవారం గాలించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో తల్లి రవికళ రాత్రి ఇంటికి వెళ్లారు. ఆ తరువాత గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ముదురుతున్న టెంపుల్ వార్!

థాయ్‌లాండ్, కాంబోడియా మధ్య మరింత పెరిగిన దాడులు

- 20కి చేరిన మృతులు
- ఇరువైపులా లక్షన్నర మంది సురక్షిత ప్రాంతాలకు..
- థాయ్‌లాండ్ సరిహద్దుల్లోని 8 రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి


యుద్ధ వాహనంలో శతఘ్నులను నింపుతున్న కాంబోడియా సైనికులు

బ్యాంకాక్, జూలై 25: పురాతన శైవ ఆలయాలున్న ప్రాంతం కోసం థాయ్‌లాండ్, కాంబోడియా మధ్య మొదలైన యుద్ధం ముదురుతోంది. మొదట వివాదాస్పద ప్రాంతాల్లోనే పరస్పరం దాడులు చేసుకున్న ఇరుదేశాల సైన్యాలు.. శుక్రవారం 817 కిలోమీటర్ల మేర ఉన్న సరిహద్దుల వెంట ఇతర ప్రాంతాల్లో శతఘ్నులు, హెవీ మెషీన్ గన్‌లతో భారీగా కాల్పులకు దిగాయి. కాంబోడియా స్వల్పశ్రేణి రాకెట్లు ప్రయోగిస్తుండగా, థాయ్‌లాండ్ డ్రోన్లతో బాంబులు వేస్తోంది. దీనితో సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఇరువైపులా లక్షన్నర మందికిపైగా సరిహద్దుల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలినట్టు అంచనా. కాంబోడియా సరిహద్దుల్లోని తమ ఎనిమిది రాష్ట్రాల్లో థాయ్‌లాండ్ అత్యవసర పరిస్థితి ప్రకటించింది. సరిహద్దుల్లోని ఆరు జాతీయ పార్కులను మూసివేసి, సిబ్బందిని అక్కడి నుంచి తరలించింది. శుక్రవారం నాటికి థాయ్‌లాండ్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. మరో 65 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాంబోడియాలో ఒకరు మరణించినట్టు, పదుల సంఖ్యలో గాయపడినట్టు ఆ దేశ మీడియా తెలిపింది. యుద్ధం నేపథ్యంలో థాయ్‌లాండ్, కాంబోడియాలకు వెళ్లే తమ దేశ ప్రయాణికులకు భారత్, యూఎస్‌ఏ, జపాన్ హెచ్చరికలు జారీ చేశాయి.

భద్రతా మండలి అత్యవసర సమావేశం

ఆసియాన్‌కు నేతృత్వం వహిస్తున్న మలేషియా ప్రతిపాదన మేరకు కాల్పుల విరమణకు తాము సిద్ధమైనా.. థాయ్‌లాండ్ వినడం లేదని, ఈ అంశంలో ప్రపంచ దేశాలు జోక్యం చేసుకోవాలని కాంబోడియా ప్రధాని హున్ మానెట్ విజ్ఞప్తి చేశారు. దీనితో ఈ యుద్ధం అంశంపై అత్యవసర సమావేశం నిర్వహించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సిద్ధమైంది. ఇక థాయ్‌లాండ్‌తో వివాదం నెలకొన్న నాలుగు ప్రాంతాలకు సంబంధించి అంతర్జాతీయ కోర్టు (ఐసీజే)లో కాంబోడియా తాజాగా మళ్లీ ఫిర్యాదు చేసింది. ఇంతకు ముందు ఐసీజే తీర్పులను థాయ్‌లాండ్ తోసిపుచ్చిన నేపథ్యంలో కాంబోడియా తాజా ఫిర్యాదు.. ఉద్రిక్తతలను మరింత పెంచుతుందనే అభిప్రాయం నెలకొంది. మరోవైపు తమ వివాదంలో మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని ఒప్పుకోబోమని థాయ్‌లాండ్ ప్రకటించింది.

రక్షణ సామర్థ్యంలో ఎంతో తేడా!

పరస్పరం యుద్ధానికి కాలు దువ్వుతున్న థాయ్‌లాండ్, కాంబోడియాల మధ్య రక్షణ సామర్థ్యంలో తేడా అంతా ఇంతా కాదు. రక్షణ వ్యయం, యుద్ధ విమానాలు, సైన్యం సంఖ్య.. ఇలా ఎలా చూసినా కాంబోడియా కంటే థాయ్‌లాండ్ సామర్థ్యం చాలా ఎక్కువ. అంతర్జాతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ స్టడీస్ నివేదిక ప్రకారం.. గత ఏడాది థాయ్ రక్షణ బడ్జెట్ సుమారు రూ.49.3 వేల కోట్లు. 3.6 లక్షల మంది సైనికులు ఉన్నారు. 400 యుద్ధ ట్యాంకులు, 2,600 శతఘ్నులు, అమెరికా తయారీ 28 ఎఫ్-16లు సహా 112 యుద్ధ విమానాలు, యుద్ధ హెలికాప్టర్లు, దాడులు చేయగల డ్రోన్లు, ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, మరో 7యుద్ధ నౌకలు థాయ్ అమ్ములపొదిలో ఉన్నాయి. మరోవైపు కాంబోడియా రక్షణ బడ్జెట్ రూ.11.2 వేల కోట్లు మాత్రమే. సైనికుల సంఖ్య 1.24 లక్షలు. 200 యుద్ధ ట్యాంకులు, 480 శతఘ్నులు, 16 యుద్ధ హెలికాప్టర్లు ఉన్నాయి. ఒక్క యుద్ధ విమానం కూడా లేదు.

ఆహార ధరలపై వాతావరణ మార్పుల ప్రభావం

న్యూఢిల్లీ, జూలై 25: అసాధారణమైన తీవ్రమైన వేడిగాలులు వంటి వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో గత ఏడాది ఆహారం ధరలు భారీగా పెరిగాయని తాజా అధ్యయనం పేర్కొంది. 2024 రెండో త్రైమాసికంలో ఉల్లిపాయలు, బంగాళదుంపల ధరలు 80 శాతానికి పైగా పెరిగాయని తెలిపింది. బార్సిలోనా సూపర్ కంప్యూటింగ్ సెంటర్‌కు చెందిన మాక్సిమిలియన్ కోట్జ్ నేతృత్వంలో 2022-2024 మధ్య 18 దేశాల్లో అధ్యయనం నిర్వహించారు. ప్రతికూల వాతావరణం వలన విపరీతంగా పెరిగిన 16 రకాల ఆహారపు ధరలను పరిశోధకులు విశ్లేషించారు. చాలా వరకు సందర్భాల్లో 2020 కంటే ముందు నాటి ధరలను దాటేశాయని, గ్లోబల్ వార్మింగ్ బలంగా ప్రభావం చూపినట్లు అధ్యయనంలో వెల్లడైంది. 'మే నెలలో వీచే వేడిగాలుల తర్వాత భారత్‌లో 2024 రెండో త్రైమాసికంలో ఉల్లి, బంగాళదుంపల ధరల 80 శాతానికి పైగా పెరిగాయి' అని పరిశోధకులు పేర్కొన్నారు. 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. భారత్‌లో మే నెలలో తీవ్రమైన వేడి.. పంట దిగుబడి, సరఫరా చైన్లపై ప్రభావం చూపింది. ఆహార ధరల పెరుగుదల కారణంగా పోషకాహార లోపం, దీర్ఘకాలిక వ్యాధులు వంటి ఆరోగ్య ప్రతికూలతలతో పాటు ఆర్థిక అసమానతలు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం హెచ్చరించింది. కోట్జ్ మాట్లాడుతూ ఆహార ధరల పెరుగుదల కారణంగా ఆహార భద్రతపై, ప్రధానంగా అల్పాదాయ కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్నారు. 'ధరలు పెరిగినప్పుడు, పేద కుటుంబాలు తక్కువ పోషకాలు కలిగిన, చౌకైన ఆహార పదార్థాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇలాంటి ఆహారాలు కేన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక ఆరోగ్య పరిస్థితులతో ముడిపడి ఉంటాయి' అని పేర్కొన్నారు.

25 అశ్లీల ఓటీటీ యాప్‌లపై నిషేధం

- జాబితాలో ఉల్లూ, దేశీఫ్లిక్స్, ఏఎల్‌టీటీ...

న్యూఢిల్లీ, జూలై 25: ఓటీటీల్లో విచ్చలవిడిగా ప్రసారమవుతున్న అసభ్యకర, అశ్లీల కంటెంట్‌కు చెక్ పెట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ ఓటీటీలు ఉల్లూ, ఏఎల్‌టీటీ, దేశీఫ్లిక్స్ సహా 25 యాప్‌లపై నిషేధం విధించింది. వీటి ప్రసారాలు తక్షణం నిలిపివేయాలంటూ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల (ఐఎస్‌పీ)ను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అశ్లీల కంటెంట్ ప్రసారాలను అడ్డుకొనేందుకే ఈ చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసింది. నిషేధించిన యాప్‌ల జాబితాలో.... ఏఎల్‌టీబాలాజీ (ఏఎల్‌టీటీ), ఉల్లూ, బిగ్ షాట్స్ యాప్, దేశీఫ్లిక్స్, బూమెక్స్, నియాన్‌ఎక్స్ వీఐపీ, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, షోహిట్, జల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్‌ప్రైమ్, ఫ్యూగీ, ఫీనియో, షోఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టీవీ, హాట్‌ఎక్స్ వీఐపీ, హల్‌చల్ యాప్, మూడ్‌ఎక్స్, మోజ్‌ఫ్లిక్స్, ట్రిఫ్లిక్స్ ఉన్నాయి.

ఆకలి చావుల అంచున గాజా

(మొదటి పేజీ తరువాయి)

తేలిన చిన్నారుల పరిస్థితి హృదయ విదారకంగా తయారైంది. చిన్నారులు కనీసం నడవలేక పోతున్నారు. ఏడిచే ఓపిక కూడా లేని స్థితి. ఆకలి బాధలు తట్టుకోలేక చిన్న పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు. మొత్తం 113 మంది ప్రాణాలు కోల్పోగా ఇందులో 81మంది చిన్నారులున్నారు. సుమారు లక్షమంది మహిళలు, చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు ఆసుపత్రుల్లో అవసరమైన ఔషధాలు లేక డాక్టర్లు కూడా చేతులెత్తేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తాయని, తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని 100కు పైగా సహాయ సంస్థలు హెచ్చరించాయి.


ఆరు వేల వాహనాలు సిద్ధం

నిజానికి గాజాలో మానవతా సాయం అందించాలంటే రోజుకు 600 ట్రక్కులు అవసరమవుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్ ఆంక్షల కారణంగా రోజుకు 69 ట్రక్కులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఈ తరుణంలో గాజాలో ప్రజలకు ఆహారం, తాగునీరు, ఔషధాలు అందించేందుకు 6 వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఇజ్రాయెల్ అనుమతిస్తే ఈ వాహనాలన్నీ ఈజిప్ట్, జోర్డాన్ నుంచి గాజాలోకి వస్తాయని వెల్లడించింది. మానవతా సాయం అందించేందుకు ఇజ్రాయెల్ తక్షణమే అంగీకరించాలని సూచించింది.

శాంతి చర్చల నిలిపివేత!

ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఈజిప్ట్, ఖతర్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు నిలిపివేయాలని అమెరికా నిర్ణయించుకున్నట్లు సమాచారం. హమాస్ తీరుపై అసంతృప్తిగా ఉన్న అగ్రరాజ్యం తమ శాంతి చర్చల బృందాన్ని పశ్చిమాసియా నుంచి వెనక్కి రావాలని పురమాయించినట్లు తెలిసింది. ఇజ్రాయెల్ కూడా తమ శాంతి చర్చల బృందాన్ని తిరిగి వచ్చేయాలని సూచించింది. మరోవైపు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ ప్రకటించారు. సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో దీనిపై నిర్ణయాన్ని ప్రకటిస్తామంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. గాజాలో తక్షణమే మానవతా సాయం అందాలని ఆయన సూచించారు.


గాజాలోని ఓ శరణార్థి శిబిరంలో ఎముకల గూడులా మారిన చిన్నారి




చిత్రజ్యోతి SINCE 1965

పాటతో ముగించారు



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం షూటింగ్ పూర్తయింది. సోషియో ఫాంటసీ విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి వశిష్ట దర్శకుడు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఇప్పటికే ఒక పాట మినహా ఈ చిత్రం పూర్తయింది. చిరంజీవి, మౌని రాయ్‌పై చిత్రీకరించిన అద్భుతమైన డ్యాన్స్ నంబర్‌తో షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టేశారు. ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకుడు. అయితే యువ సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తాజా పాటకు స్వరకల్పన చేయడం విశేషం. శ్యామ్ కాసర్ల రాసిన ఈ పాట అభిమానులకు ఒక ట్రీట్‌గా ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకత్వంలో వంద మంది డ్యాన్సర్స్ కూడా పాల్గొనగా ఈ పాటను గ్రాండ్‌గా తీశారు. మెగాస్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ గ్రేస్‌తో అదరగొట్టేశారు. త్రిష కథానాయిక. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు.

ఇద్దరు వీరుల యుద్ధం



ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వార్-2' ట్రైలర్ వచ్చేసింది. జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించిన ఈ భారీ యాక్షన్ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆదిత్య చోప్రా పాన్ ఇండియా స్థాయిలో నిర్మించారు. కియారా అద్వానీ కథానాయిక. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. తెలుగులో ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది. కాగా, ఇద్దరు వీరులు యుద్ధానికి తలపడితే ఎలా ఉంటుందో ట్రైలర్‌లో చూపించారు. కియారా అద్వానీ కూడా కొన్ని యాక్షన్ సన్నివేశాలతోపాటు గ్లామర్ సీన్లలో కనిపించారు.

అలరించే ప్రేమకథ




నరేశ్ అగస్త్య, రబియా ఖాతూన్ జంటగా విపిన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఉమాదేవి కోట నిర్మించారు. ఆగస్టు 22న థియేటర్లలో విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు నరేశ్ అగస్త్య మాట్లాడుతూ 'దర్శకుడు విపిన్ ఈ సినిమాని చాలా అద్భుతంగా తెరకెక్కించారు. రబియా చాలా చక్కగా నటించారు. వెరీ బ్యూటిఫుల్ క్లీన్ ఫిల్మ్ ఇది. అందర్నీ తప్పకుండా అలరిస్తుందీ చిత్రం' అని అన్నారు. 'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. చాలా ఎఫర్ట్ పెట్టాం. సినిమా హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం. తప్పకుండా ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని దర్శకుడు విపిన్ అన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ రబియా, నటుడు రాజా తదితరులు పాల్గొన్నారు.



ఫిల్మ్ ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలి

షెడ్యూల్ ప్రకారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే పోరాటం చేస్తామని పలువురు నిర్మాతలు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రొడ్యూసర్స్ సెక్టార్ మాజీ అధ్యక్షుడు డా.ప్రతాని రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కె.ఎస్.రామారావు, అశోక్ కుమార్, బసిరెడ్డి, మోహన్ గౌడ్, విజయేందర్‌రెడ్డితోపాటు సి.కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.ఎస్.రామారావు మాట్లాడుతూ 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇలాంటి గొప్ప అసోసియేషన్‌ను క్రమశిక్షణ ప్రకారం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. అధ్యక్షులు భరత్ భూషణ్‌కి, ఇతర సభ్యులకు షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ' ఈనెల 30న జరగాల్సిన ఈసీ మీటింగ్‌ను తిరుపతిలో నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని, న్యాయపరంగా పోరాటం చేస్తామని' అన్నారు. అశోక్ కమార్ మాట్లాడుతూ 'ఈసీ మీటింగ్‌లో అంబికా ప్రసాద్ అనే ఒక చిన్న డిస్ట్రిబ్యూటర్ చెప్పాడని ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రస్తుత కమిటీ నాయకులు చెప్పడం ఆశ్చర్యంగా ఉంది' అని అన్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'ఇండస్ట్రీలోని ప్రతి స్టార్‌కు, ప్రొడ్యూసర్‌కు ఇందులో సభ్యత్వం ఉంది. అలాంటి తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో నిరంకుశంగా మేమే కొనసాగుతాం అనడం కరెక్ట్ కాదు. ఎన్నికల నిర్వహణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలవబోతున్నాం. అలాగే మన ఎంపీలతోనూ పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావింపజేస్తాం' అని అన్నారు.

వినోదాత్మక చిత్రం



ఇటీవలె 'మజాకా'తో ప్రేక్షకులను పలకరించిన దర్శకుడు త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్న చిత్రం 'నేను రెడీ'. హవీశ్ కథానాయకుడిగా నిఖిలా కోనేరు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకునే వినోదాత్మక చిత్రమని మేకర్స్ తెలిపారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందిస్తున్నారు.



గోవా చేరుకున్న అశోక్ గజపతిరాజు, కుటుంబసభ్యులు

నేడు గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు బాధ్యతలు

విజయనగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుతో పాటు ఆయన సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మరో కుమార్తె విద్యావతిదేవి శుక్రవారం గోవా చేరుకున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఆ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అశోక్ కుటుంబంతో పాటు ఆయన సన్నిహితులు, బంధువులు, పలువురు టీడీపీ నాయకులు ఇప్పటికే అక్కడకు వెళ్లారు.

గవర్నర్‌తో జస్టిస్ బట్టు దేవానంద్ భేటీ

» 28న హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం



అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం గవర్నర్ బంగ్లాలో భేటీ అయ్యారు. మద్రాస్ హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ దేవానంద్ కుటుంబ సభ్యులతో కలిసి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జస్టిస్ బట్టు దేవానంద్ సతీమణి పద్మకుమారి, కుమార్తెలు మౌని, కీర్తి ఉన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్.. జస్టిస్ దేవానంద్‌తో హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేయించనున్నారు.

రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వండి

» కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు టీడీపీ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే రక్షణ, ఏరోస్పేస్ పరికరాల తయారీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు సహకరించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు టీడీపీ ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో రక్షణ, అంతరిక్ష పరిశ్రమల మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కీలక ప్రతిపాదనలపై వినతిపత్రం అందించేందుకు శుక్రవారం రాజ్‌నాథ్‌సింగ్‌తో ఎంపీల బృందం భేటీ అయింది. ఆ బృందంలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

రోడ్ సేఫ్టీకి మాదిరెడ్డి ప్రతాప్

» అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి డీజీగా వెంకటరమణ

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌ను రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అగ్నిమాపక శాఖ డీజీ బాధ్యతలు అత్యంత సీనియర్ డైరెక్టర్ అయిన వెంకటరమణకు అప్పగిస్తూ శుక్రవారం సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రం ఏడాది క్రితం విడుదల చేసిన నిధులతో ఫైర్ ఇంజన్లు కొనకుండా తన దైన శైలిలో నిర్ణయాలు తీసుకొంటూ జాప్యం చేసిన మాదిరెడ్డి వ్యవహారం ప్రభుత్వానికి నచ్చలేదు. సిబ్బందిని ఇబ్బంది పెట్టేలా నిర్ణయాలు తీసుకొంటూ అగ్నిమాపక శాఖలో అసహనానికి కారణమయ్యారు. ప్రభుత్వ పెద్దల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న సమాచారంతో మాదిరెడ్డిపై బదిలీ వేటు పడింది. అగ్నిమాపక శాఖ అభివృద్ధి, సిబ్బంది సమస్యలు తెలిసిన వెంకటరమణకు డీజీ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం విపత్తుల స్పందన శాఖకు మేలు చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. మరోవైపు పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎస్.వి. శ్రీధర్‌రావును సీఐడీలో ఎస్పీగా ప్రభుత్వం నియమించింది.

తీరం దాటిన వాయుగుండం

ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన.. ఓడరేవుల్లో 3వ నంబరు హెచ్చరిక



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి ప్రవాహం



శ్రీశైల జలాశయం నుంచి సాగర్‌కు వెళ్తున్న వరద

» దక్షిణ కోస్తా, సీమల్లోనూ వర్షాలు
» వచ్చే వారం మరో అల్పపీడనం
» పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
» భద్రాచలం వద్ద 25.80 అడుగులు
» పోలవరం నుంచి 2.51 లక్షల క్యూసెక్కులు విడుదల
» ఊపందుకున్న వరి నాట్లు, పత్తి, అపరాల సాగు

విశాఖపట్నం/అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా బలపడి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. తర్వాత రెండు, మూడు గంటల వ్యవధిలోనే పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో తీరం దాటింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, జార్ఖండ్ దిశగా పయనించనుంది. వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కోస్తాలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. ఉత్తరాంధ్రలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తాలోని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. వాయుగుండం ఉత్తర ఒడిశా దిశగా రానున్నందున శుక్రవారం రాత్రి ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. శనివారం ఉత్తర కోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, వాయుగుండం తూర్పు భారతం మీదుగా వాయవ్య భారతం వైపు పయనించి బలహీనపడిన తరువాత వచ్చే వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

శుక్రవారం నాటికి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు... (నిల్వ టీఎంసీలలో, ప్రవాహం క్యూసెక్కుల్లో..)

రిజర్వాయర్	గరిష్ఠ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
శ్రీశైలం	215.81	202.96	1,63,966	1,20,639
నాగార్జునసాగర్	312.05	280.12	1,20,635	6,598
పులిచింతల	45.77	16.08	900	400
ప్రకాశం బ్యారేజీ	3.07	3.00	27,929	17,925
తుంగభద్ర డ్యామ్	100.86	78.07	26,478	28,397

కోస్తాలో వాన ముసురు

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం, వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అల్లూరి జిల్లా ముంచింగిపట్టులో గరిష్ఠంగా 46 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో 10 మి.మీ. కన్నా ఎక్కువ వాన పడింది. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు ముసురు వాతావరణం నెలకొంది. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 17 జిల్లాల్లో వర్షపాతం మెరుగైంది. రాయలసీమలో మాత్రం వాన లోటు కొనసాగుతోంది. ప్రస్తుత వర్షాలతో కోస్తాంధ్రలో వరి నాట్లు, పత్తి, అపరాల పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వేసిన ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత

వాయుగుండం, భారీ వర్షాలపై శుక్రవారం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఫ్లాష్ ఫ్లడ్స్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వాయుగుండం ప్రభావ పరిస్థితిని మంత్రి సమీక్షించారు. సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, అధికారులతో మాట్లాడారు. కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని, చెరువులు, కాలువలు, రోడ్లకు పడిన గండ్లను గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

గోదావరికి వరద పోటు

పోలవరం/ధవళేశ్వరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు రెండు రోజులుగా గోదావరి నీటిమట్టం మళ్లీ క్రమక్రమంగా పెరగడం ప్రారంభించింది. ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, పర్ణ, ఇంద్రావతి, కొండవాగుల జలాలు కలవడంతో శుక్రవారానికి నీటిమట్టం మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 2,51,411 క్యూసెక్కుల జలాలను జల వనరుల శాఖ అధికారులు స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 28.440 మీటర్లు, దిగువన 18.680 మీటర్లు నమోదైనట్టు తెలిపారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25.80 అడుగులకు చేరుకోవడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాగా, శుక్రవారం సాయంత్రానికి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ ద్వారా 2,46,347 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 4లక్షల క్యూసెక్కుల వరద రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రమణ

అపరిష్కృత సమస్యలు పరిష్కరించండి

» ఉద్యోగులలో అసంతృప్తిని చల్లార్చండి
» సీఎంకు ఏపీఎన్‌జీజీవో నేతల విజ్ఞప్తి
» సీఎస్‌తో ఏపీజీఈఏ నేతల సమావేశం

విజయవాడ/అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, వారిలో ఉన్న అసంతృప్తిని చల్లార్చటానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీఎన్జీజీవో అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఏపీఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ ఏ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను సీఎం దగ్గర ప్రస్తావించారు. ఉద్యోగుల్లో ఉన్న ఆందోళన, వారి మనోభావాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, చాలావరకు అపరిష్కృతంగా ఉండిపోయాయని విద్యాసాగర్ ప్రస్తావించారు. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. పీఆర్‌సీ, డీఏ ప్రకటనల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులున్నప్పటికీ దశలవారీగా పరిష్కరిస్తానని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. సింగపూర్ పర్యటన తర్వాత ఉద్యోగుల సమస్యలపై చర్చిద్దామని చెప్పినట్టు తెలిసింది.

ఈహెచ్‌ఎస్ పథకంపై...

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సచివాలయంలో సీఎస్ విజయానంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ పథకం కింద మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన సంఘాల వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, ప్రధాన గుర్తింపు సంఘాన్ని ఉద్యోగులు నేరుగా ఎన్నుకునే విధానాన్ని రూపొందించాలని, రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని సూర్యనారాయణ కోరారు. ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, సహ అధ్యక్షులు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నీటి కేటాయింపులెప్పుడు?

» కృష్ణా బోర్డు తీరుతో ఉభయ రాష్ట్రాల నడుమ చిచ్చు

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నీటి సంవత్సరంలో కృష్ణా జలాల పంపిణీపై అధికారిక నిర్ణయం తీసుకోకుండా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అలసత్వం ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపుగా రెండు నెలలుగా బోర్డు సమావేశమే కాలేదు. కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ కేంద్ర జల సంఘం చైర్మన్‌గా నియమితులయ్యారు. బోర్డు బాధ్యతలను అదనంగా చూస్తున్నారు. కేఆర్ఎంబీకి శాశ్వత చైర్మన్‌ను ఇంకా నియమించలేదు. దీంతో నిర్ణయాలు దాదాపు నిలిచిపోయాయి. ఈ ఏడాది జూన్ 1నుంచి 2025-26 కొత్త నీటి సంవత్సరం మొదలైంది. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకూ కేటాయించాల్సి ఉంది. రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి దాకా నీటి కేటాయింపులపై బోర్డు సమావేశాన్నే ఏర్పాటు చేయలేదు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో భారీవర్షాలతో వరద తరలివస్తోంది. శ్రీశైలం డ్యాం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. రెండు రాష్ట్రాలూ జోరుగా విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు శ్రీశైలం గేట్లెత్తి నీటిని దిగువకు వదిలారు. సాగర్ నుంచి కూడా దిగువకు నీటిని వదులుతున్నారు. వీటిని వినియోగించడానికి రాష్ట్రం సిద్ధం కావడంతో.. ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ విమర్శలు ప్రారంభించింది. ఏపీ మాత్రం సంయమనం పాటిస్తోంది. జూన్ మూడో వారంలో నీటి కేటాయింపులపై రెండు రాష్ట్రాలతోనూ సమావేశం కావలసిన బోర్డు.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీళ్లున్నా.. ఏపీ దురాశకు అంతులేదు

» కృష్ణా ట్రైబ్యునల్-2లో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలు శాస్త్రీయ విధానంలో పంటలకు అందిస్తే సరిపోతాయని, కానీ.. ఏపీ దురాశకు అంతులేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని తెలంగాణ తరఫు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా-2)లో తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ విచారణ సందర్భంగా శుక్రవారం ఆయన వాదనలు వినిపించారు. 1956లో ప్రణాళిక సంఘం నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడు సాగర్ ఎడమ కాల్వ(తెలంగాణ ప్రాంతానికి) కింద 6.6 లక్షల ఎకరాలకు సాగునీటికి ఆమోదం తెలపగా... దాన్ని 5.4 లక్షలకు కుదించారని, అదే క్రమంలో సాగర్ కుడి కాలువ కింద 1.3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే... దాన్ని 3.8 లక్షల ఎకరాలకు పెంచారని గుర్తు చేశారు. ఆల్మట్టి ద్వారా 60టీఎంసీల నీరు గ్రావిటీతో తెలంగాణ ఆయకట్టుకు అందాల్సి ఉండగా... ఆగిపోయిందని పేర్కొన్నారు. కృష్ణా బేసిన్ పరిధిలోని తెలంగాణలో కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలని నివేదించారు. తెలంగాణకు నీటి కేటాయింపుల వల్ల ఏపీకి ఏ విధంగానూ నష్టం జరగదని, ఇతర బేసిన్లకే నీటిని తరలిస్తున్నందున..ఆయా ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే సాగు అవసరాలకు నీరు సరిపోతుందన్నారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ), కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకాలకు 75శాతం డిపెండబుల్టీ ఆధారంగా నీటిని కేటాయించడానికి అవకాశం ఉందని వివరించారు. కాగా, తదుపరి విచారణ వచ్చే నెల 28, 29వ తేదీల్లో జరగనుంది.

పెద్దాపురంపై మళ్లీ 'పాత' ముద్ర!

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. ఒకరిపై మరొకరు దాడులు చేసుకోవడంతో పాటు హత్యలకు సైతం దిగుతున్నారు. 2022లో కొన్ని వ్యభిచార గృహాలను పోలీసులు సీజ్ చేయగా కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుని మళ్లీ కొనసాగిస్తున్నారు. పైగా పోలీసు అధికారులపైనే వ్యభిచారం చేసే మహిళలతో కేసులు పెట్టించడం పరిపాటిగా మారింది. వారికి స్థానికంగా కొందరు నేతలు సహకరిస్తున్నారు. ఈ ముఠాల కారణంగా ఎంతోమంది అమాయక యువతులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



పెద్దాపురంలో ఇటీవల వ్యభిచార గృహాలున్న ప్రాంతంలో తనిఖీలకు వెళ్లిన పోలీసులు

ప్రేమ పేరుతో రొంపిలోకి..

దారుణమైన విషయం ఏంటంటే.. వ్యభిచార నిర్వాహకులు తమ కుమారుల ద్వారా అమ్మాయిలను ప్రేమ పేరుతో ఉచ్చులోకి లాగుతున్నారు. కాలేజీలు, హాస్టళ్లు, బస్టాండ్ల వద్దకు పంపి యువతులను ఆకర్షించి, విలాసాలు అలవాటు చేయిస్తున్నారు. ఆనక పెళ్లి పేరుతో ఇంటి నుంచి రప్పించి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారు. ఇలా ఎందరో అమాయక యువతుల జీవితాలను నాశనం చేశారు. అనకాపల్లికి జిల్లాకు చెందిన ఓ బాలిక కొంతకాలం కిందట ఇంట్లో కోపగించి బయటకు వచ్చేసింది. ఆ అమ్మాయిని గుర్తించిన ఓ వ్యభిచార గృహ నిర్వాహకురాలు చేరదీశారు. తన కుమారుడికి ఇచ్చి వివాహం చేస్తానని చెప్పి ఆ బాలికను వ్యభిచార కూపంలోకి దించింది. తీవ్ర అనారోగ్యం పాలైన ఆ బాలిక ఆసుపత్రి పాలైంది. చివరికి బాధితురాలిని సొంతవారు ఇంటికి తీసుకెళ్లారు.

వాట్సా్ప్‌లోనూ బేరాలు

నిర్వాహకులు విటుల కోసం వ్యభిచార గృహాల్లో గుండ్రటి మంచం, ఖరీదైన విదేశీ మద్యం, ఆర్డర్ చేస్తే తక్షణ వచ్చే నాన్‌వెజ్ వంటకాలు, గదుల్లో డ్యాన్సులకు రంగుల విద్యుత్ లైట్లు.. వంటి సదుపాయాలు సమకూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా, ఇతర ప్రాంతాల్లోను విటులకు యువతుల ఫొటోలతో పాటు రేట్లను వాట్సాప్‌లో పంపుతున్నారు. కొందరు విటుల కోరికతో ముంబై నుంచి యువతులను రప్పిస్తున్నారు. నిర్వాహకులు వారం వారం లక్షల్లో సంపాదిస్తూ విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు.

పోలీసుల కక్కుర్తి

వ్యభిచార గృహనిర్వాహకులు తన కుమార్తెను వారి వద్ద ఉంచుకుని బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారని ఇటీవల పెద్దాపురం పట్టణానికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బాధిత బాలికను ఆమెకు అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న భారతి అనే మహిళపై కేసు నమోదు చేయకుండా తాత్సారం చేశారు. పైగా ఓ కానిస్టేబుల్, హోంగార్డు వ్యభిచార నిర్వాహకులకు మద్దతుగా ఉంటూ, అమ్మాయిలతో విందు, పొందు, డ్యాన్సులు చేస్తూ వీడియోలో దొరికిపోయారు. జాలీ ట్రిప్పులకు వెళ్లగా అవీ బయటపడ్డాయి. దీంతో వీరిద్దరినీ కాకినాడ జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. కొందరు పోలీసులు కాసులకు కక్కుర్తిపడి ముఠాలకు సహకరిస్తుండటంతో వారి వ్యాపారం అడ్డూ అదుపూ లేకుండా జరుగుతోంది. బాధిత యువతులు పోలీసులకు చెబితే కొందరు తిరిగి సమాచారాన్ని వ్యభిచార నిర్వాహకులకు చేరవేస్తున్నారు. వ్యభిచార ముఠాలు డబ్బు, వలపుల వల విసురుతూ కొందరు పోలీసులను తమదారికి తెచ్చుకుని బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి ఎదిగిపోయాయి.

ఇదీ నేపథ్యం..

కాకినాడ జిల్లాలోని పెద్దాపురం పట్టణం ఒకప్పుడు రాజవంశాలకు కేంద్రంగా ఉండేది. అప్పటి సామాజిక పరిస్థితుల్లో దేవదాసీ వ్యవస్థకు, ప్రత్యేక వర్గాల మహిళల సేవలకు స్థానం ఉండేది. దేవాలయాలకు అంకితమయ్యే యువతులు దేవతసేవ పేరుతో కొన్ని సందర్భాల్లో రాజులు, జమీందార్లు, ఉన్నత స్థాయి వ్యక్తులకు సేవకులుగా మారిపోయారు. ఇది కాలక్రమంలో వ్యభిచారానికి దారితీసింది. ఎన్నో సినిమాల్లో పెద్దాపురం ప్రస్తావనతో డైలాగులు ఉన్నాయి. ఒకప్పుడు విలాసవంతమైన భవనాలు, తిరుగుడు మంచాలు, రహస్య గదులు, సుందరాంగులతో ఈ ప్రాంతం రెడ్ లైట్ ఏరియాను తలపించేది. ఎవరైనా పెద్దాపురం వెళ్తున్నామంటే వాళ్ల వైపు అదోరకంగా చూసేవారు. ఆ ఊరిలో చదువుకునేవారు, ఉద్యోగం చేసేవారు, ఇంకా ఆ ఊరి వాస్తవ్యులు బయటకు చెప్పడానికి వెనుకాడేవారు. తమ ప్రాంతానికి జరుగుతున్న నష్టం, పిల్లల పెళ్లిళ్లపై పడుతున్న ప్రభావంతో ఈ ఊరు కొన్ని దశాబ్దాలుగా కష్టపడి ఆ చెడ్డపేరును తొలగించుకుంది. అదే సమయంలో ఈ వృత్తిని సంప్రదాయంగా కొనసాగించే వర్గాల్లో మార్పు రావడంతో కాలక్రమేణా కనుమరుగైంది. ఆయా కుటుంబాల్లో యువత సైతం ఉన్నత విద్యను అభ్యసించి, దేశ విదేశాల్లో స్థిరపడి గౌరవంగా బతుకుతున్నారు. ఇప్పుడు భారీ పరిశ్రమలతో పారిశ్రామికంగా పరుగులు తీస్తోంది. అయితే కొన్ని ముఠాలు మళ్లీ పాతరోజులను గుర్తుకు తెచ్చేలా 'వ్యాపారం' మొదలుపెట్టాయి. అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖలో అయోధ్య సెట్ మూసివేత

విశాఖపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో అయోధ్య రామాలయం సెట్ వేసి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాకు ఎట్టకేలకు పోలీసులు చెక్ పెట్టారు. ఆర్కే బీచ్‌రోడ్డులో పార్క్ హోటల్ పక్కన మే 22న ప్రారంభించిన ఈ సెట్‌లో దర్శనానికి రూ.50 చొప్పున వసూలు చేశారు. ఈ నెల 29న భద్రాచలం దేవస్థానం ఆస్థాన పండితుల చేతుల మీదుగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామని ప్రకటించి టికెట్ల విక్రయం ప్రారంభించారు. దీనిపై 'సెట్టేసి...కొట్టేస్తున్నారు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 22న కథనం ప్రచురించింది. భద్రాచలం దేవస్థానం ఈఓ కూడా నిర్వాహకులపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభమైంది. ఇంత జరిగినా 29న కల్యాణోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు సమావేశం పెట్టి మరీ ప్రకటించారు. దాంతో ఏపీ సాధుపరిషత్, హిందూ సంఘాల సభ్యులు బుధవారం అక్కడికి వెళ్లి సెట్‌ను పరిశీలించారు. అయోధ్యలో బాలరాముడి దర్శనానికే టికెట్ లేదని, ఇక్కడ ఎలా పెడతారని ప్రశ్నించారు. సెట్టు వేసి దోచుకునే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విచారణ చేయాలని కోరారు. సెట్ ప్రాంగణంలో స్టాళ్ల పెట్టుకోవడానికి తమనుంచి నిర్వాహకులు భారీగా డబ్బులు వసూలు చేశారంటూ కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. స్వచ్ఛందంగా మూసేస్తే మంచిదని, లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కాగా, సెట్‌ను ప్రారంభించినపుడు 45 రోజులకు అనుమతి తీసుకున్నారు. ఆ తరువాత బీజేపీ పెద్దలతో చెప్పించి ఇంకో 15 రోజులు గడువు తీసుకున్నారు. ఆగస్టు 5 వరకు అనుమతి ఉన్నట్టు చెబుతున్నారు. ఈ సెట్, అక్రమ వసూళ్లపై తీవ్ర వ్యతిరేకత రావడంతో బీజేపీ పెద్దలు అప్రమత్తమయ్యారు. సమస్య తీవ్రతరం కాకముందే ఆలయ సెట్‌ను మూసేయాలని ఆదేశించారు. దాంతో నిర్వాహకుడు గరుడా దుర్గాప్రసాద్ శుక్రవారం సాయంత్రం 6గంటలకు సెట్‌కు తాళాలు వేశారు. సామగ్రిని వాహనాల్లో తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతోందని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.



ద్విచక్ర వాహనదారుడిపై చిరుత దాడి

తిరుపతిలో అలిపిరి జూపార్క్ రోడ్డులో ఓ చిరుత ద్విచక్ర వాహనదారుడిపై దాడికి యత్నించింది. శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో క్యాన్సర్ ఆస్పత్రికి సమీపంలో పొదల చాటున ఉన్న చిరుత ఒక్కసారిగా దూసుకువచ్చింది. అదృష్టవశాత్తు బైక్‌పై వేగంగా వెళ్తుండటంతో అతడు త్రుటిలో తప్పించుకోగలిగాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఖాతాదారుల సొమ్ము 2.86 కోట్లు హాంఫట్

» ఇచ్ఛాపురం పోస్టాఫీసులో సిబ్బంది చేతివాటం
» 14 మంది పాత్ర... ఐదుగురు సస్పెన్షన్

ఇచ్ఛాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం హెడ్ పోస్టాఫీసులో భారీ అవినీతి చోటు చేసుకుంది. ఖాతాదారుల యూజర్ ఐడీలు ఉపయోగించి రూ.2.86కోట్లు దారి మళ్లించారు. ఈ నెల 7న ప్రజావినతుల విభాగానికి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన పోస్టల్ అధికారులు తనిఖీకి ఆదేశించారు. పోస్టల్ ప్రాంతీయ తనిఖీ అధికారులు ఎన్.శ్రీకాంత్, కమల్‌హాసన్ శుక్రవారం ఇచ్ఛాపురం వచ్చి, విచారణ జరిపారు. బాధితులతోనూ మాట్లాడారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 'ఇచ్ఛాపురం కేంద్రంగా తపాలశాఖలో భారీ అవినీతి జరిగింది. ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశాం. ఇచ్ఛాపురం హెడ్ పోస్టాఫీసులో 33మంది ఖాతాదారుల నుంచి రూ.2.86 కోట్లు మళ్లించినట్లు గుర్తించాం. ఇందులో 14 మంది సిబ్బంది పాత్ర ఉన్నట్టు గుర్తించాం. ప్రస్తుతం ఐదుగురిని సస్పెండ్ చేశాము. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని తెలిపారు.

ఇంటి దొంగల పాత్ర..

పోస్టాఫీసు ఖాతాదారుల యూజర్ ఐడీ పోస్టల్ సబ్ డివిజన్‌లో 14మంది అధికారుల వద్దే ఉంటుంది. వారిలో ఎవరో ఒకరు సైబర్ నేరస్థుడితో చేతులు కలపడం ద్వారానే స్కాం జరిగే అవకాశం ఉంది. యూజర్ ఐడీలు ఉపయోగించి రూ.2.86 కోట్లు ఆన్‌లైన్ ద్వారా ఇతర ఖాతాలకు పంపించినట్లు తెలుస్తోంది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఐదుగురు పోస్టల్ ఉద్యోగులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. దీంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది.

తాడేపల్లి గ్యాంగ్ రేప్ కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

» ఇప్పటికీ పరారీలోనే మొదటి నిందితుడు!

గుంటూరు(లీగల్), జూలై 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గ్యాంగ్ రేప్ కేసులో రెండో ముద్దాయి సీరు కృష్ణ కిశోర్‌కు 20ఏళ్ల జైలుశిక్ష, రూ.62వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. మాజీ సీఎం జగన్ ఇంటికి కూతవేటు దూరంలో జరిగిన ఈ ఘటన పెద్ద దుమారాన్ని రేపింది. ఈ కేసులో మొదటి ముద్దాయి ఇప్పటికీ పరారీలో ఉండడం గమనార్హం. వివరాలివీ.. విజయవాడ ఆస్పత్రిలో పనిచేసే ఓ నర్స్ రాత్రి డ్యూటీ ముగించుకొని 2021 జూన్ 19న రాత్రి 9 గంటల ప్రాంతంలో తన మిత్రుడితో కలిసి బైక్‌పై తాడేపల్లి సీతానగరం ఘాట్‌కు వచ్చి ఇసుక తిన్నెలపై కాసేపు గడిపారు. అక్కడ వారిని ప్రకాశం జిల్లా చిన్నగంజాంకు చెందిన(తాడేపల్లిలో నివాసం) రామలింగం ప్రసన్నరెడ్డి, సీరు కృష్ణ కిశోర్ బెదిరించి.. ఆమె మిత్రుడి కాళ్లూ చేతులు కట్టేశారు. ఆ యువతిపై సామూహిక అత్యాచారం చేశారు. 2021 ఆగస్టు 7న ఈ కేసులో రెండో నిందితుడైన కృష్ణ కిశోర్‌ను పోలీసులు అరెస్టు చేయగా విచారణలో ఈ నేరంతో పాటు.. తానూ, ప్రసన్నరెడ్డితో కలిసి ఎడ్లపల్లి ఆనందకుమార్ అనే వ్యక్తిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ప్రసన్న రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు చూపగా కోర్టులో కృష్ణకిశోర్‌పైనే విచారణ సాగింది. కాగా, తుది తీర్పులో.. నిందితుడికి వేసిన జరిమానా రూ.62వేలు బాధితురాలికి చెల్లించాలని, దీనితో పాటు అదనంగా మరో రూ.లక్ష ప్రభుత్వం నుంచి ఆమెకు అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కోర్టు ఆదేశించింది.

మా నేత తలరాతలు మారిస్తే..
జగన్ తలకాయలు తీస్తాడు: మంత్రి నిమ్మల



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఓ షాపులో ఇస్త్రీ చేస్తున్న నిమ్మల

తిరుపతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'బాధల్లో ఉన్న ప్రజల తలరాతలను మార్చేందుకు మా నాయకుడు చంద్రబాబు ప్రయత్నిస్తుంటే, తలకాయలను తీసే పనిలో జగన్ వున్నాడు' అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తిరుపతిలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన అంతా అరాచకం, కక్షలు, కేసులు, వేధింపులతో సాగితే కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛ, సంతోషాలతో ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. వైసీపీ వస్తే విచారణ లేకుండా లోపలేస్తామని పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అంటున్నారని, అంటే వైసీపీ నేతలు తమ కక్షలు, పగలు తీర్చుకోవడానికి, ప్రజలను వేధించడానికి మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారని మంత్రి నిమ్మల విమర్శించారు.

తప్పుడు మెయిల్స్ పెట్టిన వారిపై కేసులు: పయ్యావుల

బాపట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'పూర్వకాలంలో దేవతలు యజ్ఞం చేస్తుంటే రాక్షసులు దానిని చెడగొట్టడానికి ప్రయత్నాలు చేసేవారు. రాష్ట్రంలో వైసీపీ నేతల తీరు కూడా ఇలానే ఉంది. ప్రభుత్వానికి అప్పులు ఇవ్వొద్దని ఆ పార్టీ నేతలు దుర్మార్గంగా బ్యాంకులకు 200 ఈ మెయిల్స్ పెట్టారు. అన్నం తినేవాడు ఎవడయినా ఇలాంటి పనిచేస్తాడా? అక్కడ అప్పు పుట్టకుండా చేసి ఇక్కడ పొగాకు కొనడం లేదని దొంగ ఏడుపులు ఏడుస్తారు. రాష్ట్ర పరపతిని దెబ్బతీసే విధంగా ఈ మెయిల్స్ పెట్టిన వారిపై కేసులు పెడతాం' అని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బాపట్ల జిల్లా పర్చూరులో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పయ్యావుల పాల్గొన్నారు.

పీ4 మోడల్‌లో బీసీ హాస్టళ్ల అభివృద్ధి: సవిత

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీఎంచంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్‌లో రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లను అభివృద్ధి చేయనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దాతలు, ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద లబ్ధి పొంది ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థుల సాయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. 2016-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం కింద లబ్ధి పొందిన ఎందరో విద్యార్థులు నేడు అత్యున్నత స్థానాల్లో ఉండటం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఉన్నతస్థానాల్లో ఉన్న వారు వెనుకబడిన తరగతుల హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సాయమందించడానికి ముందుకు రావాలని కోరారు.

ఆయుష్‌లో 358 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ వైఖరికి భిన్నంగా రాష్ట్రంలో ఆయుష్ సేవలను విస్తృతం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ అన్నారు. ఇందులో భాగంగా ఈ విభాగంలో 71 మంది డాక్టర్లు, 26 మంది జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్లు, 90 మంది పంచకర్మ థెరపిస్టులు, ముగ్గురు సైకాలజిస్టులతో కలిపి మొత్తం 358 మందిని సత్వరమే నియమించడానికి శుక్రవారం ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'గత ప్రభుత్వం ఐదేళ్లలో ఆయుష్ సేవలపై కేవలం రూ.37 కోట్లే ఖర్చు చేసింది. నేను వ్యక్తిగతంగా కేంద్రానికి విన్నవించడంతో 2024-25 ఏడాదికి కేంద్ర రూ. 83 కోట్లు మంజూరు చేసింది. 2025-26 ఏడాదికి రాష్ట్రంలో ఆయుష్ మిషన్ కింద రూ.250 కోట్ల మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. సిబ్బందిని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎంపిక చేస్తారు' అని తెలిపారు.

770 కోట్లతో 998 ఆలయాల అభివృద్ధి: ఆనం

గార, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.770 కోట్ల వ్యయంతో 998 దేవాలయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలో శుక్రవారం జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం'లో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'గత ప్రభుత్వం దేవాలయ వ్యవస్థను నిర్లక్ష్యం చేసింది. మా ప్రభుత్వం వచ్చాక పటిష్ఠం చేస్తున్నాం. శ్రీకూర్మం, అరసవల్లి పుణ్యక్షేత్రాలను అభివద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది' అని అన్నారు.

మద్యంలో కోట్లు కొల్లగొట్టారు: మంత్రి జనార్దన్

మాచర్ల టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో జగన్‌రెడ్డి అండ్ కో రూ.వేల కోట్లు కొల్లగొట్టారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మాచర్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల్లో పాల్గొన్న ఆయన... వెల్దుర్తిలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబుని అక్రమ కేసుల్లో జైల్లో ఉంచినప్పుడు లేవని నోళ్లు... మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిన మిథున్‌రెడ్డి జైలుకు పోతే ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నాయి? కూటమి సుపరిపాలనలో సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు జరుగుతుంటే వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారు' అని అన్నారు.

ఆర్టీసీ భూముల కేటాయింపుల్లో
అక్రమాలపై విచారణ: రాంప్రసాద్‌రెడ్డి

బాపట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'పీపీపీ పద్ధతిలో ఆర్టీసీ భూముల కేటాయింపులో అక్రమాలు ఉంటే ఆ భూములను వెనక్కి తీసుకుంటాం' అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం బాపట్ల విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలసి ఆర్టీసీ డిపోలో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో ఆర్టీసీ భూములు ఎవరెవరికి కట్టబెట్టారో తెలుసుకునేందుకు విచారణ చేపట్టాం. ఆడుదాం ఆంధ్రపై విజిలెన్స్ విచారణ నివేదిక 15 రోజుల్లో వస్తుంది' అని మంత్రి పేర్కొన్నారు.

లిక్కర్ స్కామ్ వెలికితీతలో 'కూటమి' కృషి అద్భుతం

- ప్రధాని విజయాలపై 'సారథ్యం' పేరుతో ప్రజల్లోకి: మాధవ్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్‌ను వెలికి తీయడంలో కూటమి ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోంది. ఈ కుంభకోణంలోని ప్రతి ఒక్కరినీ జైలుకు పంపి తీరాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో 'సారథ్యం' పోస్టర్‌ను విడుదలచేసి మాట్లాడారు. 'నాలుగు వేల రోజులకు పైగా దేశానికి సారథ్యం వహించిన నరేంద్ర మోదీ భారత్‌ను గ్లోబల్ ఫోర్స్‌గా తీర్చిదిద్దారు. ఆయన హయాంలో దేశం సాధించిన విజయాలను కడప నుంచి ఈ నెల 27న 'సారథ్యం' పేరుతో ప్రజల్లోకి తీసుకెళ్లనున్నాం.' అని మాధవ్ పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనకు సుప్రీం నో

- అసెంబ్లీ సీట్లు పెంచాలన్న పిటిషన్ తిరస్కరణ



న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2022లో పునర్విభజన జరిగిన జమ్ము కశ్మీర్‌తో సమానంగా ఏపీ, తెలంగాణను పరిగణించాలంటూ కె.పురుషోత్తమ్‌రెడ్డి చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ మూడో అధ్యాయం కిందకు జమ్ము కశ్మీర్ రాదని, ఆ రాష్ట్రంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను పోల్చలేమని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్ అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణలో పునర్విభజన చేపడితే.. మిగిలిన అన్ని రాష్ట్రాల నుంచీ అవే డిమాండ్లు వస్తాయన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్లను పెంచాలని పిటిషనర్ కోర్టు తలుపు తట్టారు. అయితే.. రాజ్యాంగంలోని 170వ అధికరణకు లోబడి పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తు చేసింది. 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన జరిగేంత వరకూ అసెంబ్లీల సీట్ల సర్దుబాటు చేయాల్సిన అవసరం లేదని 170(3) స్పష్టం చేస్తోందని పేర్కొంది. విస్తృత రాజ్యాంగ ప్రణాళిక ప్రకారమే పునర్విభజన తప్పనిసరిగా చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము కశ్మీర్‌కు ఆర్టికల్ 170 వర్తించదని, 239(ఏ) వర్తిస్తుందని వివరించింది. ఈ రాష్ట్రానికి సంబంధించి పార్లమెంట్ చట్టాలు చేయాల్సి ఉందని గుర్తు చేసింది. ఏపీ, తెలంగాణలో పునర్విభజన చట్టానికి అనుగుణంగా నియోజకవర్గాల సంఖ్యను పెంచాలన్న అభ్యర్థన న్యాయ సమ్మతమే అయినా.. రాజ్యాంగ ప్రణాళికకు అనుగుణంగానే ఈ విభజన జరగాల్సి ఉంటుందన్న కేంద్ర ప్రభుత్వ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా విభజన చట్టాన్ని పరిగణించలేమని స్పష్టం చేసింది.

పీ4లో నేను సైతం!



పీ4 బ్యాడ్జీతో సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

దోహదపడుతుందని సీఎం అన్నారు. పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోందని, పేద కుటుంబాల సాధికరతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని సీఎం నిర్దేశించారు. ప్రవాసాంధ్రులను భాగస్వామ్యం చేసేందుకు ఏపీ ఎన్ఆర్‌టీ సాయం తీసుకోవాలని చెప్పారు. అలాగే కార్పొరేట్ సంస్థలు దీనికి కలిసి వచ్చేలా చూడటంతో పాటు వారితో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ఒకవేళ స్థానికంగా మార్గదర్శులు లేకపోతే అప్పుడు స్థానికేతరులను అనుసంధానం చేయాలని తెలిపారు. 'పీ4లో భాగస్వాములయ్యేందుకు రాష్ట్ర స్థాయిలో దాతలు ముందుకొస్తే, వారిచ్చే నిధుల కోసం కామన్ ఫండ్ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా బంగారు కుటుంబాలకు సాయం అందించవచ్చని పేర్కొన్నారు. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్టు



పీ4 సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికారులు

10లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 'మార్గదర్శులు అందించే ఆర్థిక, ఆర్థికేతర సాయంపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వివరాలు సక్రమంగా నమోదు చేసినప్పుడే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది' అని సూచించారు.

15 లక్షల బంగారు కుటుంబాల దత్తతే లక్ష్యం

ఆగస్టు 15 న ఉంచి పీ4 మొదటి విడత ప్రారంభమవుతుందన్నారు. ఆ రోజుకు 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా, 57,503 మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని.. మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో 2 లక్షల మంది మార్గదర్శుల అవసరముందని అధికారులు సీఎంకు వివరించారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని... విశాఖపట్నం జిల్లా ఈ విషయంలో చివరన ఉందని వెల్లడించారు. సోషల్ మీడియా, ఇతర మధ్యమాల ద్వారా పీ4 కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తలపెట్టిన డిజిటల్ ప్రమోషన్ కార్యకలాపాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

పీ4 భాగస్వాములు మరింత కీలకంగా ఉండాలి

మూడు విధానాల్లో జీరో పావర్టీ పీ4 అమలు జరుగుతోంది. బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకోవడం, వారికి ఆర్థికేతర సాయాన్ని అందించడం మొదటి విధానం. దీనికి కాలపరిమితి అంటూ ఏమీ ఉండదు. రెండో విధానంలో ఫండ్ ఏ నీడ్. దీని కింద ఎవరికైతే ఆర్థిక అవసరాలు ఉంటాయో వారికి నగదు సాయం అందించేలా కార్యాచరణ రూపొందించారు. దీనికి కాలపరిమితి ఉంటుంది. మూడో విధానంలో గ్రామాలను, మండలాలను దత్తత తీసుకోవడం.. ఒక ప్రాంతంలో, ఒక ఊరిలో కమ్యూనిటీ అవసరాలు తీర్చడం, అక్కడ అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేలా చూడడం ఉంటాయి. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి ఈ మూడో విధానం అమలు చేయాలని నిర్ణయించారు. మరోవైపు పీ4కి భాగస్వాములుగా వ్యవహరిస్తున్న కేపీఎంజీ, మిలాప్, తమ్మడ, భవ్య, భార్గో, ప్రాజెక్ట్ డీప్ సంస్థలు మరింత కీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఒక బంగారు కుటుంబానికి అవసరమైతే ఒకరికి మించి మార్గదర్శులు సాయం అందించేలా చూడాలన్నారు.

నేటి బంగారు కుటుంబాలే రేపటి మార్గదర్శులు

సమాజంలో పేద ధనికుల మధ్య అంతరాలు తగ్గించే పీ4 వంటి కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదని సీఎం అన్నారు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేసినట్లే... ఇప్పుడు పేదలను ఆదుకునేందుకు పీ4 తీసుకున్నామని ఆయన చెప్పారు. గురువారం సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐయామ్ మార్గదర్శి పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఇవాల్టి బంగారు కుటుంబాలు రేపటి మార్గదర్శులుగా ఎదగాలన్నదే తన ఆలోచన అని చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాల అభివృద్ధికి ఏం చేస్తున్నామనే విషయాన్ని వివరించేందుకు ప్రతి ఫ్యామిలీకీ ఓ విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నామని చెప్పారు. స్వల, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా వారి అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సీఎం స్ఫూర్తితో తాను కూడా ఐదు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ ప్రకటించారు. షాజహాన్‌ను సీఎం అభినందించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ తరహా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తామని ప్రజాప్రతినిధులు సీఎంకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, స్వర్ణాంధ్ర ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, ప్రణాళికా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు సింగపూర్‌కు చంద్రబాబు

సింగపూర్‌తో సంబంధాల పునరుద్ధరణ, రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం ఆ దేశంలో పర్యటించనుంది. శనివారం సింగపూర్ బయలుదేరుతున్న సీఎం నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం ఆరు రోజులపాటు అక్కడ పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ప్రముఖ సంస్థల యాజమాన్యాలు, పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు బృందం సమావేశమవుతుంది. నవంబరులో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు పర్యటనను వేదికగా చేసుకోనున్నారు.

అనంతబాబుకు ఝలక్

- ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరణ
- తదుపరి దర్యాప్తుతో ఆయనకు ఎలాంటి హానీ జరగదు
- ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై స్టే విధించలేం: న్యాయమూర్తి

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యవహారంలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతిస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఈ నెల 22న ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి న్యాయస్థానం నిరాకరించింది. ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై స్టే విధించలేమని తేల్చిచెప్పింది. తదుపరి దర్యాప్తునకు మాత్రమే ట్రయల్ కోర్టు అనుమతి ఇచ్చిందని గుర్తు చేసింది. అనంతబాబు ఇప్పటికే కేసులో నిందితుడిగా ఉన్నాడని, తదుపరి దర్యాప్తు వల్ల ఆయనకు ఎలాంటి హానీ జరుగదని స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తు పేరుతో పోలీసులు కేసును పునర్విచారణ చేయబోతున్నారని అనంతబాబు తరఫు సీనియర్ న్యాయవాది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై స్పష్టత ఇస్తూ ఆదేశాలిస్తామని మౌఖికంగా తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2022 మే 19న కాకినాడకు చెందిన దళిత యువకుడు, తన డ్రైవర్ అయిన సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు.. అతడి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన విషయం తెలిసిందే. తన కుమారుడి మృతదేహంపై 33 గాయాలు ఉన్నాయని.. ఈ కేసులో అనంతబాబును మాత్రమే నిందితుడిగా చేర్చారని, హత్యలో మరికొందరి పాత్ర కూడా ఉందంటూ సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నం డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. దర్యాప్తు అధికారి (ఐవో) సైతం కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి.. ఇందుకు అనుమతి ఇచ్చారు.



దీంతో ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ అనంతబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా అనంతబాబు తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. ఈ కేసు దర్యాప్తును పూర్తి చేసి 2022 ఆగస్టు 30న చార్జిషీటు కూడా దాఖలు చేశారని తెలిపారు. మృతుడి తల్లి సందేహాలు వ్యక్తం చేయడంతో హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు లోతైన విచారణ జరిపారని.. కాల్ డేటాను విశ్లేషించారని. సీసీటీవీని పరిశీలించారని.. గన్‌మెన్ వాంగ్మూలాలనూ నమోదు చేశారని వెల్లడించారు. 2023 ఏప్రిల్‌లో అనుబంధ చార్జిషీటు దాఖలు చేశారని తెలిపారు. కొత్త అంశాలు, ఆధారాలు వెలుగులోకి రాకుండా తదుపరి దర్యాప్తునకు ఆదేశించడానికి వీల్లేదన్నారు. ఈ పేరుతో అమాయకులను నిందితులుగా చేరుస్తారనే ఆందోళన ఉందన్నారు. ఇప్పటికే విచారించిన సాక్షుల నుంచి మళ్లీ వాంగ్మూలాలు నమోదు చేసే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వాటికి అనుమతిస్తే ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాత కేసులను మళ్లీ దర్యాప్తు చేస్తుంటారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

ఆ అర్హత అనంతబాబుకు లేదు..: ఏజీ

పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేసే అర్హత అనంతబాబుకు లేదన్నారు. 'కేసు డైరీని పరిశీలించాక.. మరికొందరు సాక్షులను విచారించాల్సిన అవసరం ఉందని దర్యాప్తు అధికారి నిర్ణయానికి వచ్చారు. అనుమతి కోరుతూ ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశారు. వాస్తవానికి సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం కేసు తదుపరి దర్యాప్తు కోసం మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు. అయితే కేసును ప్రొఫెషనల్‌గా విచారించాలనే ఉద్దేశంతోనే తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ ఐవో పిటిషన్ వేశారు. అన్ని అంశాలూ పరిశీలించాకే ట్రయల్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ దశలో నిందితుడి వాదనలు వినాల్సిన అవసరం లేదు' అని పేర్కొన్నారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. కేసు దర్యాప్తు అధికారిగా ఏఎస్పీ స్థాయి యువ ఐపీఎస్ అధికారి వ్యవహరిస్తున్నారని, ఆయనకు పదోన్నతి లభిస్తే దర్యాప్తు పురోగతిపై ప్రభావం పడుతుందని.. అనుభవజ్ఞుడైన సీనియర్ డీఎస్పీని ఐవోగా నియమిస్తే మంచిదని సూచించారు. కోర్టు సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని ఏజీ తెలిపారు.

శ్రీలక్ష్మికి షాక్!



(మొదటి పేజీ తరువాయి)

జరగలేదు. హైకోర్టు ఊరట కల్పించడంపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తీర్పును కొట్టేసింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై మళ్లీ విచారణ చేపట్టి, మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. శ్రీలక్ష్మి తరఫున వివేక్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ఓఎంసీకి లీజుల కేటాయింపునకు సంబంధించి నేను పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే నాటికే నాకంటే ముందున్న కార్యదర్శి, ఆ శాఖ మంత్రి నిర్ణయాలు తీసేసుకున్నారు. నేను 2006 మే 17న బాధ్యతలు తీసుకున్నా. నాకంటే ముందున్న కార్యదర్శి కృపానందం, మంత్రి సబితాఇంద్రారెడ్డి ఓఎంసీకి లీజు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నేను వచ్చిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేశారు. లీజు జీవోలో క్యాప్టివ్ మైనింగ్ అనే పదం కావాలనే పెట్టలేదని సీబీఐ ఆరోపిస్తోంది. అసలు క్యాప్టివ్ మైనింగ్ అనే షరతు విధించరాదని కేంద్రమే ఆదేశాలు జారీచేసింది. నేను రాక ముందే అన్నీ జరిగిపోయాయి. నా కంటే ముందే ఉన్న కార్యదర్శి, అప్పటి మంత్రి నిర్దోషులుగా తేలిన తర్వాత నా పాత్రను ఎలా తప్పుబడతారు?" అని ప్రశ్నించారు. సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 'మంత్రి అనుమతి లేకుండా శ్రీలక్ష్మి కేంద్రానికి లేఖలు రాశారు. ఓఎంసీకి గనుల కేటాయింపునకు ముందస్తు అనుమతి ఇవ్వాలని.. అలా ఇచ్చాక కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తామని లేఖలో తెలిపారు. ఓఎంసీకి అనుకూలంగా వ్యవహరించినట్లు ఆధారాలున్నాయి. తాను బాధ్యతలు తీసుకోకముందే అన్ని నిర్ణయాలు జరిగాయని శ్రీలక్ష్మి పదేపదే చెబుతున్నారు. కానీ, ఆ నిర్ణయాలేవీ అమలు కాలేదు. ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న నిర్ణయాలే అమలయ్యాయి' అని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. మైనింగ్ లీజులు, క్యాప్టివ్ మైనింగ్ వంటివన్నీ వివాదాస్పద అంశాలని.. అవన్నీ పూర్తిస్థాయి విచారణలోనే తేలతాయని పేర్కొంది. ప్రస్తుత క్రిమినల్ రివిజన్ పిటిషన్‌లో ఇటు పిటిషనర్, అటు సీబీఐ చెబుతున్న విషయాలన్నీ వాస్తవమా? కాదా? అని హైకోర్టు నిర్ణయించలేదని స్పష్టంచేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పాత్ర ఏంటనేది విచారణలోనే తేలుతుందని.. ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

నీట్ విద్యార్థిని మృతిపై సీబీఐ విచారణ

- అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హయాంలో నీట్ విద్యార్థిని మృతి చెందిన ఘటనపై సీబీఐ విచారణకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మైనర్ బాలిక విశాఖలోని ఆకాశ్ బైజూస్ ఇన్‌స్టిట్యూట్‌లో నీట్ కోచింగ్ కోసం చేరింది. 2023 జూలైలో హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కింద పడి మరణించింది. దీనిపై ఆమె తండ్రి సుఖ్‌దేబ్ సాహా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుల దర్యాప్తులో అక్రమాలు జరిగాయని, సీసీ ఫుటేజీ దాచిపెట్టారని, వైద్యుల నిర్లక్ష్యంతో తన కుమార్తె మరణించిందని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలుచేశారు. ఆ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీన్ని సుఖ్‌దేబ్ గతేడాది ఏప్రిల్ 22న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తుది తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన ధర్మాసనం, సీబీఐ విచారణకు ఆదేశించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మానసిక ఆరోగ్యం అనేది ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో అంతర్భాగమని గుర్తుచేసింది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏకీకృత చట్టపరమైన చట్రం లేదని, కోటా, హైదరాబాద్, ఢిల్లీ, విశాఖపట్నం వంటి కోచింగ్ సెంటర్లు అధికంగా ఉండే నగరాల్లో ఈ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, తక్షణ మధ్యంతర రక్షణ అవసరమని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా దేశంలోని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లకు సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ర్యాంకుల కోసం విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచడం సరికాదు. కోచింగ్ సెంటర్లలో మానసిక నిపుణులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. విద్యార్థి, కౌన్సెలర్ నిష్పత్తులు సరైన స్థాయిలో ఉండేలా చూసుకోవాలి వంటి పలు నిబంధనలు మార్గదర్శకాల్లో ఉన్నాయి.

అధికారంలో ఉండగానే కులగణన చేయాల్సింది

కాంగ్రెస్ బీసీ నేతల సమ్మేళనంలో రాహుల్



న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కులగణన దేశ రాజకీయాలను కుదిపేసేంత కీలకమైనదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇప్పుడు దేశమంతా తెలంగాణ నమూనా గురించే చర్చిస్తోందన్నారు. కుల గణన తర్వాత రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన భాగీదార్ న్యాయ సమ్మేళనంలో ప్రసంగించారు. తాను ఓబీసీ వర్గాలను అర్థం చేసుకోవడం ఆలస్యమైందని అంగీకరించారు. తప్పు చేశానని, 15 ఏళ్ల క్రితమే అధికారంలో ఉండగా కులగణన చేసి ఉండాల్సిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఓబీసీల సమస్యలను లోతుగా అవగాహన చేసుకోలేకపోయానన్నారు. అప్పుడు చేయలేక పోయినందుకు ఇప్పుడు రెట్టింపు వేగంతో చేయబోతున్నానని ప్రకటించారు. తెలంగాణ కులగణన గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉన్న డేటాకు దేశంలో ఎక్కడా ఎదురు లేదని చెప్పారు. దేశ బ్యూరోక్రసీలో అణగారిన, బలహీన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. 'దేశ జనాభాలో దళితులు, ఓబీసీలు, గిరిజనులు, మైనారిటీలంతా కలిపి 90% మంది ఉంటారు. అయితే బడ్జెట్‌లో హల్వా పంచేటప్పుడు.. (అంటే కేటాయింపులు చేసేటప్పుడు) ఈ 90 శాతం మందికి ఏమీ లేదు. దేశ ఉత్పాదక శక్తిలో 90 శాతం వీరే కదా! హల్వా తయారుచేసేది మీరే. కానీ తింటున్నదేమో వాళ్లు. వాళ్లు తినకూడదని చెప్పడం లేదు. కానీ మీకు కనీసం కొంచెమైనా దక్కాలి కదా' అని అన్నారు. ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి చెరిపేసే ప్రయత్నంలో ఉన్నాయని చెప్పారు. జనాభాలో 55-60 శాతం ఉన్న ఓబీసీల చరిత్రను కావాలనే చెరిపేశారనే విషయం తెలిసిన రోజు ఓబీసీల అసలు శత్రువు ఆర్ఎస్ఎస్ అని తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

దమ్ములేని మోదీ!

ప్రధాని మోదీదంతా ప్రదర్శన మాత్రమేనని.. ఆయనలో సరుకేమీ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. 2-3 సార్లు ఆయనతో సమావేశమయ్యాక ఆయనలో దమ్ములేదని తెలుసుకున్నానని చెప్పారు. మీడియా ఆయన ఇమేజ్‌ను అతిగా పెంచేసిందని ఆక్షేపించారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ విరుచుకుపడ్డారు. 'ఎత్తిపొడుపులకేం తక్కువ లేదు.. కానీ దాని వెనుక ఆయన కపటత్వమే ఎక్కువగా ఉంది' అని విమర్శించారు. రాహుల్ కులమేంటని పరోక్షంగా ప్రశ్నిస్తూ.. 'కేథలిక్ తల్లి, పార్సీ తండ్రికి పుట్టిన కొడుకు ప్రతి ఒక్కరి కులం గురించి అడుగుతూ ఉంటే ఇలాంటివే జరుగుతాయి' అని ఎద్దేవాచేశారు.

మరో 25 సీట్లు వచ్చి ఉంటే..

మోదీ అబద్ధాల కోరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా లేరని చెప్పారు. 'మోదీ అబద్ధాలకు సర్దార్. చివరికి.. పార్లమెంటులోనూ అసత్యాలే. అబద్ధాలు చెప్పే ప్రధాని సమాజానికి మంచి చేయలేరు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరో 25 సీట్లు ఎక్కువ వస్తే మోదీ అదృష్టం తిరగబడేది" అని అన్నారు.

నేహారెడ్డి అక్రమ నిర్మాణాల పరిశీలన

» భీమిలి బీచ్‌లో పర్యటించిన కమిటీ.. త్వరలో హైకోర్టుకు నివేదిక


భీమిలి బీచ్‌లో కమిటీ సభ్యులు

విశాఖపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి చేపట్టిన అక్రమ నిర్మాణాలతో పర్యావరణ నష్టంపై అంచనా వేసేందుకు నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. శుక్రవారం బీచ్‌లో పర్యటించిన బృందం ఆ అక్రమ నిర్మాణాలు, తొలగించిన ప్రాంతాలను పరిశీలించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎం.శ్రీరామకృష్ణ, తీర ప్రాంత నిర్వహణ సంస్థ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వీవీఎస్ శర్మ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పీవీ ముకుందరావు, కేంద్ర పర్యావరణ విభాగం శాస్త్రవేత్త దుప్పల సౌమ్య, అదే శాఖకు చెందిన శాస్త్రవేత్త సీహెచ్ మురళీకృష్ణ ఈ బృందంలో ఉన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో పిటిషన్ వేసిన మూర్తి యాదవ్ నుంచి వివరాలు సేకరించారు. సమగ్ర సమాచారంతో పర్యావరణ నష్టాన్ని అంచనా వేసి, దానికి ఎంత మొత్తం వసూలు చేయాలో సూచిస్తూ హైకోర్టుకు నివేదిక సమర్పించనున్నారు. కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ముందస్తు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ కొన్నాళ్ల కిందట హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ)ని ఆదేశించింది. అక్రమ నిర్మాణాల ఫలితంగా తీరప్రాంత పర్యావరణానికి ఏమేరకు నష్టం వాటిల్లిందో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రత్యేక కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో పర్యావరణానికి నష్టం చేకూర్చారంటూ నేహారెడ్డి, ఆమె భర్త రోహిత్‌రెడ్డి, అవ్యాన్ రియల్టర్స్‌పై భీమిలి పోలీస్ స్టేషన్‌లో పీసీబీ అధికారులు కేసు పెట్టారు.

ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్16

» 30న 'నిసార్' ఉపగ్రహ ప్రయోగానికి సన్నాహాలు

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగ ఏర్పాట్లలో షార్‌లో శాస్త్రవేత్తలు బిజీగా ఉన్నారు. ఈనెల 30న తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ప్రయోగించే ఈ రాకెట్ ద్వారా 'నిసార్' ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు. 2,392 కిలోల బరువుండే ఈ శాటిలైట్‌ను నాసా-ఇస్రో సంయుక్తంగా రూపొందించాయి. వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్)లో మూడు దశల అనుసంధాన పనులు పూర్తి చేసుకున్న జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్‌ను రెండో ప్రయోగ వేదికకు తరలించారు. అక్కడ రాకెట్‌కు శాస్త్రవేత్తలు శుక్రవారం అన్ని దశల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి, గ్లోబల్ తనిఖీలు చేసి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం రిహార్సల్, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ సంసిద్ధత సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నారు.

మోదీ ఓ కేడీ..: షర్మిల



అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి హోదాను ఇస్తానని మోసం చేసిన ప్రధాని మోదీ ఓ కేడీ అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. శుక్రవారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. విభజన హక్కుల సాధనకు రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో ఎందుకు కొట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని జగన్ దోచుకుతిన్నాడని తెలిసీ హామీలు ఇచ్చిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఆర్థికం దివాలా తీసిందంటూ హామీల అమలును వాయిదాలు వేయడాన్ని షర్మిల తప్పుపట్టారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడని నిలదీశారు.

నా ఫ్లాట్‌లో డబ్బు దాచేవారు

» వైసీపీ ఓడిపోగానే తీసుకెళ్లారు

» తర్వాత నన్ను దుబాయ్ పంపారు

» లిక్కర్ స్కామ్ గురించి నాకు తెలీదు

» రాజ్ కసిరెడ్డి ఈవీ డిజైన్ కోసం ఇంజనీర్‌గా పనిచేశా

» సిట్ విచారణలో ఏ-47 బెహ్రాన్ షాజిల్ షేక్



అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక నా దగ్గర పెట్టిన డబ్బులు తీసుకున్నారు. నన్ను దుబాయ్‌కి వెళ్లిపొమ్మన్నారు. అక్కడే ఉద్యోగం చేసుకుంటున్నా. నాకు లిక్కర్ స్కామ్‌తో సంబంధం లేదు. రాజ్ కసిరెడ్డి మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు సిద్ధం చేసిన ఎలక్ట్రిక్ వాహన డిజైన్‌లో పనిచేసిన ఇంజనీర్‌ను మాత్రమే' అని సిట్ అధికారులకు లిక్కర్ స్కామ్ నిందితుడు బెహ్రాన్ షాజిల్ షేక్(ఏ-47) చెప్పినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి(ఏ-1) ప్రణాళిక అమలు కోసం నియమించుకున్న విద్యావంతులైన యువకుల్లో షాజిల్ షేక్ ఒకడు. నెల్లూరు జిల్లాకు చెందిన షాజిల్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ కంట్లో పడ్డాడు. లిక్కర్ స్కామ్‌లో వసూలు చేసిన కమీషన్ల నుంచి రాజ్ కసిరెడ్డి కొంత నొక్కేశాడు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులతో పాటు విదేశాల్లో వ్యాపారాలు ప్రారంభించాడు. మరోవైపు మనదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రికల్ ఆటో రంగంలోకి ప్రవేశిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఈవీ వాహనాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. ఐప్యాక్ బృందంలోని కీలక వ్యక్తి భార్యను సీఈవోగా నియమించి ఈవీ బ్యాటరీ, వాహన డిజైన్‌తో పాటు కేంద్ర రవాణ మంత్రిత్వ శాఖ అనుమతులన్నీ పొందాడు. అందుకు భారీగా సొమ్ము ఖర్చు చేసిన రాజ్ కసిరెడ్డి లిక్కర్ ముడుపుల నుంచి నగదు రూపంలో ఎప్పటికప్పుడు ఈవీ వాహన ఆర్ అండ్ డీ కోసం వినియోగించాడు. డిజైన్ రూపకల్పనలో ఇంజనీర్‌గా పనిచేసిన బెహ్రాన్ షాజిల్ ఎన్నికల ముందు వరకూ హైదరాబాద్‌లో ఉన్నాడు. నమ్మకస్తుడిగా ఉండటంతో రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ సభ్యులు లిక్కర్ ముడుపులను అప్పుడప్పుడు అట్ట పెట్టెల్లో తెచ్చి బెహ్రాన్ ఫ్లాట్‌లో పెట్టేవారు. ఈవీ అవసరాల కోసం కొంత ఇచ్చి, మిగతా సొమ్ము తీసుకెళ్లేవారు. సిట్ అధునాతన టెక్నాలజీ సాయం తో మొత్తం మూలాలు వెలికి తీస్తోంది. మద్యం ముడుపుల వసూలు నిందితులు పలుమార్లు హైదరాబాద్‌లోని బెహ్రాన్ ఫ్లాట్‌కు వెళ్లినట్లు విచారణలో గుర్తించింది. కూపీ లాగడంతో అక్కడ ముడుపుల సొమ్ము భద్రపరిచే వారని తేలింది. దీంతో బెహ్రాన్ షేక్‌ను లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా చేర్చింది. సిట్ అతని ఆచూకీ కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. దుబాయ్‌లో ఉంటున్నట్లు తెలుసుకుని విచారణకు రమ్మని పిలవడంతో శుక్రవారం విజయవాడలోని సిట్ కార్యాలయానికి వచ్చాడు. లిక్కర్ స్కామ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, రాజ్ కసిరెడ్డి ఈవీ వాహనం కోసమే పని చేశానని చెప్పిన బెహ్రాన్ అందుకు సంబంధించిన ఆధారాలు కూడా సిట్ అధికారులకు అందజేసినట్లు తెలిసింది. స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న సిట్ అధికారులు తమకు అందుబాటులో ఉండాలని చెప్పి పంపినట్లు సమాచారం. అయితే తన కుటుంబం దుబాయ్‌లో ఉంటోందని, ఈ స్కామ్‌లో తాను చిక్కుకుంటానని అనుకోలేదంటూ నిందితుడు వాపోయినట్లు తెలిసింది.

పాత్రధారులైపోయారు... ఇక సూత్రధారుల వంతు

» ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారు: మంత్రి సత్యకుమార్



విజయవాడ(గాంధీనగర్), జూలై 25(ఆంధ్రజ్యోతి): 'లిక్కర్ స్కామ్‌లో పాత్రధారులు అయిపోయారు. ఇక సూత్రధారుల వంతు రాబోతుంది' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రపంచంలోనే ఇది అతిపెద్ద స్కామ్. ప్రజాధనం దోచుకోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారు. కల్తీ మద్యం తాగి వేలాది మంది మంచాన పడ్డారు. చీప్ లిక్కర్ తాగి కిడ్నీలు చెడిపోయిన వారి సంఖ్య 91 వేలకు, లివర్ పాడైన వారి సంఖ్య 14 వేల నుంచి 20 వేలకు, పక్షవాతం కేసులు 7,700లకు చేరాయి. ఈ స్కామ్ దర్యాప్తును దారి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు. గతంలో వైసీపీ నేత కేతిరెడ్డి ఉదయం తిరిగి సాయంత్రం ఖాళీ స్థలాలను కబ్జాలు చేసేవాడు. ఇప్పుడు ఆ అవకాశం లేక అమరావతిపై వ్యాఖ్యలు చేస్తున్నాడు' అని మంత్రి అన్నారు.

3 గంటలు.. 40 ప్రశ్నలు

» ఎమ్మెల్యే ప్రశాంతిపై వ్యాఖ్యల కేసులో ప్రసన్నను విచారించిన పోలీసులు

» అన్నిటికీ రాతపూర్వక సమాధానాలు

» నేడు విచారణకు మాజీ మంత్రి అనిల్?

నెల్లూరు (క్రైం), జూలై 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. శుక్రవారం నెల్లూరులోని రూరల్ డీఎస్పీ కార్యాలయానికి న్యాయవాదులతో కలిసి వచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆయన్ను విచారించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విచారణ సాగింది. డీఎస్పీ 40 ప్రశ్నలు సంధించారు. అన్నిటికీ ఆయన రాతపూర్వకంగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం బయటకు వచ్చిన ప్రసన్న మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, వీటిపై కేసులు పెట్టుకుంటూ పోతే కోర్టు హాలులు, జైళ్లు పట్టవన్నారు. కోవూరు సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు మరో నలుగురు నవ్వారని కేసులు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఐదుగురు కూడా విచారణకు హాజరవుతారన్నారు. తమకు రెడ్‌బుక్ అవసరం లేదని, బ్రెయిన్‌లోనే కంప్యూటర్ ఉందని, ఇప్పుడు ఇబ్బందులు పెడుతున్న వారందరినీ గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు. కాగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను శనివారం పోలీసులు విచారించనున్నారు. రుస్తుం మైన్స్ కేసులో అనిల్ ప్రమేయం ఉందంటూ బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో ఆయన ప్రధాన అనుచరులు రాష్ట్రం విడిచి వెళ్లారన్న ప్రచారం నడుస్తోంది. ఈ క్రమంలో విచారణకు అనిల్ హాజరవుతారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.


న్యాయవాదితో కలిసి నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలోకి వెళుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

మిథున్‌రెడ్డికి ఇంటి భోజనం అనుమతించలేం!

» సహాయకుడిని ఏర్పాటు చేయలేం

» ఏసీబీ కోర్టులో జైలు అధికారుల పిటిషన్

» విచారణ 29కి వాయిదా

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి కోర్టు కల్పించిన సదుపాయాలపై జైలు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించలేమని, సహాయకుడిని ఏర్పాటు చేయలేమని విజయవాడ ఏసీబీ కోర్టుకు తెలుపుతూ పిటిషన్ దాఖలు చేశారు. సాధారణ ఖైదీలకు ఇస్తున్న ములాఖత్‌లకు మించి ఆయనకు ఇవ్వలేమని తెలిపారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. జైలు అధికారుల అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలని మిథున్‌రెడ్డి తరఫు న్యాయవాదులకు కోర్టు నోటీసులు జారీచేసింది. విచారణను 29వ తేదీకి వాయిదా వేసింది.

పెద్దిరెడ్డి గన్‌మన్ సస్పెన్షన్

» మిథున్‌రెడ్డికి భోజనం, దిండు మోసుకెళ్లినట్లు అభియోగం

చిత్తూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మన్ కాలేషాను ఎస్పీ మణికంఠ శుక్రవారం సస్పెండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నెల 23న ములాఖత్‌లో కలిశారు. పెద్దిరెడ్డి జైలు లోపలికి వెళ్లేటప్పుడు, ఆయన వెంట కాలేషా ఉన్నారు. మిథున్ రెడ్డి కోసం భోజనం బ్యాగును, తలదిండును కాలేషా మోసుకుంటూ పెద్దిరెడ్డి వెంట వెళ్తున్నట్లు వీడియోలో రికార్డయింది. ఇది వైరల్‌గా మారడంతో అతడిని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

ముప్పిడి అవినాశ్ సహా ఆ 12 మంది అరెస్టుకు వారెంట్ ఇవ్వండి

» లిక్కర్ స్కామ్ కేసులో సిట్ పిటిషన్

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో మరో 12 మందిని అరెస్టు చేయడానికి వారెంట్ జారీచేయాలని కోరుతూ సిట్ అధికారులు శుక్రవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌కు చెందిన ముప్పిడి అవినాశ్‌రెడ్డి ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డికి తోడల్లుడు. అవినాశ్ సోదరుడు అనిరుధ్‌రెడ్డి, తిరుపతి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తుకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన ఎస్కే సైఫ్ అహ్మద్, పురుషోత్తం, బొల్లారం శివకుమార్, సైమన్ ప్రసన్, రాజీవ్ ప్రతాప్, కొమ్మారెడ్డి అవినాశ్ రెడ్డి, మోహన్‌కుమార్, అనిల్‌కుమార్ రెడ్డి, సుజల్ బెహ్రాన్‌పై వారెంట్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై దర్యాప్తు సమాచారాన్ని ఇవ్వాలని సిట్ అధికారులను కోర్టు ఆదేశిస్తూ.. విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు మద్యం కేసులో నిందితులుగా ఉన్న డి.వాసుదేవరెడ్డి (ఏ2), సత్యప్రసాద్ (ఏ3) ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది. వైసీపీ ప్రభుత్వంలో బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి, ప్రత్యేకాధికారిగా సత్యప్రసాద్ పనిచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.